
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 320
శనివారం 10-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




ఇప్పుడు చందానగర్‌లో ప్రారంభం!
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
69వ వార్షికోత్సవ
అమ్మకం
MRP ₹ 27,449 ₹ 10,999
₹ 12
MRP ₹ 39,990 ₹ 15,999
MRP ₹ 54,990 ₹ 21,999
69% వరకు తగ్గింపు
డౌన్ పేమెంట్ ₹1
36 నెలలు EMI
ఇప్పుడు కొనండి, మీ మొదటి ఇ.ఎం.ఐ జూన్ 2024లో ప్రారంభమవుతుంది
36 నెలల వరకు ఇ.ఎం.ఐ ఆప్షన్లు కలవు (ప్రత్యేకంగా బాంటియాలోనే)
10 శని వారం 11 ఆది వారం & 12 సోమ వారం
బెడ్‌రూం సెట్ : కింగ్‌సైజ్ బెడ్ + 2 బెడ్‌సైడ్ టేబుల్స్ + 6 డోర్ వార్డ్‌రోబ్ + 2 డ్రెస్సింగ్ మిర్రర్స్
MRP ₹ 1,74,990 ₹ 69,999 EMI ₹ 75
అమెరికన్ సోఫా సెట్ : 3+2+1 + ఉచితం సెంటర్ టేబుల్ రూ. 10,000/- విలువ గలది
FREE
MRP ₹ 97,999 ₹ 39,999 EMI ₹ 43
ఇసబెల్లా లెదర్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1
MRP ₹ 2,14,499 ₹ 99,999 EMI ₹ 108
EMI ₹ 8
ఆఫీస్ టేబుల్ 4'X2' 3 డ్రాస్‌తో + ఉచితం ఛైర్
MRP ₹ 17,490 ₹ 6,999
కాగ్నాక్ బ్రాండెడ్ ఇటాలియన్ లెదర్ సోఫా సెట్ : 3+2
MRP ₹ 3,24,999 ₹ 1,49,999 EMI ₹ 162
బ్లూమ్బెర్రీ రిక్లైనర్ సోఫా సెట్ : 3 సీటర్ 3 రిక్లైనర్స్‌తో + 2 సీటర్ 2 రిక్లైనర్స్‌తో 4 కప్ హోల్డర్స్ + 4 స్టోరేజ్ క్యాబినెట్స్ + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹ 1,89,999 ₹ 69,999 EMI ₹ 75
ఉచితం
ఎల్ టైప్ / లౌంజర్ సోఫా సెట్
MRP ₹ 62,999 ₹ 19,999 EMI ₹ 22
కేంబ్రిడ్జ్ సోఫా సెట్ 3+2+ ఉచితం 12 డబుల్ కలర్ పిల్లోస్ + ఉచితం సెంటర్ టేబుల్ రూ. 10,000/- విలువ గలది
ఉచితం
MRP ₹ 1,24,999 ₹ 49,999 EMI ₹ 54
మిలన్ సోఫా సెట్ : 3+2 తొమ్మిది పిల్లోస్‌తో (5 ప్లెయిన్, 4 ఫాగ్స్ ఫర్)
MRP ₹ 1,01,499 ₹ 39,999 EMI ₹ 43
ఎల్ టైప్ సోఫా సెట్ + ఉచితం సెంటర్ టేబుల్ రూ. 7,000 విలువ గలది
ఉచితం
MRP ₹ 52,999 ₹ 26,999 EMI ₹ 29
మాన్యువల్ రిక్లైనర్ సోఫా సెట్ : 3+1+1
MRP ₹ 1,11,199 ₹ 44,444 PER DAY EMI ₹ 48
ఎలక్ట్రికల్ రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1
MRP ₹ 1,66,499 ₹ 66,666 PER DAY EMI ₹ 72
ప్రీమియం క్వాలిటీ బెడ్‌రూం సెట్ : హైడ్రాలిక్ బెడ్ 2 బెడ్‌సైడ్ టేబుల్స్‌తో + డ్రెస్సింగ్ టేబుల్‌తోపాటు స్టూలు + 3 డోర్ వార్డ్‌రోబ్
MRP ₹ 2,16,999 ₹ 89,999
₹ 97 EMI
అర్బర్ ఇటాలియన్ మార్బుల్ డైనింగ్ టేబుల్ (సైజ్ 6X3 అడుగులు)
MRP ₹ 62,999 ₹ 29,999 EMI ₹ 32
యాంటియాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 ఛైర్స్ + 1 బెంచ్)
MRP ₹ 54,999 ₹ 26,999 EMI ₹ 29
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్
4 ఛైర్లతో MRP ₹ 37,490 ₹ 14,999 EMI ₹ 16
6 ఛైర్లతో MRP ₹ 56,999 ₹ 19,999
సింగిల్ సైజ్ మెటల్ కాట్
MRP ₹ 10,499 ₹ 4,999
EMI ₹ 5
కింగ్ సైజ్ MRP ₹ 14,499 ₹ 6,999
బాటమ్ డ్రా స్టోరేజ్‌తో బెడ్
క్వీన్ సైజ్ MRP ₹ 42,499 ₹ 18,999 ₹ 20 EMI
కింగ్ సైజ్ MRP ₹ 43,999 ₹ 19,999
బెండ్ గ్లాస్ డైనింగ్ టేబుల్ 4 ఛైర్లతో
EMI ₹ 11
MRP ₹ 23,999 ₹ 9,999
ప్రీమియం ఉడెన్ డైనింగ్ టేబుల్
4 ఛైర్లతో MRP ₹ 38,999 ₹ 15,999 EMI ₹ 17
6 ఛైర్లతో MRP ₹ 54,499 ₹ 21,999
MRP ₹ 13,499 ₹ 5,999 EMI ₹ 6
సింగిల్ బెడ్
ఫ్రాన్స్ ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
MRP ₹ 7,490 ₹ 2,999
ఉ. 10 గం.ల లోపు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయండి, అదనంగా 5% తగ్గింపు పొందండి కూపన్‌కోడ్ : Bantia26jan ఉపయోగించండి www.bantia.in
ఎక్స్ఛేంజ్ 20% వరకు తగ్గింపు
మ. 1 గం.లోపు షాపింగ్ చేయండి
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
79950 00930 / 040-2784 1562 / 79933 33351
సికింద్రాబాద్ | ఎ.ఎస్.రావు నగర్ | నాగోల్ | హైటెక్ సిటీ | కొంపల్లి | కర్మన్‌ఘాట్
దిల్‌సుఖ్‌నగర్ | బోడుప్పల్ | కూకట్‌పల్లి | వరంగల్ | అత్తాపూర్ | సిద్దిపేట్ | జగిత్యాల్ | చందానగర్ జిఎస్ఎమ్ మాల్ వద్ద

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 320
శనివారం 10-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

ఆర్థిక సంస్కరణల రూపశిల్పికి దేశ అత్యున్నత పౌర పురస్కారం

పీవీకి భారతరత్న



మాజీ ప్రధాని చరణ్‌సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా..

- 'ఎక్స్'వేదికగా వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోదీ
- తెలుగు తేజానికి ఎట్టకేలకు సముచిత గౌరవం
- పార్టీలకతీతంగా స్వాగతించిన నేతలు, ప్రముఖులు
- దేశానికి వారి సేవలు చిరస్మరణీయం: ప్రధాని
- పీవీకి భారతరత్నపై సీఎంలు రేవంత్, జగన్ హర్షం
- ప్రధాని మోదీ దార్శనికతకు నిదర్శనం: పీవీ కుమార్తె వాణీదేవి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు తేజం, దివంగత ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావుకు ఎట్టకేలకు దేశ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. సార్వత్రిక ఎన్నికల వేళ ఆయనకు కేంద్రం భారత రత్న ప్రకటించింది. మరో దివంగత ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌లను కూడా ఈ అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం 'ఎక్స్'వేదికగా ఈ మేరకు వెల్లడించారు. ఆ ముగ్గురు దిగ్గజాలూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివంటూ గుర్తు చేసుకున్నారు. ''పీవీ ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశను, ఆర్థిక రంగానికి నూతన జవసత్వాలను ప్రసాదించాయి. ఇక చరణ్‌సింగ్ రైతు సంక్షేమానికి ఆజన్మాంతం పాటుపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆహార రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడంలో కీలకపాత్ర పోషించారు''అంటూ ప్రధాని కొనియాడారు. తర్వాత కాసేపటికే ఈ ముగ్గురికీ భారతరత్న ఇస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ ప్రధాని పదవి చేపట్టి ఆర్థిక సంస్కరణలతో ప్రగతి బాట పట్టించిన రాజనీతిజ్ఞుడు పీవీ. అంతర్గత భద్రత మొదలుకుని విదేశాంగ విధానం దాకా, ఆర్థిక రంగం నుంచి రైతు సంక్షేమం దాకా అన్ని అంశాల్లోనూ చెరగని ముద్ర వేసిన ఆయన 2004లో మరణించారు. ఇక చరణ్‌సింగ్ పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాట్ నేత. కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాల్లో మిగతా 10వ పేజీలో ▶

'ఆర్థిక' భారతానికి ఊపిరి పీవీ
మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు విజయవంతంగా నడిపిన రాజకీయ దురంధరుడు 10లో

హరిత విప్లవ సారథి
దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఎంఎస్ స్వామినాథన్
కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు 16లో

రైతు బాంధవుడు చరణ్‌సింగ్
అన్నదాతల హక్కుల కోసం పోరాటం
వారి సంక్షేమం, సాధికారతే ధ్యేయంగా చట్టాలకు రూపకల్పన 16లో

మేడిగడ్డ చూద్దాం రండి

- 13న అన్ని పక్షాలను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధం
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- మేడిగడ్డ మేడిపండు ఎలా అయిందో అందరూ చూడాలి.. ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా రావాలి
- ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా కాకుండానే శాపనార్థాలా?
- ప్రజా ప్రయోజనం కోసం విపక్షం సలహాలు, సూచనలివ్వాలి



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ వాస్తవ పరిస్థితి పరిశీలనకు ఈనెల 13వ తేదీన అన్ని పక్షాలను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. మేడిగడ్డ మేడిపండు ఎలా అయిందో అందరూ చూడాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ కూడా రావాలని కోరారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు హాజరుకాకుండా ఆ కుర్చీని ఖాళీగా ఉంచడం సభకు శోభ తెస్తుందా? అని ప్రశ్నించారు. 80 వేల పుస్తకాలు చదివిన ఆయన విజ్ఞానం రాష్ట్ర పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. మేడిగడ్డపై విచారణ జరుగుతోందని, కొన్ని నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టే వీలుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా కాకుండానే విపక్షం పిల్లి శాపనార్థాలు పెట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. గడీల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు నిచ్చారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజా ప్రయోజనం కోసం విపక్షం సలహాలు, సూచనలివ్వాలని కోరారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం శాసనసభలో జరిగిన మిగతా 2వ పేజీలో ▶

ఆటోవాలాల పొట్టగొడతారా?

- 'మహాలక్ష్మి'కి మేం వ్యతిరేకం కాదు.. కానీ రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి
- నెలకు రూ. 10వేలు చొప్పున సాయం ప్రకటించాలి
- సభలో బీఆర్‌ఎస్ డిమాండ్
- పేద ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ స్పష్టీకరణ
- యాదా నిధులను కవిత దుర్వినియోగం చేశారని ఆరోపణ
- ఆ ఆరోపణలు ఉపసంహరించుకోవాలంటూ వెల్‌లోకి వచ్చిన బీఆర్‌ఎస్ సభ్యులు
- ఆ వ్యాఖ్యలు తొలగించాలని డిమాండ్.. పరిశీలిస్తామన్న స్పీకర్

3లో

'సబ్‌ప్లాన్'ను మాయం చేశారు
- వైఎస్ దానిని ఉదాత్త ఆశయంతో మొదలు పెట్టారు
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని తొలగించి పేదల సంక్షేమాన్ని దెబ్బతీసింది
- అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం

2లో

సీఎం వచ్చి క్షమాపణ చెప్పాలి
మండలిలో బీఆర్‌ఎస్ సభ్యుల పట్టు
- వివరాలు 2లో

నేటి నుంచి 'బండి'యాత్ర
- మీ కోసం ప్రజాహిత యాత్రనై వస్తున్నా.. ఆశీర్వదించండి
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు బండి సంజయ్ బహిరంగ లేఖ -3లో



అంతా ఆయన చెబితేనే చేశా..

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ కన్ఫెషన్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు... సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ చెబితేనే ఫైల్స్ క్లియర్ చేసినట్టు శివబాలకృష్ణ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి కథ రోజుకో మలుపు తిరుగుతోంది. మరికొన్ని కీలక పాత్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. 'అంతా ఆ అధికారి చెబితేనే చేశాను'అంటూ ఏసీబీ అధికారుల వద్ద శివబాలకృష్ణ చెప్పినట్టు సమాచారం. నాటి పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ ఈ మొత్తం అవినీతి వ్యవహారం వెనుక కీలక వ్యక్తి అని ఏసీబీకి ఇచ్చిన మిగతా 5వ పేజీలో ▶


ప్రధాని మోదీకి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పోలవరానికి సహకరించండి

ప్రధానికి ఏపీ సీఎం జగన్ వినతి
నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై విజ్ఞాపనలు
5లో

2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పద్దు.. 3లక్షల కోట్లు?



- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి, మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు
- 6 గ్యారంటీలు, ప్రాధాన్యత వారీగా ప్రాజెక్టులకు కేటాయింపులు
- రైతు భరోసా మినహా పాత పథకాల కొనసాగింపు అనుమానమే

10లో

ఓటుకు కోట్లు కేసులో సీఎం రేవంత్‌కు సుప్రీం నోటీసులు

- తెలంగాణ ప్రభుత్వానికి, సండ్ర వెంకట వీరయ్యకు కూడా..
- కౌంటర్ దాఖలుకు ఆదేశం..
- ఈ కేసును మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేయాలన్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు
- కేసులో నిందితుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ సీఎం అయ్యారని వెల్లడి
- రాష్ట్రంలో న్యాయపరమైన విచారణకు చాన్స్ లేదని స్పష్టీకరణ

5లో

అందరి గురి మల్కాజిగిరి!

- బీజేపీ ఎంపీ టికెట్‌కు భారీ డిమాండ్
- ఆశావహుల జాబితాలో ఈటల, మురళీధర్‌రావు, హరీశ్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, రామచంద్రరావు
- ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ భేటీ... ఒక్కో సీటుకు ఐదుగురి వరకు పేర్ల పరిశీలన -3లో

నాలుగు చోట్ల నెగ్గిన అవిశ్వాసాలు

- పదవులు కోల్పోయిన ఆదిబట్ల, మోత్కూరు, ఆర్మూరు, సదాశివపేట చైర్‌పర్సన్లు

- వివరాలు 5లో

గురుకుల ఉద్యోగులకు ఇంకా జీతాలు రాలే

- మొదట్లో సాంకేతిక సమస్యతో నిలిచాయన్న అధికారులు.. ఇప్పుడు ఫోన్లు కూడా ఎత్తని వైనం
- పదో తేదీ వచ్చినా జీతం రాకపోవడంతో ఆ ఉద్యోగుల ఆవేదన

- వివరాలు 12లో

గ్రూప్–4 పరీక్షల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 8,180 గ్రూప్–4 ఉద్యోగాల భర్తీలో భాగంగా నిర్వహించిన అర్హత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్టును శుక్రవారం తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గ్రూప్–4 ఉద్యోగాల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ 2022 డిసెంబర్‌లో మిగతా 12వ పేజీలో ▶

నేడు అసెంబ్లీకి కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు ప్రతిపక్ష నాయకుడి హోదాలో శనివారం తొలిసారి శాసనసభ సమావేశాలకు హాజరుకానున్నారు. రెండు రోజుల కిందట అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా.. శనివారం రాష్ట్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం, ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు కేసీఆర్ రెండ్రోజులుగా దూరంగా ఉన్నారు. బడ్జెట్‌ను శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెడతారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి నేపథ్యంలో కేసీఆర్ డిసెంబర్ 8న జారిపడి గాయపడ్డారు. తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్.. ఈనెల 1న గజ్వేల్ ఎమ్మెల్యేగా స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈమేరకు బులెటిన్ కూడా విడుదలైంది. ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ తొలిసారిగా సమావేశాలకు హాజరవుతుండటంపై ఆసక్తి నెలకొంది.

లాబీ ముచ్చట్లు

కరీంనగర్ స్మార్ట్ సిటీపై విచారణ: మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ స్మార్ట్‌సిటీ పేరిట జరిగిన అక్రమాలపై విచారణ జరిపిస్తామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. శాసనసభ లాబీలో మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని, కబ్జాకు గురైన భూములను అర్హులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు భూ కబ్జాలకు సంబంధించి 600 వరకు ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ జరపాలని ఆదేశించానని పొన్నం చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో పారదర్శకత పాటిస్తామని, ఒకే చోట చాలాకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పిస్తామన్నారు. ఉన్నతాధికారుల అండతో ఒకే చోట పాతుకుపోయిన అధికారులను ప్రాధాన్యం లేని చోటుకు బదిలీ చేస్తామని వెల్లడించారు. ఇదే అంశంపై మాజీ మంత్రి గంగుల కమలాకర్ అసెంబ్లీ లాబీలో స్పందించారు. తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన మంత్రి పొన్నంకు ఏ విషయం పూర్తిగా తెలియదని, వారు అధికారంలో ఉన్నందున ఏ అంశంపైనైనా విచారణ జరుపుకోవచ్చన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు రంజిత్‌రెడ్డి దస్తీ వేశారు: మల్లారెడ్డి

సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్ల నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం కర్చీఫ్ వేసుకున్నారని, అది తెలుసుకున్న మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అలర్ట్ అయ్యారని మాజీ మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మల్లారెడ్డి మాట్లాడారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసమే పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు రేవంత్‌రెడ్డిని కలిశారన్నారు. 'కేసీఆర్ కుటుంబంలో మూడు పదవులున్నట్లు మా కుటుంబంలో కూడా మూడు పదవులుండాలని అనుకుంటున్నాం. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం నుంచి నా కుమారుడు భద్రారెడ్డి కేసీఆర్ ఆదేశిస్తే పోటీ చేసేందుకు సిద్ధం. మెదక్ ఎంపీ టికెట్ కోసమే మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి రేవంత్‌ను పొగుడుతున్నాడు'అని వ్యాఖ్యానించారు. గతంలో రేవంత్‌రెడ్డిని జగ్గారెడ్డి తిట్టిన తిట్లు అందరికీ గుర్తున్నాయన్నారు. ఒకవేళ రాజకీయాల నుంచి తప్పుకుంటే గోవాలో తన కున్న హోటల్‌లో ఎంజాయ్ చేస్తానని, మనిషికి ఒకే జీవితం ఉన్నందున ఎంజాయ్ చేయాలని మల్లారెడ్డి అన్నారు.

మంత్రులంతా నాకు జూనియర్లు: వినోద్



సాక్షి, హైదరాబాద్: మంత్రి పదవుల విషయంలో కాంగ్రెస్ సీనియర్ శాసన సభ్యుడు గడ్డం వినోద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పుడున్న మంత్రులంతా తనకంటే జూనియర్లని వ్యాఖ్యానించారు. మంత్రుల విషయంలో నిర్ణయాలు తీసుకునే ముందు సీనియర్లను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. కానీ సీనియర్లను ఎవరూ పట్టించుకోవడం లేదని వినోద్ వ్యాఖ్యానించారు.

బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లను కేటాయించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా బీసీలకు రూ.లక్ష కోట్లను కేటాయిస్తామన్న కాంగ్రెస్ తన హామీ నిలబెట్టుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వారిది ఫెవికాల్ బంధం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ అనేకసార్లు మద్దతిచ్చింది

- పార్టీ అంతర్గత విషయంలోనూ మోదీ మద్దతు కేసీఆర్ కోరారు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు.. తమ మధ్య ఎలాంటి బంధం లేదన్న పోచారం




అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలది ఫెవికాల్ బంధమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. '2014 నుంచి 2023 వరకు పార్లమెంటులో ఏ సందర్భం వచ్చినా బీజేపీ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ మద్దతునిచ్చింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్, నోట్ల రద్దు, జీఎస్టీ, రైతు వ్యతిరేక నల్లచట్టాలు లాంటి వందల బిల్లుల ఆమోదానికి బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు తెలిపింది..'అని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీకి, బీఆర్‌ఎస్‌కు మధ్య సంబంధం ఉందంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎంఐఎంతో మాత్రమే తాము స్నేహపూర్వకంగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని మాట్లాడారు.

పదేళ్ల పాటు రెండు పార్టీలదీ ఒకే ఆలోచన

'బీజేపీ, బీఆర్‌ఎస్ గత పదేళ్లుగా ఒకే ఆలోచనతో ప్రభుత్వాలు నడిపాయి. ఆ రెండు పార్టీలు కలిసి చర్చించుకుంటాయి. బీఆర్‌ఎస్ అంతర్గత విషయంలోనూ మోదీ మద్దతు కోరారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కొంత మంది మంత్రులు అవిశ్వాసం ప్రకటించి కేటీఆర్‌ను సీఎం చేయాలని చూశారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక కేసీఆర్ మోదీ దగ్గరకు వెళ్లి కేటీఆర్‌ను సీఎం చేస్తానన్నాడు. అయితే వారసత్వ రాజకీయాలను తాను సమర్థించనంటూ కేసీఆర్‌తో అన్నానని, మోదీ మన రాష్ట్రానికి వచ్చినప్పుడు చెప్పారు. బీజేపీతో సంబంధాలు లేకపోతే కేసీఆర్‌కు మోదీ అనుమతి ఎందుకు? కేసీఆర్ పార్టీ అంతర్గత వ్యవహారంలోనే మోదీ అనుమతి కోరారంటే, బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధమేనని స్పష్టమవుతోంది. 2011లో శాసనమండలి ఎన్నికల సందర్భంగా కూడా బీజేపీ, అప్పటి టీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకున్నాయి. అప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, లక్ష్మీనారాయణలు టీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటేశారు. అలాగే ఆనాడు ముగ్గురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, కావేటి సమ్మయ్య, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు లు కిరణ్‌కుమార్‌రెడ్డికి అనుకూలంగా ఓటేశారు. ఆ ముగ్గురు టీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటేయకుండా కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతు ఇచ్చినందుకే కేసీఆర్ వారిని పార్టీ నుంచి బహిష్కరించారు. అప్పుడు ఆ ఎమ్మెల్యేలు 'మీ అల్లుడు'ఓటేయమని చెపితే వేశామని, ఆయన్ను ఏమనకుండా మమ్మల్ని ఎలా పార్టీ నుంచి బహిష్కరిస్తారంటూ నిలదీశారు. దీంతో తిరిగి 2014లో వారికి కేసీఆర్ టిక్కెట్లు ఇచ్చారు. కేసీఆర్ సొంత పార్టీ నేతలకు కూడా ముఖ్యమైన విషయాలు చెప్పరు. కొన్ని చెపుతారు.. కొన్నింటిని దాస్తారు..'అంటూ రేవంత్ ధ్వజమెత్తారు.



సీఎంను మార్చాలంటే ఎవరి అనుమతి అవసరం లేదు: పోచారం

సీఎం వ్యాఖ్యలపై పోచారం స్పందించారు. 'రేవంత్‌రెడ్డి, మేమంతా కలిసి పనిచేశాం. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య ఎలాంటి బంధం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ ఓడించింది. సీఎంను మార్చాలంటే ఎవరి అనుమతి అవసరం లేదు. బీఆర్‌ఎస్‌కే అప్పుడు 100 మంది ఎమ్మెల్యేల మెజారిటీ ఉంది. అధికారం వస్తది పోతది. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని కోరుకుంటున్నా. రేవంత్‌రెడ్డి చిన్న వయస్సులో సీఎం అయినందుకు మాకు ఎలాంటి ఈర్ష్య లేదు. ప్రజలు మమ్మలి ఇక్కడ.. వాళ్లను అక్కడ కూర్చోబెట్టారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు మా సహకారం ఉంటుంది..'అని అన్నారు.

కేసీఆర్ కొట్లాడి తెలంగాణ తెచ్చారు: పల్లా

మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీలే తెలంగాణ ఇచ్చారని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొనడంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణను తెచ్చింది కేసీఆరేనన్నారు. బ్రిటిష్‌వారు దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వలేదనీ, అది పోరాడి సాధించుకున్నదని చెప్పారు. అలాగే తెలంగాణ ఇవ్వడంలో కాంగ్రెస్ భాగస్వామ్యం ఉండొచ్చేమో కానీ, కొట్లాడి తెచ్చింది మాత్రం కేసీఆరేనన్నారు.

సుష్మాస్వరాజ్‌ను మరిచారు: పాయల్ శంకర్

తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో బీజేపీ నేత సుష్మాస్వరాజ్ ఉన్న విషయాన్ని ప్రభుత్వం మరిచిందని ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల గురించి మాత్రమే చెబుతున్నారని, మిగతా హమీలకు గ్యారంటీ లేదా అని ఎద్దేవా చేశారు. తాము బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల్లో ఎవరికీ దగ్గరగా లేమన్నారు.

వైఎస్సార్ లేని లోటును పూడ్చలేం: అక్బరుద్దీన్

మూసీ నది సుందరీకరణ వ్యవహారం మూడు దశాబ్దాలుగా చర్చల్లోనే ఉందని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ అన్నారు. ఈ విషయంపై అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనను పిలిపించి మాట్లాడారని, ఈ ప్రాజెక్టు చేద్దామని తనతో చెప్పారని గుర్తు చేశారు. అయితే దురదృష్టవశాత్తూ ఆయన అకస్మాత్తుగా చనిపోయారని, ఆయనలేని లేని లోటు పూడ్చలేమని, ఆయన్ను తాము ఎంతో మిస్ అవుతున్నామని చెప్పారు. మూసీని సుందరీకరించాలన్న వైఎస్సార్ ఆలోచనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాకారం చేయాలని కోరారు. ఇక హైదరాబాద్ మెట్రో రైలుపై తాను చేసిన ప్రతిపాదనను కూడా అప్పట్లో వైఎస్సార్ అంగీకరించి, ఢిల్లీకి కలిసి వెళ్లి అక్కడి మెట్రో రైలును పరిశీలిద్దామని చెప్పారని అక్బరుద్దీన్ గుర్తు చేశారు. కాగా దళితబంధు లబ్ధిదారులను ఎమ్మెల్యేలు కాకుండా ప్రభుత్వమే గుర్తించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 వేల మంది నర్సులకు పోస్టింగ్‌లు ఇవ్వడంపై అభినందనలు తెలిపారు. దావోస్ నుంచి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని అభినందించారు. రంజాన్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

'సబ్‌ప్లాన్'ను మాయం చేశారు

- దివంగత నేత వైఎస్ దానిని ఉదాత్త ఆశయంతో మొదలు పెట్టారు
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని తొలగించి పేదల సంక్షేమాన్ని దెబ్బతీసింది: ఎమ్మెల్యే వేముల



సాక్షి, హైదరాబాద్: దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉదాత్త ఆశయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ విధానాన్ని ప్రారంభించి, ఆయా వర్గాల పేదల సంక్షేమానికి చర్యలు తీసుకుంటే, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని తొలగించి పేదల సంక్షేమాన్ని దెబ్బతీసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ ప్లాన్ నిధులతో ఆయా వర్గాల వారికి ఎంతో లబ్ధి కలిగిందని, సంక్షేమ పథకాలకు సంబంధించి ఒక్కో గ్రామానికి పది వరకు యూనిట్లు దక్కాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం ఆ విధానాన్ని తొలగించి, దళితబంధు పేరుతో నిధులు పక్కదారి పట్టించిందని ఆరోపించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చను ప్రారంభించారు. ఆయన ప్రసంగం ప్రారంభించగానే బీఆర్‌ఎస్ సభ్యులు తమ పార్టీ నుంచి వెళ్లిపోయి మాట్లాడుతున్నావంటూ వ్యాఖ్యానించారు. 'నన్ను ఓ మనిషిగా చూడలేని మిమ్మల్ని వదిలి ఆదరించిన కాంగ్రెస్‌లో చేరి గెలిచా. అన్నీ చెప్తా.. వినే ఓపిక ఉందా, నన్ను గెలకొద్దు, గెలికించుకోవద్దు'అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణస్వీకారం చేస్తూనే తెలంగాణ సమాజం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవటం ప్రారంభించిందన్నారు.

అంతా బాగుంటే ప్రజలు ఎందుకు ఓడించారు

దొరల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తమను గెలిపించారని, దొరల పాలనకు గుర్తుగా ఉన్న ప్రగతి భవన్ కంచెలు తొలగించామని వీరేశం పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేశామని గత ప్రభుత్వంలో గొప్పలు చెప్పుకొన్నారని, మరి సంక్షేమం బాగుంటే ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను చైతన్యపరిచేందుకు కృషి చేసిన గద్దర్‌ను ప్రగతి భవన్‌లోకి అనుమతించకుండా అవమానించారని, ఇప్పుడు ఆయన సేవలను తమ ప్రభుత్వం తగు రీతిలో గౌరవించుకుంటోందన్నారు.

అబద్ధానికి ప్రతిరూపం కేసీఆర్: యెన్నం

అబద్ధానికి ప్రతిరూపంగా కేసీఆర్ నిలుస్తారని అధికార పక్ష సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కృష్ణానదికి కాళ్లు అడ్డుపెట్టి పాలమూరును సస్యశ్యామలం చేస్తామని ఎంపీగా అక్కడి నుంచి గెలిచి, ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కూడా మహబూబ్‌నగర్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని.. కానీ, నాలుగు సార్లు దావోస్ వెళ్లి రూ.19 వేల కోట్లకు మించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోలేకపోయిందని యెన్నం ఎద్దేవా చేశారు. అయితే సీఎంగా బాధ్యతలు తీసుకున్న వెంటనే దావోస్ వెళ్లి ఏకంగా రూ.40 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్న ఘనత రేవంత్‌దన్నారు.

మేడిగడ్డ చూద్దాం రండి

▶ మొదటి పేజీ తరువాయి

చర్చకు సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

ఉద్యమ సమయంలోనే టీజీగా రాసుకున్నారు

'తెలంగాణ రాష్ట్రానికి సూచికగా టీజీ అక్షరాలు ఉండాలన్నది ప్రజల ఆకాంక్ష. ఉద్యమ సమయంలో యువత రక్తంతో దీన్ని రాసుకుంది. తర్వాత టీజీని కేంద్రం నోటిఫై చేసినా బీఆర్‌ఎస్ విస్మరించింది. బీఆర్‌ఎస్ సర్కార్ దానిని టీఎస్‌గా మార్చడం వారి అహంకారానికి ప్రతీక. అయితే దీన్ని మేము టీజీగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నాం. రాచరికపు ఆనవాళ్లను స్ఫురింపజేసేలా బీఆర్‌ఎస్ సర్కార్ అధికార చిహ్నం రూపొందిస్తే, మేం దాన్ని ప్రజాస్వామ్య చిహ్నంగా మార్చాం. అలాగే దళిత బిడ్డ రాసిన తెలంగాణ ఉద్యమ గీతం 'జయ జయహే తెలంగాణ'కన్పించకుండా కేసీఆర్ సర్కార్ కుట్ర చేసింది. కానీ మా సర్కార్ దాన్ని రాష్ట్రీయ గీతంగా ఆమోదించింది..'అని సీఎం చెప్పారు.

ప్రజాపాలనపై సత్యదూరమైన ఆరోపణలు

'ప్రజాపాలనపై విపక్షం సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది. ప్రతి మంగళవారం, శుక్రవారం మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పినదాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. 12 శాఖలకు చెందిన 21 మంది అధికారులను అందుబాటులో ఉంచాం. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో అవకతవకల వల్లే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. మేము మేనేజ్‌మెంట్ కోటా కింద వచ్చిన వాళ్ళం కాదు. ప్రజాక్షేత్రం నుంచి వచ్చాం. అందుకే ప్రభుత్వం ఏర్పడ్డ మరుక్షణమే ప్రగతి భవన్ కంచెలు తొలగించాం. కాళోజీ కవిత్వం గురించి చెప్పే బీఆర్‌ఎస్ నేతల పాలనలో కాళోజీ కళాక్షేత్రం ఎందుకు పూర్తి కాలేదు..'అని రేవంత్ ప్రశ్నించారు.

ఆటోరాయుళ్ల హైడ్రామా

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో డ్రైవర్లకు అన్యాయం జరుగుతోందంటూ వాళ్ళను రెచ్చగొట్టడం రాజకీయమే. జూనియర్ ఆర్టిస్టుల తరహాలో ఆటోరాయుళ్ళు ఆటో లెక్క అసెంబ్లీకి రావడం, ఆటోలో కూడా కెమెరా పెట్టడం ఓ హైడ్రామా. ఉచిత బస్సు ప్రయాణాన్ని ఇప్పటికే 15.21 కోట్ల మంది ఉపయోగించుకున్నారు. రూ.535.52 కోట్లు ఆర్టీసీకి ఇచ్చాం. మహిళలు ఈ సదుపాయం వినియోగించుకుని గుళ్ళకు వెళ్ళడం వల్ల దేవాదాయ శాఖ ఆదాయం నవంబర్‌లో రూ.49.28 కోట్లు ఉంటే, డిసెంబర్‌లో రూ.93.24 కోట్లకు పెరిగింది. జనవరిలో కూడా రూ.68.69 కోట్ల ఆదాయం వచ్చింది..'అని సీఎం వివరించారు.

ఇక మొదటి తేదీనే జీతాలు

'మేము అధికారంలోకి రాగానే ప్రభుత్వం దివాలా తీసిందనడం ఏమిటి? పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టి తెగిపోతుందా? ఉద్యోగులు, పెన్షనర్లకు 25వ తేదీ దాకా జీతాలు ఇవ్వలేని చరిత్ర వాళ్ళది. మేము 4వ తేదీలోగానే జీతాలు ఇస్తున్నాం. వచ్చే నెల నుంచి మొదటి తేదీనే ఇస్తాం. రైతు బంధు వేయడం లేదంటూ విపక్షం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో 2018–19లో యాసంగి రైతుబంధు వేయడానికి 5 నెలలు, 19–20లో 9 నెలలు, 20–21లో 4 నెలలు, 22–23లో 4 నెలలు తీసుకున్నారు. ఇలాంటి వాళ్లు మమ్మల్ని విమర్శించడం ఏమిటి? పెన్షన్లు 80 శాతం చెల్లించాం. మిగిలినవి 15వ తేదీలోగా చెల్లిస్తాం..'అని రేవంత్ తెలిపారు.

గ్రూప్–1 పరీక్షల వయోపరిమితిని 46 ఏళ్ళకు పెంచుతాం

'ఉద్యోగాల కల్పన మా విధానం. మేం వచ్చిన రెండు నెలల్లోనే 6,956 స్టాఫ్ నర్సుల నియామకం, సింగరేణిలో 441 కారుణ్య నియామకాలు చేపట్టాం. త్వరలోనే 15 వేల పోలీసు నియామకాలు చేపడతాం. గ్రూప్–1 పరీక్షల వయోపరిమితిని 46 ఏళ్ళకు పెంచి నియామకాలు చేపడతాం. పాలక మండలి రాజీనామా చేయకపోవడం వల్లే ఆలస్యం జరిగింది. 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న బీఆర్‌ఎస్ ఎన్ని ఇచ్చిందో చెప్పాలి.

కృష్ణా జలాలపై వాగ్వాదం

కృష్ణా జలాలపై కేంద్రానికి అధికారం ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనంటూ రేవంత్ చేసిన విమర్శ సభలో వాగ్వాదానికి దారి తీసింది. కృష్ణా బోర్డు వద్ద సంతకాలు చేసి రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీశారని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కృష్ణా ప్రాజెక్టులపై అధికారం ఇచ్చేందుకు రాష్ట్ర సర్కార్ ఆమోదం తెలిపిందంటూ బోర్డ్ మినిట్స్‌ను ఆయన ప్రస్తావించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ బదులిస్తూ తాము దాన్ని వ్యతిరేకించామని, అధికారులు కేంద్రానికి లేఖ కూడా ఇచ్చినట్టు తెలిపారు. బోర్డు నిర్ణయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అంగీకరించి బడ్జెట్‌లో నిధులు కూడా ఇచ్చిందన్నారు. తమ షరతులకు అంగీకరిస్తేనే నిధులు ఇస్తామని చెప్పామని, అది జరగలేదు కాబట్టే నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు బదులిచ్చారు. ఆ తర్వాత సభ శనివారానికి వాయిదా పడింది.

మైనార్టీలకు పెద్దపీట వేసిన వైఎస్

సీఎం పేషీలో మైనార్టీలకు వైఎస్ రాజశేఖరరెడ్డి పెద్ద పీట వేశారు. ఆ సంప్రదాయాన్ని మేము కొనసాగిస్తున్నాం. కేసీఆర్ పాలనలో వాళ్ళ కుటుంబ సభ్యులకే కారుణ్య నియామకాలు దక్కాయి. త్వరలోనే వర్సిటీల్లో వీసీల నియామకం చేపడతాం. ప్రొఫెసర్ జయశంకర్ పేరు చెప్పుకునే బీఆర్‌ఎస్ నేతలు, తాను పుట్టిన ఊరును రెవెన్యూ గ్రామం చేయాలన్న ఆయన చివరి కోరికను కూడా పట్టించుకోలేదు. మేము దాన్ని నెరవేర్చాం. ఆదివాసీల పోరాట యోధుడు కొమరం భీంను కూడా విస్మరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వారి వారసులను ఆదుకుంది. ఇంద్రవెల్లి అమర వీరులను కూడా ఆదుకున్నాం. కవి గూడ అంజన్న చనిపోతే కేసీఆర్ కనీసం పరామర్శించలేదు. ప్రగతి భవన్ వద్ద గద్దర్ 3 గంటల పాటు నిరీక్షించేలా చేశారు. మేము ఆయన ఉద్యమ స్ఫూర్తి గుర్తుండేలా ఆయన పేరుతో పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించాం. తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన శ్రీకాంతాచారి తల్లిని ఓడించింది ఎవరు..'అని రేవంత్ ప్రశ్నించారు.



శుక్రవారం పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్, సీతక్క, సురేఖ, రాజనర్సింహ, పొన్నం

ఆన్‌లైన్ ద్వారా సమ్మక్క–సారలమ్మలకు 'బంగారం'

సదుపాయాన్ని ప్రారంభించిన రేవంత్

సాక్షి, హైదరాబాద్: మేడారం సమ్మక్క–సారలమ్మలకు ఆన్‌లైన్ ద్వారా నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించే కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల కోసం .. అమ్మవార్లకు ఇచ్చే నిలువెత్తు బంగారాన్ని సమర్పించే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం తన మనవడు రియాన్ష్ పేరిట నిలువెత్తు బంగారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. అలాగే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఈ సందర్భంగా తన మనవరాలి నిలువెత్తు బంగారాన్ని ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, పలువురు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మేడారంలో ప్లాస్టిక్ వినియోగం నిషేధిస్తూ పోస్టర్

మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ, జాతరను పరిశుభ్రంగా జరుపుకోవాలని భక్తులను కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఓ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు.

సీఎం వచ్చి క్షమాపణ చెప్పాల్సిందే

మండలిలో బీఆర్‌ఎస్ సభ్యుల పట్టు

- సభ్యులపైన ఓ న్యూస్ చానల్‌లో రేవంత్ వాఖ్యలపై దుమారం
- చైర్మన్ పోడియం ముందు బైఠాయించి నిరసనలు
- ఐదుసార్లు వాయిదా పడ్డ పెద్దల సభ



స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన శాసనమండలి తొలిరోజు రసాభాసగా మారింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరగకుండానే ముగిసింది. శాసనమండలి సభ్యులపైన ఓ టీవీలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి హౌజ్‌లోకి వచ్చి సభ్యులకు క్షమాపణ చేప్పేవరకు సభను ముందుకు సాగనివ్వమని బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో శుక్రవారం నాటి సెషన్ ఐదుసార్లు వాయిదా పడింది. అయినప్పటికీ బీఆర్‌ఎస్ సభ్యులు వెనక్కు తగ్గకపోవడంతో సభ ను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో ధన్యవాద తీర్మానంపై చర్చ కు అవకాశం లేకుండా పోయింది. శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉండటంతో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఉంటుందా? లేదా? చూడాలి.

సభ ప్రారంభంలోనే గందరగోళం

ఉదయం సభ ప్రారంభం కాగా... చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముందుగా సభలోకి కొత్తగా వచ్చిన ఇద్దరు సభ్యులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌కు స్వాగతం పలికారు. అనంతరం బడ్జెట్ సమావేశాలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఇంతలో బీఆర్‌ఎస్ సభ్యులు భానుప్రసాద్ మాట్లాడుతూ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శాసనమండలి సభ్యులపైన సీఎం రేవంత్‌రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సీఎం హౌజ్‌లోకి వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ సభ్యులు సైతం గొంతు కలపడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కలగజేసుకుంటూ సీఎం వాఖ్యల అంశాన్ని ప్రివిలేజ్ కమిటీ పరిశీలనకు పంపామనీ, సభ్యులు ఈ అంశంపై నోటీసు ఇస్తే చర్చకు అవకాశం కల్పిస్తానన్నారు. అయినప్పటికీ బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన విరమించకుండా సీఎం రావాల్సిందేనంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో సభను పదినిమిషాలు వాయిదా వేశారు.

బీఆర్‌ఎస్‌కు మాట్లాడే అర్హత లేదన్న జూపల్లి

ఆ తర్వాత సభ ప్రారంభం కాగానే బీఆర్‌ఎస్ సభ్యులు అదే తీరును ప్రదర్శించారు. చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఒకరిద్దరు సభ్యులు పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావును ప్రభుత్వం తరపున మాట్లాడాలని చైర్మన్ కోరగా జూపల్లి స్పందిస్తూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కానీ సభ్యులు నినాదాలతో హోరెత్తించడంతో మంత్రి వారి వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పెగులు కలిపే వ్యక్తికి రాజ్యసభను పంపించిన బీఆర్‌ఎస్‌కి మండలిలో మాట్లాడే అర్హత లేదన్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పడం సాంప్రదాయమని, సభ గౌరవాన్ని కాపాడాలని కోరారు.

పెద్దల సభకు గౌరవం ఇవ్వాలి: జీవన్‌రెడ్డి

అనుభవం ఉన్న వ్యక్తులు మండలికి వస్తారని, పెద్ద మనుషులు ఉండే పెద్దల సభను అగౌరవం పర్చేలా బీఆర్‌ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రివిలేజ్ కమిటీని ఏర్పాటు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సభ్యులు వెనక్కు తగ్గకపోవడంతో సభ పలుమార్లు వాయిదాపడుతూ వచ్చింది.

అవినీతిని కక్కిస్తేనే హీరో!

శాసనసభలో కూనంనేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అవినీతిపరులు దోచుకున్న రూ.వేలకోట్ల ప్రజాధనాన్ని కక్కించి వారిని జైలులో వేయాలని, అప్పుడే సీఎం రేవంత్‌రెడ్డి హీరో అనిపించుకుంటారని సీపీఐపక్ష నేత కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో, దేశంలో అనకొండకు మించిన అవినీతి జరుగుతోందని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవా రం కూనంనేని సభలో మా ట్లాడుతూ...ఇటీవల అరెస్టైన అధికారి శివబాలకృష్ణ దగ్గర అన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? మాజీ సీఎస్ సోమేశ్‌పై అవినీతికి బాధ్యత ఎవరిది? అని ప్రశ్నించారు. ఎన్ఐఏ వేధింపులు ఎదుర్కొంటున్న వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపా ల్, సాయిబాబాల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు.

ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే.. బీఆర్‌ఎస్ చేసిందేమిటి?

శాసనసభలో సీఎం రేవంత్

- ఏపీ 12.5 టీఎంసీల నీళ్లు వాడుకునేందుకు వీలుగా ప్రాజెక్టులు కట్టింది
- తెలంగాణలో కనీసం 2 టీఎంసీలు వాడుకునే ప్రాజెక్టులు కూడా లేవు
- రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ ప్రభుత్వం తాకట్టు పెట్టింది

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాలను ఏపీ తరలించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే సహకరించిందని, కేంద్రం వద్ద ఈ దిశగా సానుకూలంగా సంతకాలు చేసింది కేసీఆర్ సర్కారే అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ 12.5 టీఎంసీల నీళ్ళు వాడుకునేందుకు వీలుగా ప్రాజెక్టులు కడితే, తెలంగాణలో కనీసం రెండు టీఎంసీలు వాడుకునే ప్రాజెక్టులు కూడా లేవని విమర్శించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం జరిగిన చర్చకు రేవంత్ బదులిచ్చారు.

కాళేశ్వరంపై నివేదికలు సభలో పెడతాం

'కాళేశ్వరం అవినీతిపై మాట్లాడితే, కృష్ణా ప్రాజెక్టులు అప్పగించారంటున్నారు. రూ.80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. కానీ లక్షా 47 వేల కోట్ల మేరకు అంచనాలు వచ్చాయని, రూ.97,500 కోట్లు ఇప్పటికే కాంట్రాక్టర్లకు ఇచ్చారని, ఇంకో రూ.10 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంతాచేసి కాళేశ్వరం కింద 90 వేల ఎకరాలకు కూడా నీళ్ళు అందలేదన్నది వాస్తవం కాదా? దీనిపై విజిలెన్స్ నివేదికలు సభలో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నాం..'అని రేవంత్‌రెడ్డి అన్నారు.

మరణ శాసనం రాసింది బీఆర్‌ఎస్ సర్కారే

'కృష్ణా ప్రాజెక్టులను కాంగ్రెస్ కేంద్రానికి అప్పగించిందనే వాదనలో అర్థం లేదు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును 2014 పునర్విభజన చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 2014 నుంచి 2023 వరకు బోర్డు సమావేశాలకు వెళ్ళింది వాళ్ళే. ఒక పక్క ఎన్నికలు జరుగుతుంటే ఏపీ పోలీసు లు ఏకే 47 తుపాకులతో నాగార్జున సాగర్ డ్యాంపైకి ఎలా వచ్చారు? వాళ్ళ పులుసు తిని అలుసు ఇచ్చింది బీఆర్‌ఎస్. రాయలసీమకు వెళ్ళి మంత్రి రోజా పెట్టిన రాగి సంగటి, రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్నది మీరు కాదా? మీ కళ్ళ ముందే కదా ముచ్చుమర్రి కట్టింది. మీ కళ్ళ ముందే కదా వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడును 44 వేల క్యూసెక్కులకు పెంచింది. జీవో నంబర్ 203కు నీ ఇంట్లోనే కదా పునాది వేసింది. 8 టీఎంసీలు తరలించేందుకు అనుమతించింది బీఆర్‌ఎస్సే. ఇప్పుడు 12 టీఎంసీలు వెళ్తున్నాయి. రాయలసీమ లిఫ్ట్ 796 ఎఫ్ఆర్ఎల్ వద్ద కట్టారు. ఏపీ ఒక పక్క ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే, మీళ్ళు చేసిందేమిటి? రాజీవ్ గాంధీ టన్నెల్ ప్రాజెక్టులో ఒక్క కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదు. కల్వకుర్తి లిఫ్ట్ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎస్ఎల్‌బీసీ పరిస్థితీ ఇదే. కృష్ణా జలాలపై మరణ శాసనం రాసింది బీఆర్‌ఎస్ సర్కారే. కృష్ణా జలాలు 2015లో కేంద్రానికి అప్పగించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. 811 టీఎంసీల నికర జలాలు ఉమ్మడి ఏపీకి కేటాయిస్తే, 512 టీఎంసీలు ఏపీకి ఇవ్వడానికి అధికారికంగా సంతకం పెట్టింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. తెలంగాణ రైతుల హక్కులను ఏపీకి ధారాదత్తం చేశారు..'అని సీఎం ఆరోపించారు.

క్లుప్తంగా...

రెచ్చగొట్టే వ్యాఖ్యలొద్దు.. ట్రాఫిక్ ఇబ్బందులు కలగొద్దు

నల్లగొండ బీఆర్ఎస్ సభకు షరతులతో కూడిన అనుమతి

నల్లగొండ రూరల్: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డులో 50 ఎకరాల విస్తీర్ణంలో 2 లక్షల మందితో ఈనెల 13న నిర్వహించే భారీ బహిరంగ సభకు పోలీసు శాఖ నుంచి కొన్ని షరతులతో కూడిన అనుమతి వచ్చింది. సభ నిర్వహణ అనుమతి కోసం బీఆర్ఎస్ నాయకులు ఈనెల 7న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తికి వినతిపత్రం అందజేయగా.. సభకు అనుమతి ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభను 13న మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. అలాగే, సభకు పోలీసు శాఖ అనుమతినిస్తూనే కొన్ని షరతులు విధించింది. సభలో వ్యక్తిగత దూషణలు చేయరాదని, కులం మతం ప్రాతిపదికన వ్యాఖ్యలు చేయవద్దని, కించపరిచేలా, రెచ్చగొట్టేలా మాట్లాడరాదని సూచించింది. బహిరంగసభలో బాణసంచా కాల్చరాదని, రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బంది కలిగించరాదని నిబంధనలు విధించింది. నిబంధనలు అతిక్రమిస్తే సభ అనుమతి రద్దు చేస్తామని పోలీస్ శాఖ పేర్కొంది.

తెలంగాణలోనూ ఉమ్మడి పౌరస్మృతి

బీజేపీ ఎంపీ అర్వింద్ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోనూ ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం ఉమ్మడి పౌర స్మృతిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఢిల్లీలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో కేసీఆర్ భూముల కుంభకోణం, కాళేశ్వరం నిర్మాణంలో అవినీతిపై సీబీఐతో దర్యాప్తు జరపించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తెలంగాణలో కేసుల దర్యాప్తుకు సీబీఐకి జనరల్ కన్సెంట్ ఇవ్వాలన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంతో ఎమ్మెల్సీ కవితకు సంబంధం లేకపోతే.. తను తప్పు చేయకపోతే ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)దర్యాప్తునకు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రధానాలయాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ ప్రక్రియ ఆలస్యమైతే బీజేపీ సర్కార్ వచ్చాక.. బుల్డోజర్‌తో దాడి చేస్తామని హెచ్చరించారు.

'మున్నూరుకాపు, గొల్లకురుమ కార్పొరేషన్లు ఏర్పాటు చేయండి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీసీ కులాల అభివృద్ధి కోసం కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్కకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వినతిపత్రం ఇచ్చారు. గొల్ల కురుమ కార్పొరేషన్ ఏర్పాటును కోరుతూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ నేతలు గౌరీ సతీశ్, చరణ్‌కౌశిక్ యాదవ్, లోకేశ్‌యాదవ్‌లు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వీలున్నంత త్వరగా కార్పొరేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలకు మంత్రులు హామీ ఇచ్చారు.

రాహుల్ ప్రసంగాలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయి

బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రసంగాలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఓబీసీ కాదని ఇష్టానుసారంగా మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల వ్యవస్థ గురించి, దేశంపై రాహుల్‌గాంధీకి అసలు అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. మోదీ ముఖ్యమంత్రి కాకముందే వారి కులం ఓబీసీలో చేరిన విషయం రాహుల్‌కు తెలుసా? అని నిలదీశారు. అసలు రాహుల్‌గాంధీ గాంధీయా..?, రాహుల్ ఖానా..?, స్వచ్ఛమైన బ్రహ్మణుడా..? ఆయన పుట్టుక రహస్యం ఏంటనే దానిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బ్రహ్మణుడిని అని చెప్పుకుని తిరిగే రాహుల్ తన సర్టిఫికెట్ బయట పెట్టాలన్నారు. ఇటీవలే మహాత్మా గాంధీ మనవడు గాంధీ వారసత్వాన్ని కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ వాడుకోవద్దని స్పష్టంగా చెప్పారన్నారు.

ఆటోవాలాల పొట్టగొడతారా?

'మహాలక్ష్మి'కి మేం వ్యతిరేకం కాదు

- కానీ రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి
- నెలకు 10వేలు చొప్పున సాయం ప్రకటించాలి
- సభలో బీఆర్ఎస్ డిమాండ్
- పేద ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ స్పష్టీకరణ
- 'యాదా' నిధులను కవిత దుర్వినియోగం చేశారన్న కాంగ్రెస్
- ఆ ఆరోపణలు ఖండిస్తూ వెల్‌లోకి వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు
- వ్యాఖ్యలు తొలగించాలని డిమాండ్.. పరిశీలిస్తామన్న స్పీకర్

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంశం శుక్రవారం శాసనసభలో అధికార కాంగ్రెస్- ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాదోపవాదాలకు కారణమైంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం ఉదయం చర్చ ప్రారంభమైంది. చర్చను కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం ప్రారంభించిన అనంతరం యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ ఇద్దరూ బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును విమర్శిస్తూ ప్రసంగించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తరుణంలో బీఆర్ఎస్ పక్షాన పల్లా రాజేశ్వరరెడ్డి చేసిన వ్యాఖ్యలతో దుమారం మొదలైంది. ప్రజా పాలన అంటూ ఘనంగా చెప్పుకొని చివరకు 30 మోసాలు, 60 అబద్ధాలు అన్నట్టుగా గవర్నర్ ప్రసంగం సాగిందని ఆయన విమర్శించారు.

ప్రజాభవన్‌లో మంత్రుల జాడెక్కడ.. ఆరు నిమిషాలు కూడా లేని సీఎం

ప్రజాభవన్‌లో స్వయంగా తానే విన్నపాలు వింటానని ముఖ్యమంత్రి పేర్కొన్నా ఇప్పటివరకు ఆరు నిమిషాలకు మించి ఉండలేకపోయారని పల్లా రాజేశ్వరరెడ్డి విమర్శించారు. మంత్రులు ఉంటామన్నా వారి జాడ కూడా లేదని, ఉన్నతాధికారులు వస్తారని చెప్పినా వారూ కనిపించటం లేదని, చివరకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే విన్నపాలు నమోదు చేసుకుంటున్నారన్నారు. కొద్ది రోజుల్లో డ్రాప్ బాక్సులు పెట్టి అభ్యర్థనలను వాటిల్లో వేయమనేలా ఉన్నారంటూ ఆయన ఎద్దేవా చేశారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ, ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చాలినన్ని బస్సులు లేకుండా మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదనీ, చాలినన్ని బస్సులు, ట్రిప్పులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పల్లా రాజేశ్వరరెడ్డి చెప్పుకొచ్చారు. ఈ పథకంతో ఆటోవాలాలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికే 21 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వారి కుటుంబాలకు రూ.20 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తరుణంలో మంత్రి శ్రీధర్‌బాబు కలగజేసుకుని, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణపథకాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుంటే స్పష్టం చేయాలని ప్రశ్నించారు. పేద ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని, దీనికి బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదిస్తామని పునరుద్ఘాటించారు. తాము మహిళలకు ఉచిత ప్రయాణాన్ని వ్యతిరేకించటం లేదని, బస్సుల సంఖ్య పెంచాలనీ, ఆటోడ్రైవర్లకు ప్రతినెలా రూ.10 వేలు చొప్పున సాయం అందించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

బెంజికార్లు దిగని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారు: కాంగ్రెస్

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ అమలు చేయాలని బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలగజేసుకుని, ఆర్టీసీ ఉద్యోగులను నాటి ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని గాలికొదిలేసిందని, ఇప్పుడేమో ఆటోడ్రైవర్లను ఆత్మహత్యలవైపు పురిగొల్పుతున్నారని ఆరోపించారు. బెంజ్ కార్లు దిగని ఈ ఫ్యూడల్స్ ఇప్పుడు ఆటోల్లో ప్రయాణిస్తూ వారిని అవమానిస్తున్నారని విమర్శించారు. తమ బంధువైన రిటైర్డ్ ఆర్టీసీ ఈడీని ఆర్టీసీ ఎండీగా నాలుగేళ్లు కొనసాగించి సంస్థను భ్రష్టుపట్టించిన చరిత్ర గత ప్రభుత్వానిదని ఆరోపించారు. పేద మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుండటాన్ని గత పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని, ఆటోడ్రైవర్లను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొంటున్నారని మరో మంత్రి సీతక్క విమర్శించారు.

కవితపై ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య ఆరోపణలు..

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, యాదాద్రి అభివృద్ధి పేరిట యాడాను ఏర్పాటు చేసి వందల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని, సగం నిధులు ఎమ్మెల్సీ కవిత, నాటి మంత్రి జగదీశ్‌రెడ్డికి ముట్టాయని ఆరోపించా రు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెల్‌లోకి వచ్చారు. వారిపై స్పీకర్ ఆగ్ర హం వ్యక్తం చేయటంతో తిరిగి తమ స్థానాల వద్దకు చేరుకున్నారు. సభలో లేని వారి గురించి సభ్యుడు మాట్లాడిన అభ్యంతరకర మాటల్ని రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ సభ్యుడు ప్రశాంతరెడ్డి కోరగా, పరిశీలించి నిర్ణ యం తీసుకుంటానని స్పీకర్ హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్లకు బీఆర్ఎస్ సంఘీభావం

ఆటోల్లో అసెంబ్లీకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న హరీశ్‌రావు, గంగుల, తలసాని, వేముల

సాక్షి, హైదరాబాద్: ఆటో డ్రైవర్లను ఆదుకునే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం అసెంబ్లీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టి తెచ్చే లక్ష్యంతో హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఆటోల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ చేరుకున్నారు. సుమారు 20కి పైగా ఆటోల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, సబిత, సునీత లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి తదితరులు అసెంబ్లీకి వచ్చారు. ప్లకార్డులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పబ్లిక్ గార్డెన్స్ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆటోలను లోపలికి అనుమతించేందుకు పోలీసులు అభ్యంతరం చెప్పడంతో బీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ప్లకార్డులను లాక్కునే క్రమంలో కేపీ వివేకానందతో జరిగిన తోపులాటలో కారు అద్దం పగిలింది. ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభకు, ఎమ్మెల్సీలు శాసనమండలికి కాలినడకన చేరుకున్నారు. నల్ల కండువాలతో శాసనమండలిలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంపై ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

అందరి గురి మల్కాజిగిరి!

- బీజేపీ ఎంపీ టికెట్‌కు భారీ డిమాండ్
- ఆశావహుల జాబితాలో ఈటల, మురళీధర్‌రావు, హరీశ్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, రామచంద్రరావు
- ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ భేటీ... ఒక్కో సీటుకు ఐదుగురి వరకు పేర్ల పరిశీలన



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు పదును పెట్టింది. పార్టీ ముఖ్యులతో ముమ్మర చర్చలు జరుపుతోంది. శుక్రవారం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీ నివాసంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. కె.లక్ష్మణ్, డీకే అరుణ, మురళీధర్ రావు, బండి సంజయ్, ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, జితేందర్ రెడ్డి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలకు అందిన దరఖాస్తులను పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి మూడు నుంచి ఐదుగురి పేర్లు పరిగణనలోకి తీసుకున్నారు. మల్కాజిగిరి స్థానానికి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఈ సీటు కోసం పోటీ పడుతున్నారు. తనకున్న ప్రజాదరణ, రాజకీయ అనుభవాన్ని దృష్టిలోపెట్టుకుని మల్కాజిగిరి సీటు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఇదే సీటును ఆశిస్తున్న మురళీధర్‌రావు.. దశాబ్దాలుగా తనకున్న జాతీయ స్థాయి అనుభవం, పార్టీకి అంకిత భావంతో పనిచేయడం పరిగణనలోకి తీసుకుని పోటీకి అవకాశం ఇవ్వాలని అడుగుతున్నట్లు సమాచారం. మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి కూడా ఈ సీటును కోరుతున్నారు. ఈ సీటుపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో దీనిపై నిర్ణయాన్ని అధిష్టానానికి అప్పగించినట్లు తెలిసింది. మరోవైపు జహీరాబాద్ నుంచి పోటీ చేయాలని జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, ఆలె భాస్కర్, మురళీగౌడ్ భావిస్తుండగా, మహబూబ్‌నగర్ నుంచి పోటీకి డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, శాంతకుమార్ బరిలో ఉన్నారు.

త్వరలో అభ్యర్థుల ప్రకటన: కిషన్‌రెడ్డి

అధిష్టానంతో చర్చించిన తర్వాత త్వరలోనే ఎంపీ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామని సమావేశానంతరం కిషన్‌రెడ్డి మీడియాకు చెప్పారు. తొలి జాబితాలోనే వీలైనన్ని ఎక్కువ పేర్లు ప్రకటిస్తామన్నారు. తమ పార్టీకి రాష్ట్రంలో వాతావరణం అనుకూలంగా ఉందని, గ్రామ స్థాయిలో పార్టీలో చేరికల కోసం 25 మంది యువకులు, మహిళలు, రైతులతో కమిటీలు వేస్తామన్నారు. దేశ రాజకీయాల్లో అసందర్భంగా మారిన బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్రలోని ఆఫీస్‌కు తాళం వేశారని, రాష్ట్రంలోనూ అదే పరిస్థితి నెలకొంటుందని విమర్శించారు.

రాహుల్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా

సాక్షి, హైదరాబాద్: భారత్ జోడో న్యాయయాత్రలో భాగంగా ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నిరసనలు చేపట్టింది. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల ఆనంద్‌గౌడ్, ఓబీసీ మోర్చా నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల ఎప్పుడూ నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శించిందని ధ్వజమెత్తారు. మోదీ ప్రధాని అయ్యాక రాజకీయంగా, బడుగు బలహీన వర్గాల సంక్షేమం పరంగా దేశ చరిత్రలో లేని విధంగా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. వెంటనే మోదీకి రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సంజయ్ ఘనటే, పిట్టల చంద్రశేఖర్, శరద్‌సింఘ్ ఠాకూర్, రవి కుమార్ శంకరోళ్ల, వెంకట్ జన్ను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల నియామకం కేసు 12కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం వివాదంలో తదుపరి వాదనలను హైకోర్టు ఈనెల 12వ తేదీకి వాయిదా వేసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను సిఫార్సు చేస్తూ 2023 జూలైలో గత ప్రభుత్వం గవర్నర్‌కు వివరాలు పంపింది. కానీ గవర్నర్ ప్రభుత్వ సిఫార్సును తిరస్కరిస్తూ సెప్టెంబర్ 19న ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. వాద, ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం విచారణను ధర్మాసనం ఈ నెల 12కు వాయిదా వేసింది.

11 లేదా 12న కాంగ్రెస్‌లోకి పట్నం దంపతులు!

- ఢిల్లీ పెద్దల అపాయింట్‌మెంట్ రావడమే ఆలస్యం
- ఖర్గే, రాహుల్ సమక్షంలో చేరికకు సిద్ధంగా ఉన్న దంపతులు
- చేవెళ్ల ఎంపీ టికెట్‌పై సునీతారెడ్డికి గ్రీన్ సిగ్నల్



తాండూరు (వికారాబాద్): కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు పట్నం దంపతులు సిద్ధమవుతున్నారు. సతీసమేతంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఢిల్లీ పెద్దల అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 11 లేదా 12 తేదీల్లో అధికారికంగా హస్తం పార్టీలో చేరనున్నట్లు సమాచారం. మూడు దశాబ్దాల పాటు ప్రాంతీయ పార్టీల్లో కొనసాగుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తన ప్రాబల్యం చూపుతున్న మహేందర్‌రెడ్డి తొలిసారి జాతీయ పార్టీకి జై కొట్టారు. తన సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతకు కాంగ్రెస్ తరఫున చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో బీఆర్ఎస్‌ను వీడారు. మహేందర్‌రెడ్డి చేరికపై ఆయన మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తుండగా..కొంతమంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి స్పందిస్తూ అధిష్టానం చేరికలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో తాను చెప్పేదేమీ లేదన్నారు. మరోవైపు ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్...పట్నం చేరికపై గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి 'బండి'యాత్ర

- మీకోసం ప్రజాహిత యాత్రనై వస్తున్నా ఆశీర్వదించండి
- పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు బండి బహిరంగలేఖ



కరీంనగర్ టౌన్: 'మూడోసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు జరుగుతున్న ఈ మహాయాగంలో మీ ఆశీస్సుల కోసం ప్రజాహిత యాత్రగా మీ గడపకొస్తున్నా.. ఆశీర్వదించండి'అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. శనివారం ఉదయం కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు చేసి మేడిపల్లి నుంచి ప్రారంభమయ్యే తొలివిడత యాత్ర ఈనెల 15 వరకు కొనసాగనుంది. తొలిరోజు యాత్ర మేడిపల్లి, కొండాపూర్, రంగాపూర్, భీమారం, మన్నెగూడ, బొమ్మెన, దూలూరు, సరికొండ, కథలాపూర్ గ్రామాల్లో జరగనుంది. రాత్రి కథలాపూర్‌లో సంజయ్ బసచేస్తారు. తొలివిడతలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో యాత్రను కొనసాగించనున్నారు. యాత్రలో భాగంగా ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే క్రమంలో వాహనం వాడతారు. గ్రామాల్లో మా త్రం పాదయాత్రగా ముందుకు సాగుతారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 3 రోజుల చొప్పున యాత్ర చేసేలా రూట్‌మ్యాప్ రూపొందించారు.

నియోజకవర్గం మొత్తం పర్యటించేలా రూట్‌మ్యాప్

ప్రజాహిత యాత్ర పేరిట కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పాదయాత్ర చేసేలా ఇప్పటికే సంజయ్ రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నారు. మొదట కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించి జగిత్యాల జిల్లా మేడిపల్లి నుంచి సంజయ్ తనయాత్రను ప్రారంభించనున్నారు. తొలివిడతలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పర్యటించి తంగళ్లపల్లిలో ముగింపు సభ నిర్వహించనున్నారు. తొలిదశలో మొత్తం 119 కి.మీ. మేరకు యాత్ర చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రతీ మండలం కవర్ చేస్తూ.. గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలు, మున్సిపాలిటీల మీదుగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు యాత్రను కొనసాగించేలా షెడ్యూల్‌ను రూపొందించారు.

> ఎవరైతే ఈ ప్రపంచంలో నానాత్వాన్ని మాత్రమే చూచి, అందులోని ఏకత్వాన్ని (బ్రహ్మను) గ్రహించలేకపోతారో అలాంటివారు మృత్యువు నుంచి మృత్యువుకు సాగిపోతుంటారు. అంటే జనన మరణ చక్రం నుండి బయటపడలేక కొట్టుకుపోతుంటారు.
>
> – కఠోపనిషత్తు

సాక్షి

శనివారం, 10 ఫిబ్రవరి 2024

'బ్లాక్ అండ్ వైట్' నిజాలు!

సందిగ్ధతకు తావు లేకుండా విషయం తేటతెల్లమయ్యే స్థితివుంటే, తప్పొప్పులు స్పష్టంగా అర్థమవుతుంటే... అలాంటి పరిస్థితిని వ్యక్తీకరించటానికి ఆంగ్లంలో 'బ్లాక్ అండ్ వైట్' అనే నుడికారాన్ని ఉపయోగిస్తారు. గురువారం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం శ్వేతపత్రం (వైట్ పేపర్) విడుదల చేయగా, దీనికి పోటీగా కాంగ్రెస్ నల్లపత్రం (బ్లాక్ పేపర్) ప్రకటించింది. ఇది ఎన్నికల రుతువు గనుక అధికారంలోకొచ్చి పదేళ్లవుతున్న సందర్భంలో ఆర్థిక రంగంలో తమ ఘనతను చాటుతూ ఎన్డీయే సర్కారు శ్వేతపత్రాన్ని తీసుకొచ్చింది. ఈ పదేళ్లూ 'కర్తవ్య కాలమ'ని ఆ పత్రం అభివర్ణించింది. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వ విధానాల పర్యవసానంగా ఆర్థికరంగంలో ఎంతటి అరాచకత్వం, ఎలాంటి విచ్చలవిడితనం చోటుచేసుకున్నాయో వివరించింది. 2004లో యూపీఏ అధికారంలోకి రావడానికి ముందున్న ఎన్డీయే సర్కారు దృఢమైన, ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను అందించివెళ్తే యూపీఏ దాన్ని కాస్తా ధ్వంసం చేసిందన్నది శ్వేతపత్రం ఆరోపణ. కాంగ్రెస్ విడుదల చేసిన బ్లాక్ పేపర్ ఎన్డీయే ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలను ఏకరువు పెట్టింది. ఈ కాలాన్ని 'అన్యాయ కాలం'గా అభివర్ణించింది. అందులో ఆర్థిక రంగంతోపాటు ఇతరేతర అంశాలను కూడా ప్రస్తావించింది. రెండూ ఒకేరోజు విడుదల కావటంవల్ల వాస్తవ స్థితి ఏమిటో 'బ్లాక్ అండ్ వైట్'లో తేటతెల్లమవుతుందని ఎదురుచూసిన వారికి మాత్రం నిరాశే మిగిలింది. ఇప్పుడు యూపీఏ ఉనికిలో లేదు. దాని స్థానంలో 'ఇండియా' పేరుతో కొత్త కూటమి రంగంలోకొచ్చింది. గతంలో యూపీఏకు నేతృత్వం వహించినట్టే ఇప్పుడు 'ఇండియా'కు తానే అన్నీ అయి కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. అయినా శ్వేతపత్రానికి కూటమి తరఫున కాక ఆ పార్టీయే సమాధానం ఇవ్వాల్సివచ్చింది.

ఉన్న స్థితిగతులను గణాంక సహితంగా చెప్పటానికి విడుదల చేసే పత్రాన్ని శ్వేతపత్రం(వైట్ పేపర్) అంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసినంత మాత్రాన దానికి పోటీగా బ్లాక్ పేపర్ పేరిట కాంగ్రెస్ ఎందుకు విడుదల చేయాలనుకుందో తెలియదు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం నింద తొలగించుకోవటానికీ, బీజేపీ 'నమ్మకద్రోహాన్ని' చాటడానికీ 1993 మొదట్లో అప్పటి పీవీ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. దాన్ని పూర్వపక్షం చేస్తూ, జరిగిన తప్పిదాలకు కేంద్రానిదే బాధ్యతని వివరిస్తూ బీజేపీ సైతం శ్వేతపత్రాన్నే ప్రకటించింది. ఒకటి మాత్రం వాస్తవం... పత్రాలకు ఏ పేర్లున్నా వాటిల్లో వుండేవి గణాంకాలే. సామాన్యుల బతుకులు చూస్తే తప్ప వాస్తవ స్థితిగతులేమిటో అర్థంకావు.

వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం గురించి శ్వేతపత్రం ఘనంగానే చెప్పింది. ఇప్పుడే కాదు, అప్పుడు కూడా ఎన్డీయేది అదే మాట. తమ అయిదేళ్ల పాలన పరమాద్భుతంగా ఉన్నదంటూ 'భారత్ వెలిగిపోతోంది' అనే నినాదంతో నాటి ఎన్డీయే 2004 లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. కానీ ప్రజలు తిరస్కరించారు. తాజా శ్వేతపత్రం మాత్రం నాటి ఎన్డీయే సర్కారు సుదృఢమైన ఆర్థిక వ్యవస్థను అప్పగించిందని చెబుతోంది. దాని మాటెలావున్నా యూపీఏ తొలి అయిదేళ్ల పాలన ఒడిదుడుకులు లేకుండానే గడిచిందని చెప్పాలి. రెండోసారి నెగ్గాక అతి విశ్వాసమో, ఎదురులేదన్న దురహంకారమో యూపీఏను దెబ్బతీశాయి. పార్టీలోనూ, వెలుపలా ప్రత్యర్థులను అణచివేసేందుకు అప్రజాస్వామిక విధానాలు అమలయ్యాయి. శ్వేతపత్రం ప్రస్తావించిన బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం తదితర 15 స్కాములలో అధికభాగం రెండో దశ పాలనలోనివే. పీవీ ప్రభుత్వం తీసుకొచ్చిన 1991 నాటి ఆర్థిక సంస్కరణలు తన ఘనతేనని చెప్పుకుని కూడా వాజ్‌పేయి సర్కారు అందించిన అవకాశాలను వినియోగించుకోలేని చేతగాని స్థితిలో యూపీఏ పడిందన్నది శ్వేతపత్రం ప్రధాన ఆరోపణ. కానీ వెనక్కి తిరిగి చూస్తే ఆర్థిక సంస్కరణల పర్యవసానంగా చేతివృత్తులు దెబ్బతిని, వ్యవసాయం గిట్టుబాటు కాక, కొత్తగా ఏర్పడిన ఉపాధి అవకాశాలను అందుకోలేక భిన్న వర్గాలు పడిన యాతనలు అన్నీ ఇన్నీ కాదు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' గీతం ఈ దీనస్థితికి అద్దం పట్టింది. సంస్కరణలు మానవీయ దృక్పథంతో వుండాలన్న ఆలోచన ఆ తర్వాత వచ్చిందే. అనుత్పాదక ప్రయోజనాలకు వ్యయం చేయటంతో 2003-04లో 31 శాతంగా వున్న పెట్టుబడి వ్యయం 2013-14 నాటికి 16 శాతానికి దిగజారిందని శ్వేతపత్రం అంటోంది. అయితే 2008-09లో ప్రకటించిన రూ. 52,000 కోట్ల రుణమాఫీని ఈ జాబితాలో చేర్చటం సరికాదు. సాగురంగానికి జవసత్వాలివ్వటానికీ, గ్రామీణ ఆర్థికవ్యవస్థ పుంజుకోవటానికీ ఆ చర్య దోహదపడింది. సగటు ద్రవ్యోల్బణ శాతం 8 నుంచి 5కు తీసుకురావటం, తలసరి జీడీపీలో వృద్ధి, పెట్టుబడి వ్యయం పెరుగుదల, పరోక్ష పన్ను రేటులో తగ్గుదల వంటివి తమ విజయాలుగా శ్వేతపత్రం తెలిపింది. అయితే నల్లధనాన్ని వెలికి తీయటానికంటూ అమలు చేసిన పెద్దనోట్ల రద్దు ప్రస్తావన ఇందులో లేదు.

యూపీఏ కాలంనాటి అవ్యవస్థనూ, దాని చేతగానితనాన్నీ గణాంక సహితంగా చెప్పకపోవటం వల్ల అప్పటి పరిస్థితులపై కాంగ్రెస్ స్వోత్కర్షలకు పోతోందని ఏనాటినుంచో బీజేపీ శ్రేణుల్లో అసంతృప్తి వుంది. తాజా శ్వేతపత్రం ఆ లోటైతే తీర్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలు బీజేపీకి ఆయుధాలవుతాయి. అటు కాంగ్రెస్ అప్పట్లో తాము సాధించిందేమిటో చెబుతుంది. భావోద్వేగాలతో ముడిపడిన అంశాలు కాక, జనం మౌలిక సమస్యలు ప్రధాన చర్చనీయాంశాలు కావటం ఎప్పుడూ మంచిదే.

మణిపుర్‌కు మతం రంగు!

మణిపుర్‌లో విధ్వంసం కన్నా మణిపుర్‌పై విధ్వంసక ప్రచారమే ఎక్కువగా జరుగుతోంది! దేశంలో ఎక్కడేం జరిగినా దానికి మతాన్ని అంటుకట్టేలా తయారైన రాజకీయ వ్యవస్థ ఆఖరికి మణిపుర్‌లోని తెగల మధ్య ఘర్షణలను కూడా 'మత కలహాలు'గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. మణిపుర్‌తో సంబంధం లేని రాష్ట్రాలకు సైతం ఆ 'రాజకీయ మతోన్మాదం' వ్యాపించింది! దురుద్దేశాలతో కొన్ని విదేశీ శక్తులు, పొద్దెరగని కొందరు దేశవాళీ కొత్త రాజకీయవాదులు స్వార్థ ప్రయోజనాల కోసం మణిపుర్ నిప్పుల కుంపటిని తమ ప్రసంగ వేదికలపైకి మోసుకెళుతున్నారు. అవి మత కలహాలు కావు... భూమి హక్కుల తగాదాలని తెలిసీ మణిపుర్‌కు మతం రంగును పులుముతున్నారు!

నిరుడు ఈ సమయానికి మణిపుర్ ప్రశాంతంగా ఉంది. ఫిబ్రవరిలో ప్రశాంతం. మార్చి నెలలో కూడా ప్రశాంతం. ఏప్రిల్ వచ్చేసరికి కొంచెం వేడెక్కింది. అయితే అది... ఏప్రిల్‌లో 16 సెల్సియస్ డిగ్రీలతో మొదలై, జూన్ నాటికి 35 డిగ్రీల వరకు చేరుకునే ఎండాకాలపు వేడిమి కాదు. నిరసన ప్రదర్శనల వేడి. దాడులు, దహనాల వేడి.

నిజానికి అంతకు పదేళ్లు, ఆ ముందు పదేళ్ల నుంచి కూడా మణిపుర్ దాదాపుగా ప్రశాంతంగానే ఉంది. రాష్ట్రాన్నే రెండు ముక్కలు చేసేంతగా అక్కడేం జరగలేదు. గత మే నెల నుంచే హింసాకాండ మొదలైంది. మూకుమ్మడి దాడులు, గృహదహనాలు, ప్రార్థనా స్థలాల ధ్వంసం, మహిళల్ని నగ్నంగా ఊరేగించడం మణిపుర్‌ను అగ్నిగుండంలా మార్చేశాయి. ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో 180 మంది మరణించారు. దాదాపు 60 వేల మంది నిరాశ్రయులయ్యారు.



సహాయక శిబిరాలలో మణిపుర్ నిరాశ్రయులు

డిసెంబరులో మణిపుర్ కాస్త ఊపిరి పీల్చుకున్నట్లుగా కనిపించినప్పటికీ కొత్త సంవత్సరంలో మళ్లీ ఒక్కసారిగా హింస చెలరేగింది. జాతుల మధ్య మొదలైన ఈ ఘర్షణలు విద్వేష జ్వాలలే అయ్యాయి. ఇంతకన్నా ఘోరం... అక్కడ జరుగుతున్న ఘటనలపై పాశ్చాత్య మీడియా చేస్తున్న దుష్ప్రచారం! వారితో పాటు అంతర్గతంగా మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు కూడా మణిపుర్‌కు మతం రంగు పులిమేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ''1947లో పంజాబ్‌లో మతపరమైన ఉద్రిక్తతలతో జరిగిన నిర్మూలన కాండను మణిపుర్ ఘటనలు గుర్తు చేస్తున్నాయి'' అనేంతగా ప్రచారం జరుగుతోంది. వారి వ్యతిరేకత ఎవరి మీదనైనా కావచ్చు. కానీ వాస్తవాలను హతమార్చడం ఎందుకు? పర్ణశాల వంటి మణిపుర్‌పై మతోన్మాద మరకల్ని అంటించడం దేనికి?

భౌగోళికంగా మణిపుర్ ప్రత్యేకమైనది. రాష్ట్రంలో కేవలం పది శాతం మాత్రమే ఉన్న మైదాన భూభాగంలో రాష్ట్రంలోని దాదాపు తొంభై శాతం ప్రజలు నివసిస్తున్నారు. అందులో ఎక్కువ శాతం మైతేయిలు. రాష్ట్రంలో వారి జనాభా దాదాపు 53 శాతం. దీంతో సహజంగానే రాజకీయాల్లో వారిదే ప్రాబల్యం. 60 సీట్ల అసెంబ్లీలో 40 స్థానాలు వాళ్లవే.

కొండ ప్రాంతాల్లోని గిరిజనులైన కుకీలు, నాగాలకు ఎస్టీ రిజర్వేషన్ ఉండటం, మైదాన ప్రాంత గిరిజనులైన మైతేయిలకు ఎస్టీ రిజర్వేషన్ లేకపోవడం... కాలక్రమంలో రెండు వర్గాల మధ్య సఖ్యత లోపించడానికీ, సంఘర్షణకూ కారణం అవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే వారి మధ్య సంబంధాలు మరింతగా క్షీణించడానికి మణిపుర్ హైకోర్టు గత ఏడాది మార్చిలో ఇచ్చిన తీర్పు కారణం అయింది. మణిపుర్‌ను రణపుర్‌గా మార్చేసింది.

2023 మార్చి 27న షెడ్యూల్డు తెగల జాబితాలోకి మైతేయి తెగలను చేర్చేందుకు కేంద్ర ఆదివాసీ శాఖకు సిఫారసు చేయాలని మణిపుర్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుపై కుకీలు, నాగాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మెజారిటీ వర్గంగా మైతేయిలదే రాజకీయంగా పైచేయిగా ఉందనీ, హిందువుల్లోని ఎస్సీ, ఓబీసీ హోదాలకున్న ప్రయోజనాలను వారు ఇప్పటికే అనుభవిస్తున్నారనీ, కాబట్టి వారికి ఎస్టీ హోదా ఇవ్వటం సరికాదనీ అభ్యంతరం చెబుతున్నారు. మైతేయిలకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటారనీ, తమ ఉద్యోగాల వాటా తగ్గిపోతుందనీ ఆందోళన చెందుతున్నారు.

అయితే, మైతేయిల వాదన మైతేయిలకు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని నాగా, కుకీ ఆదివాసీల్లోని ముప్పైకి పైగా తెగలకు ఎస్టీలుగా ప్రభుత్వ గుర్తింపు ఉంది. తమకు ఆ గుర్తింపు లేని కారణంగా దేశంలోని ఎవరైనా వచ్చి తాముంటున్న ఇంఫాల్ లోయ ప్రాంతంలో భూమి కొనొచ్చుగాని... తమకు మాత్రం పర్వత ప్రాంతాల్లో భూమి కొనుక్కోవటానికి వీలులేకుండా పోయిందన్నది మైతేయిల వాదన. అంతేకాదు 1949లో భారత్‌లో కలవటానికి ముందు మైతేయిలను ఆదివాసీ తెగగానే గుర్తించారని వారు గుర్తు చేస్తున్నారు. ఆ హోదాను పునరుద్ధరించాలని మాత్రమే తాము కోర్టుకు విన్నవించుకున్నాం అని మైతేయి సంఘం అంటోంది. కేవలం రిజర్వేషన్ల కోసమే కాకుండా... సంస్కృతిని, భాషను, భూమిని, తమ సంప్రదాయాలను కాపాడుకోవటం కోసం ఎస్టీలుగా గుర్తింపును కోరుతున్నామని కోర్టులో వాదించింది. మణిపుర్ హైకోర్టు ఈ వాదనలతో ఏకీభవించింది.

హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆందోళనకు పిలుపు ఇవ్వటం, అది హింసాత్మకంగా మారటంతో ఆందోళన మంటలు రాష్ట్రంలో రాజుకున్నాయి. రెండు వైపులా మరణాలు సంభవించాయి. చర్చిలు, దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇవేమీ మత కలహాలు కావు. భూమి హక్కుల విషయమై మొదలై, నేటికీ కొనసాగుతున్న ఘర్షణలు.

అయితే మణి పూర్‌లో జరుగుతున్నవి మత ఘర్షణలు అని, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని హిందువులు విధ్వంసానికి పాల్పడుతున్నారనే దుష్ప్రచారం సాగుతోంది. గమనించాల్సి వాస్తవం ఏమిటంటే మైతేయి తెగల్లో అధిక సంఖ్యాక హిందువులతో పాటు, ముస్లింలు, క్రిస్టియన్‌లు; కుకీ నాగాల్లోనూ అధిక సంఖ్యాక క్రిస్టియన్‌లతో పాటు హిందువులు, ముస్లింలు ఉన్నారన్నది!

మణిపుర్ తెగల మధ్య ఘర్షణలు మతాల మధ్య చిచ్చుగా కొన్ని పాశ్చాత్య దేశాలకూ, మన దేశంలోనే కొన్ని రాజకీయ పార్టీల వారికీ మాత్రమే ఎందుకు కనిపిస్తోంది? ఎందుకంటే, ఎవరి స్వార్థ ప్రయోజనాలు వారివి. నిజానికి మత ఘర్షణలనేవి మణిపుర్ చరిత్రలోనే లేవు. ''కుకీ, నాగా తెగలకు పరిపాలనలో స్థానం కల్పించిన చరిత్ర మైతేయిలది. మణిపురి ప్రజలకు మతోన్మాదం లేదు. 19వ శతాబ్దంలో రాచరిక పాలనలో హిందూమతం ఆధిపత్యం చలాయించిందన్నది నిజమే, కానీ అది ఎక్కువ కాలం కొనసాగలేదు. మరిక మతోన్మాదం ఎక్కడి నుంచి వచ్చింది?'' అంటారు మణిపుర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రియోరంజన్ సింగ్.

అయితే రెండు వేలకు పైగా చర్చిలను ధ్వంసం చేశారని కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఆ వివరాలను వారికి ఏ క్రైస్తవ దేశాలు అందించాయో వారే చెప్పాలి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే చూసినా 100 దేవాలయాలతో పాటు రెండు వేల మైతేయి ఇళ్లపై కూడా దాడులు జరిగాయి. మరి వీటిని ఏమంటారు? మత ఘర్షణలు అనేనా! మైతేయి వర్గం ప్రయోజనాల కోసం ఏర్పాటైన కోకోమి ప్రతినిధి కె. ఓథాబాయ మాట్లాడుతూ, ''మణిపుర్‌లోని సమస్యలు మతపరమైనవి కావు'' అని స్పష్టం చేశారు. ఆ మాటను కాంగ్రెస్ పార్టీ వాళ్లకు చెప్పేవారెవరు? ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు చెప్పేవారెవరు? ''మణిపుర్‌లో మతం పేరుతో ఎప్పుడూ అల్లర్లు జరగలేదు. జరుగుతున్నదాన్ని డైవర్ట్ చేసి మతపరమైన హింసగా చూపించడం ఇదే మొదటిసారి'' అని స్వయంగా మణిపుర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేబబ్రత సింగ్ అన్నారు కదా!

బాధ్యత గల రాజకీయ నాయకులు ఎవరూ మణిపుర్‌లో జరుగుతున్న మతపరమైన దాడులు అని అనలేదు. అలాంటి ప్రచారానికి తావు కూడా ఇవ్వరు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకు భిన్నంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మణిపుర్‌కు మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ''మీరు క్రిస్టియన్ అయుండీ ఎందుకు మణిపుర్ క్రిస్టియన్‌లను సమర్థించడం లేదు?'' అని ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. ఆమె ఏ ఉద్దేశంతో ఇలా ఒక మతం వారిని రెచ్చగొట్టే ప్రసంగాలను ఇస్తున్నారో ప్రత్యేకించి చెప్పే పని లేదు.

– మాధవ్ శింగరాజు, సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

థాంక్యూ



పీవీ నరసింహా రావుకు భారతరత్న పురస్కారం ఇస్తున్నందుకు, (ప్రధాని) నరేంద్ర మోదీ దేశ కృతజ్ఞతకు అర్హులు. నిజానికి ఇది (మాజీ ప్రధాని) మన్మోహన్ సింగ్ చేయవలసింది. కానీ ఆయనకు ఆ ధైర్యం లేకపోయింది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

మేమిచ్చామని..



వివాదాస్పద అభిప్రాయం: (ఎల్.కె.) అద్వాణీకి ఇచ్చినదానికంటే కూడా (పీవీ నరసింహా) రావుకు భారతరత్న ఇవ్వడం అతిపెద్ద సామాజిక రాజకీయ ప్రకటన!

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

ఇచ్చేయ్!



భారతరత్న పురస్కారాలు కొత్త పద్మశ్రీల్లా మారినట్టున్నాయి. వాటికి ఇంక పెద్ద ఆకర్షణ ఉండనట్టుగా పంచి పెడుతున్నారు.

– సుశాంత్ సరీన్, ఫెలో

శుభాకాంక్షలు



హ్యాపీ లూనార్ న్యూ ఇయర్! డ్రాగన్ సంవత్సరం అందరికీ శుభాలను తేవాలని కోరుకుంటున్నాను. (చైనీస్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 10న డ్రాగన్ ఇయర్ ప్రారంభమవుతుంది.)

– టింగ్‌టింగ్ లియు, తైవాన్ యాంకర్

బైబై బైడెన్



నేను గతేడాది చెప్పాను, మళ్లీ చెబుతున్నాను. డెమొక్రటిక్ (పార్టీ) నామినిగా (ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు) బైడెన్ ఉండబోరు. పరిణామాలు చూస్తుంటే, అదింకా నిజం అయ్యేట్టు కనబడుతోంది.

– వివేక్ రామస్వామి, అమెరికా రిపబ్లికన్ నేత

టెక్నాలజీ



కొన్ని నెలల్లో నేను ఇక నా ఫోన్ నంబర్ వాడను. మెసేజులు, ఆడియో/వీడియో కాల్స్ కోసం కేవలం 'ఎక్స్'ను మాత్రమే ఉపయోగిస్తాను.


– ఎలాన్ మస్క్, 'ఎక్స్' అధినేత

ఇన్‌బాక్స్

దళిత తాత్వికతకు మేనిఫెస్టో

నేటి తెలుగు దళిత కవిత్వంలో కేవలం ఒక్క ప్రతినిధిని మాత్రమే ఎన్నుకోమంటే నా ఛాయిస్ మద్దూరి నగేష్ బాబే! దళిత వాదానికి కమిట్మెంట్ విషయంలో కానీ, కవితా కళపట్ల తపన విషయంలో కానీ, రాజీలేని మార్గం మద్దూరిది. దళిత కవిత్వంలో వ్యక్తమయిన అనేక కోణాలూ, భావనలూ సమగ్రంగా, సాధికారికంగా, ప్రామాణికంగా నూతన కళాతాత్వికతను సంతరించుకుని చాలా అడ్వాన్సుడుగా మద్దూరి కవిత్వంలో ఒదిగి పోయాయి.

దళిత కవిత్వానికి అంబేడ్కరిజమే ప్రాపంచిక దృక్పథమని ఒప్పుకోవటానికి కొంతమంది నేర్పరులు వెనకాడుతున్నప్పుడు, నంగి నంగి పలుకుల్తో దాటవేస్తున్నప్పుడు నగేష్ ఢంకా బజాయించి అంబేడ్కరిజమే దళిత కవిత్వానికి ప్రాణం అని ప్రకటించాడు. అట్లా అని కవిత్వంలో డైరెక్టుగా అంబేడ్కరిజాన్ని ఒక వస్తువుగా నగేష్ ఎప్పుడూ ట్రీట్ చెయ్యలేదు. దళిత జీవితాన్ని మొత్తం భారతీయ వాస్తవికతనీ, అంబేడ్కరిస్టు దృక్పథం నుంచి చూస్తూ కవిత్వీకరించాడు. జీవితాన్నీ, కవిత్వాన్నీ దళితీకరించే క్రమాన్ని మద్దూరి పర్‌ఫెక్ట్ చేశాడు.



'నా కవిత్వం చదివి కులోన్మాదులు వణికిపోవాలి, విరిగి, కూలిపోవాలి. పీడిత కులాల జనం పరవశించి పోవాలి. పూనకంతో ఊగిపోవాలి. ఇదీ... నా కల' అంటూండేవాడు. నగేష్ అన్నమాటను అతని కవిత్వం నిజం చేసింది. ఆఫ్రో అమెరికన్ కవిత్వాన్ని రాసిన 'అమిరి బరకా' తప్ప వేరెవ్వరికీ ఈ ఘనత లేదు.

కవిత్వ రూప సారాల్లోని బ్రాహ్మణ వాదాన్నీ, సంస్కృతీకరణనూ చావుదెబ్బ తీసిన మద్దూరి, పురాణాల్లోని, పవిత్ర గ్రంథాల్లోని హిందూ దేవుళ్ళనీ, దేవతల్నీ, రుషుల్నీ, దేవాలయాల్నీ నెగెటివ్ సింబల్స్‌గా నిర్మించటంలో కొత్త పోకడల్ని చవిచూపాడు. దళిత కవిత్వానికి సరికొత్త మిథాలజీనీ, ఐకనాలజీనీ, అలాదు ప్రతీకల్నీ, ప్రతిమల్నీ నిర్మించి, తన తోటి కవులకు నగేష్ దారి చూపాడు.

'చిక్కనవుతున్న పాట' దళిత కవితా సంకలనంలో తన దళిత సంతకాన్ని పరిచయం చేసి 'నిశాని'లో దళిత ఆత్మగౌరవ ఎజెండాని సెట్ చేశాడు. 'వెలివాడలో'లో దళితత్వాన్ని దళిత ఈస్థటిక్స్‌లో ప్రదర్శించాడు. 'పదు నెక్కిన పాట'లోని తన కవితల ద్వారా దళిత ఆర్థికతనూ, దళిత సాంస్కృతిక ఆకాంక్షల్నీ అలలు అలలుగా వ్యాపింపజేశాడు. ఇక 'మీరేవుట్లా' అనే పుస్తకం దళిత తాత్వికతకూ, స్వప్నాలకూ, సాహసాలకూ మేనిఫెస్టో కింద లెక్క. ఈ ఒక్క పుస్తకం చదివినా దళిత కవిత్వపు విభిన్నతా విశిష్టతా ఈజీగా బోధపడతాయి.

నగేష్, ఖాజాతో కలిసి సంపాదకత్వం వహించిన 'విడి ఆకాశం' కుల సంబంధాల దృష్టి నుంచి ప్రేమను సరికొత్తగా ఆవిష్కరించి చరిత్రను సృష్టించింది. నగేష్ రాసిన దళిత స్త్రీవాద కవితలు ఎంతోమందికి కనువిప్పు. ఏం కావాలి? అని ఎవరయినా అడిగితే 'నీ గుండెలో నాకు చోటు కావాలి/ నీ ఇంట్లో నేను చెయ్యి కడగాలి / మనం చుట్టాలం కావాలి' అని సింపుల్‌గా చెబుతాడు మద్దూరి. 'మీరేవుట్లా?' అని అడగటం అంటే 'కాగితాన్ని చించినట్లు ఒక మనిషిని పత్రున చీల్చటం / వడ్లని మరలో పోసి స్విచ్చేసినట్లు మనిషిని మరాడించటం' అని గుండెను బద్దలుకొడతాడు.

దళిత కవిత్వం దళిత రాజ్యాధికార భావనకు కళాత్మక తోబుట్టువు. మద్దూరి నగేష్ బాబు కవిత్వమే ఇందుకు పెద్ద నిదర్శనం. దళిత భారతి అవసరాలకీ ఆశయాలకీ నేరుగా అద్దంపడుతూ నగేష్ రాసిన కవిత్వం ఎంతో విలువైనది. తన కవితల్ని 'అసాసిన్ పోయమ్స్' (Assassin poems) అంటాడు బరకా. నగేష్ కవితలూ అంతే.

– జి. లక్ష్మీనరసయ్య I కవి, సాహితీ విమర్శకుడు

(నేడు గుంటూరులో మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ)

ఆంగ్ల మాధ్యమం అనుసరణీయం

అభిప్రాయం



కె.ఎస్.ఎస్. శేషన్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని ప్రవేశపెట్టాలని తీసుకున్న నిర్ణయం సరైన దిశలో ఒక సాహసోపేతమైన ముందడుగు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా ముందుకు వెళుతోంది. ఇంగ్లీషు మీడియం విద్య తన ముఖ్యమైన ఎజెండాల్లో ఒకటిగా చేసుకొంది. ఈ ఏడాది ఢిల్లీలోని రిపబ్లిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న శకటం ఇంగ్లీషు మీడియం చదువు ప్రాముఖ్యాన్ని ఎలుగెత్తి చాటింది. దీన్నిబట్టి ఏపీ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాల, కళాశాల స్థాయుల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ఇంగ్లీషు మాధ్యమం విషయంలో కొందరు వ్యతిరేకత వ్యక్తం చేసినా ఇప్పుడు వారూ నిశ్శబ్దాన్ని ఆశ్రయించారు. మొత్తం మీద విద్యావేత్తలు, విద్యా నిర్వాహకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి ఆంగ్ల మాధ్యమ విద్యకు ఎంతో మద్దతు లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంగ్లీషును బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించి నప్పుడు మొదట్లో కొన్ని కార్పొరేట్ పాఠశాలలు, ఇతర స్వార్థ ప్రయోజనాలకు చెందిన కార్టెల్‌లు వ్యతిరేకించినప్పటికీ, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా కార్యకర్తలు మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం బలమైన రాజకీయ సంకల్పంతో ముందుకు సాగింది. అనేక దళిత సంఘాలు, ఎన్జీఓ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ర్యాలీలు నిర్వహించి బోధనా మాధ్యమంలో ప్రతిపాదిత మార్పుకు సంఘీభావం తెలిపాయి. ఆంగ్ల విద్య సామాజిక మార్పుకు నాంది పలుకుతుందనీ, సమాజంలోని పేదలు, అట్టడుగు వర్గాలకు విముక్తి కల్పించే సాధనంగా ఉపయోగపడుతుందనీ వారు భావించారు.

ఇంగ్లీషు చదువు వల్ల మాతృభాషకు నష్టం వాటిల్లుతుందని కొందరు అంటున్నారు. కానీ, భయపడాల్సిన పనిలేదు. ప్రాథమిక స్థాయి నుండే ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా బోధిస్తే, పిల్లలకు ఆ భాషలో కూడా మెరుగైన వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలు నడిచే



యుగం ఇది. ఇంగ్లీషు పరిజ్ఞానం ఈ రంగాల్లో చాలా అవసరం. ఇవ్వాళ మన ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటున్న పిల్లలకు మెరుగైన అవకాశాలు లభించడం ఖాయం. ఫలితంగా వారి కుటుంబాల జీవన ప్రమాణాలు పెరుగుతుంది. ఇది అంతిమంగా రాష్ట్ర, దేశ అభివృద్ధికి దారితీస్తుంది.

ఇంగ్లీషు ప్రాధాన్యతను పెరుగుతున్న సామాజిక-ఆర్థిక అవసరాల కోణంలో చూడాలి. సృజనాత్మక రచన, సాహిత్య ఎదుగుదల మాతృభాష ద్వారానే సాధ్యమవుతుందనేది నిజం. కానీ ఇంగ్లీషు... దేశం లోపలా, బయటా అన్ని చోట్లా ఉనికిలోకి వచ్చింది. లింక్ లాంగ్వేజ్‌గా ఉంది. ఈ భాష లేకుండా ఈ రోజు 'ప్రపంచ పౌరుడి'ని ఊహించలేము. ప్రాథమిక పాఠశాలల నుండే ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడితే సమాజంలో సమూలమైన మార్పు రావడం ఖాయం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు కట్టి పిల్లలను చదివిస్తూ సతమతమవుతున్న మధ్యతరగతి తల్లిదండ్రులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం ఉన్న తెలుగు మాధ్యమాన్ని ఇంగ్లీషులోకి మార్చడం అనేక సవాళ్లతో కూడుకున్న పని. మొదటి అతి ముఖ్యమైనది ఉపాధ్యాయులకు కొత్తగా శిక్షణ ఇవ్వడం. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఇంగ్లీషు కమ్యూనికేషన్ ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. అందువల్ల, ఉపాధ్యాయులు 'ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ' లేదా అటువంటి ఇతర సంస్థల ద్వారా, 'ఉపాధ్యాయుల ఇండక్షన్ ప్రోగ్రామ్‌ల' ద్వారా శిక్షణ ఇవ్వాలి. ఇంగ్లీషులో సబ్జెక్టుల బోధనకు ఉపయోగించే రీడింగ్/టీచింగ్ మెటీరియల్స్ తయారీలో ఉపాధ్యాయుల పాత్ర, విధి ఉంటుంది.

మాతృభాష ఆంగ్లం కాని పిల్లలకు బోధించడంలో అత్యంత సమగ్రమైన పద్ధతి, విధానాలు అత్యంత నైపుణ్యం కలిగి ప్రణాళికాబద్ధంగా అమలు చేయబడేవి. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కూడా పెంచాలి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పాటూ ఎన్‌ఆర్‌ఐల ఇష్టపూర్వక సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాఠశాలల మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త హైదరాబాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత హిస్టరీ ప్రొఫెసర్

అతీంద్రియ శక్తులు

పతంజలి యోగదర్శనం విభూతి పాదం 16 నుండి 49 వరకు ఉన్న సూత్రాలు యోగి సాధించగల అతీంద్రియ లేక అసాధారణ శక్తులను గురించి వివరిస్తాయి. యోగికి భూత భవిష్యత్తుల గురించి, పూర్వ జన్మల గురించి తెలుస్తుంది. ఇతరుల ఆలోచనలు తెలుస్తాయి. నక్షత్ర గతులతో కూడిన సమస్త విశ్వం గురించి తెలుస్తుంది. శరీరం లోపలి నిర్మాణం గురించి తెలుస్తుంది. ఆకాశంలో సంచరించే శక్తి లభిస్తుంది. ఆకలిదప్పులను అణచివేసే శక్తితోపాటు, సూక్ష్మ శబ్దాల్ని కూడా వినగలిగే శక్తి లభిస్తుంది. పంచభూతాలు వశమౌతాయి.



సుత్తపిటకం దీర్ఘనికాయం పాథికవగ్గంలో బుద్ధుడు అసాధారణ శక్తుల్ని గురించి వివరిస్తాడు. అదృశ్యమవటం, అనేకమవటం, గాల్లోంచి వెళ్ళినట్లుగా గోడలోంచో, కొండలోంచో దూసుకు వెళ్ళటం, నీళ్ళ మీద నడవటం, ఆకాశంలో సంచరించటం, దూరశ్రవణం, పరుల చిత్తం గ్రహించటం, పూర్వ జన్మ జ్ఞానం, దివ్య చక్షు ప్రాప్తి మొదలైనవి అలాంటి శక్తుల్లో కొన్ని.

బుద్ధుడి శిష్యుల్లో చాలామంది ఇలాంటి అసాధారణ శక్తుల్ని పొంది ఉన్నారని తెలుస్తుంది. పురుషుల్లో మహా మౌద్గల్యాయనుడు, స్త్రీలలో ఉప్పలవణ్ణ వారిలో ముఖ్యులు.

పతంజలి అదే సమాధి పాదం 37వ సూత్రంలో ఈ విధమైన అతీంద్రియ శక్తులు ఆత్మసాక్షాత్కారం కలిగించే సమాధికి ఆటంకం కలిగిస్తాయి అనీ, మోక్ష కాములైన యోగులు వాటిని హేయములని తలచి విడిచిపెడతారనీ పేర్కొన్నాడు.

అదే విధంగా బుద్ధుడు దీర్ఘనికాయం శీలఖండ వగ్గంలో ఇలాంటి అసాధారణ శక్తులు ప్రదర్శించటాన్ని తీవ్రంగా నిరసించాడు.

యోగికి సాధనా విశేషం వల్ల అతీంద్రియ శక్తులు కొన్ని సంప్రాప్తమైనా, పేరు ప్రఖ్యాతుల కోసం వాటిని ప్రజల ముందు ప్రదర్శించి మెప్పు పొందటాన్ని ఏ కాలంలోనూ మహాత్ములెవరూ హర్షించి ఆమోదించలేదు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.పాడ్యమి రా3.26 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ధనిష్ఠ రా.11.02 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: తె.5.43 నుండి 7.11 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.33 నుండి 8.03 వరకు, అమృతఘడియలు: ప.1.14 నుండి 2.44 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.54.

పోలవరానికి సహకరించండి..

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి జగన్ వినతి

- నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై విజ్ఞాపనలు
- ప్రాజెక్టు సాకారానికి సహకరించండి
- కాంపోనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేసి తొలివిడత నిధులను విడుదల చేయాలి
- కేంద్ర క్యాబినెట్ ద్వారా వెంటనే ఆమోదించాలి
- తెలంగాణ నుంచి రూ.7 వేల కోట్లకుపైగా విద్యుత్తు బకాయిలను ఇప్పించండి
- కొత్త మెడికల్ కాలేజీలు, భోగాపురానికి 6 లేన్ రహదారికి సహకారం కావాలి
- విశాఖ – కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను కడప మీదుగా బెంగళూరుకు పొడిగించాలి
- ఏపీ ఆర్థిక పురోగతికి హోదానే కీలకం.. విభజన హామీలన్నీ నెరవేర్చండి



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై చర్చించేందుకు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం ఉదయం పార్లమెంట్‌లోని కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో పలు అంశాలపై ప్రధానికి వినతిపత్రం అందజేశారు. పోలవరంలో కాంపొనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేతతోపాటు ప్రాజెక్టు తొలివిడతను సత్వరమే పూర్తి చేసేందుకు రూ.12,911 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించిందని సీఎం జగన్ గుర్తు చేశారు. ఈ రెండు అంశాలు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్న దృష్ట్యా తక్షణమే దీనిపై దృష్టి పెట్టాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం మొదటి విడత పూర్తికి దాదాపు రూ.17,144 కోట్లు ఖర్చు అవుతాయని, దీనికి సంబంధించిన ప్రతిపాదన ఇప్పటికే జలశక్తి శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నందున సత్వరమే పరిశీలించి ఆమోదం తెలపాలని అభ్యర్థించారు. పార్టీ పార్లమెంటరీ నేత వి.విజయసాయిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మార్గాని భరత్, రెడ్డప్ప, గోరంట్ల మాధవ్, వంగ గీత, గురుమూర్తి, సత్యవతి, మాధవి, చింతా అనురాధ, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు వెంటరాగా ప్రధాని కార్యాలయంలోకి వెళ్లిన సీఎం జగన్ సుమారు గంట పాటు సమావేశమయ్యారు.

ప్రధాని దృష్టికి తెచ్చిన ఇతర అంశాలివీ..

- ఏపీకి ప్రత్యేక హోదా సహా ఇతర విభజన హామీలన్నీ అమలు చేయాలి. రాష్ట్ర ఆర్థిక పురోగతికి ప్రత్యేక హోదా చాలా అవసరం. పెట్టుబడులు రావడమే కాకుండా ఉపాధి అవకాశాలు దక్కేందుకు ప్రత్యేక హోదా కీలకం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించాం. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండేలా కొత్తగా 17 వైద్య కళాశాలను నిర్మిస్తున్నాం. ఇప్పటికే కొన్ని కొత్త వైద్య కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. మిగతా కాలేజీల ఏర్పాటుకు తగిన సహాయ సహకారాలు అందించాలి.
- విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానిస్తూ భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖ పోర్టులను కలిపే 55 కిలోమీటర్ల పొడవైన 6 లేన్ల రహదారి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలి.
- విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ – కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను వయా కడప మీదుగా బెంగళూరు వరకూ పొడిగించాలి. పరిశీలన పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు సాకారమయ్యేలా చూడాలి. కడప – పులివెందుల – ముదిగుబ్బ – సత్యసాయి ప్రశాంతి నిలయం – హిందూపూర్ కొత్త రైల్వేలైన్‌ను దీంట్లో భాగంగా చేపట్టాలి. ఈ ప్రాజెక్టు వల్ల వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతానికి చక్కటి కనెక్టివిటీ ఏర్పడుతుంది.
- విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు త్వరగా ఆమోదం తెలపాలి.
- 2014 జూన్ నుంచి మూడేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రానికి ఏపీ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. దీనికి సంబంధించి రూ.7,230 కోట్ల బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం వీటిని వెంటనే చెల్లించేలా చూడాలి.

సీతారామన్‌తో సీఎం సమావేశం

రాష్ట్రాభివృద్ధికి చేయూత అందిస్తూ నిధులు త్వరితగతిన విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం జగన్ కోరారు. శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం సమావేశమయ్యారు. నిధులు, పెండింగ్ అంశాలపై అరగంటకు పైగా చర్చించారు. ప్రధానికి నివేదించిన అంశాలను ఆర్థిక మంత్రి దృష్టికి తెచ్చారు. పోలవరం సవరించిన అంచనాలకు ఆమోదం, బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు... జస్టిస్ రాకేష్‌పై 'సుప్రీం' సీరియస్!

- 'మిషన్ బిల్డ్' కేసు తీర్పులో రాష్ట్ర ప్రభుత్వంపై జస్టిస్ రాకేష్ అనుచిత వ్యాఖ్యల తొలగింపు
- సీజేల బదిలీలను తప్పుబడుతూ కొలీజియంపైనా వ్యాఖ్యలు
- వాటిని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్న వాదనతో ఏకీభవించిన ధర్మాసనం
- రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్న రాకేష్‌కుమార్
- వ్యవస్థను కుళ్లబెట్టారంటూ ఆయనపై గతంలోనే సుప్రీం ఆగ్రహం
- గత్యంతరం లేక ఎన్‌సీఎల్‌ఏటీ జ్యుడీషియల్ సభ్యుడి పదవికి రాజీనామా
- ఏపీ హైకోర్టు జడ్జిగా రిటైరైన రోజు పూలు చల్లి సాష్టాంగ నమస్కారాలతో వీడ్కోలు పలికిన టీడీపీ నేతలు, మద్దతుదారులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఉన్న సమయంలో జస్టిస్ రాకేష్ కుమార్, జస్టిస్ దొనడి రమేష్ తమ తీర్పులో అటు అత్యున్నత న్యాయస్థానం ఇటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పక్షపాతంతో చేసిన ఆ అభ్యంతరకర, వివాదాస్పద వ్యాఖ్యలను ఆ తీర్పు నుంచి సుప్రీంకోర్టు తాజాగా తొలగించింది. ఇలాంటి అసంబద్ధ, పక్షపాత వ్యాఖ్యలతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ఈమేరకు ఆ వ్యాఖ్యలను తీర్పు నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం శుక్రవారం కీలక ఉత్తర్వులు వెలువరించింది.

ఓటుకు కోట్లు కేసులో సీఎం రేవంత్‌కు సుప్రీం నోటీసులు

- తెలంగాణ ప్రభుత్వానికి, సండ్ర వెంకట వీరయ్యకు కూడా..
- 4 వారాల్లోగా కౌంటర్ దాఖలుకు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున, కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలుకు ఆదేశించింది. బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ల తరఫున అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ పి.మోహిత్‌రావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు కోట్లు సంబంధిత కేసులను తెలంగాణలోని ఏసీబీ కోర్టు విచారణ జరుపుతోందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నందున రాష్ట్రంలో న్యాయపరమైన విచారణ సాధ్యం కాదని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌లోని తత్సమాన కోర్టుకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, దామా శేషాద్రినాయుడులు వాదనలు విన్పించారు.

...వారినే విచారించాల్సిన పరిస్థితి

తెలంగాణలో 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అనుకూలంగా ఓటు వేసేందుకు గాను నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి రూ.కోట్లు లంచం ఆశ చూపి అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇవ్వజూపారనేది ప్రధాన ఆరోపణ అని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాజీ బాస్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అయితే స్టీఫెన్సన్‌కు లంచం ఇస్తుండగా తెలంగాణ పోలీసులు, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా రేవంత్‌రెడ్డి తదితరుల్ని పట్టుకున్నారని, స్టీఫెన్‌సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కాగా తదనంతర పరిణామాల్లో భాగంగా రేవంత్‌రెడ్డి 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఈ కేసులో నిందితుడైన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని, కీలకమైన హోంశాఖ కూడా ఆయన వద్దే ఉందని వివరించారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో న్యాయపరమైన విచారణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఏసీబీ అధికారులు ఎవరి నియంత్రణలో ఉంటారో, ఎవరికి సమాధానం చెప్పాలో వారినే విచారించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

రేవంత్‌పై పెండింగ్‌లో 88 కేసులు

తెలంగాణలోని వేర్వేరు కోర్టుల్లో రేవంత్‌రెడ్డిపై 88 కేసులు విచారణలో ఉన్నాయని, ఆయన నేర నేపథ్యం ఎక్కువగా ఉన్నట్లు వీటిని బట్టి స్పష్టమవుతోందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తేల్చుకుంటామంటూ తెలంగాణలోని సీనియర్ పోలీసు అధికారుల్ని రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో బెదిరించారని కోర్టు దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా విచారణ జాప్యం చేయడానికి నిందితులు ఏదో ఒక సాకుతో 2015 నుంచి పలు పిటిషన్లు వేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటుకు కోట్లు కేసు విచారణను తెలంగాణ వెలుపల మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌లకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలమని, రేవంత్ మాజీ బాస్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా ఈ కేసులో ఆరోపణలు ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఈ పిటిషన్ ఎందుకు విచారించకూడదో తెలియజేయాలంటూ సీఎం రేవంత్‌సహా ఇతర ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

27కి గోదావరి బోర్డు సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈనెల 13న జరగాల్సిన గోదావరి నది యాజమాన్య బోర్డు సమావేశం 27కి వాయిదా పడింది. వాస్తవానికి ఈనెల 6న సమావేశం జరగాల్సి ఉండగా, ఏపీ విజ్ఞప్తితో 13కి వాయిదా వేశారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్ రాజీనామా తర్వాత ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించలేదు. ఈ నేపథ్యంలో గోదావరి బోర్డు సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ కోరగా.. గోదావరి బోర్డు వాయిదా వేసింది.

మావోయిస్టు నేత బండి ప్రకాశ్‌కు అస్వస్థత?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, బండి ప్రకాశ్(56) అలియాస్ బండి దాదా అలియాస్ బీపీ అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాకర్ తీవ్ర అస్వస్థతకు గురై నట్లు సమాచారం. ఆయన పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. బండి ప్రకాశ్ ప్రస్తుతం సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీకి కార్యదర్శిగా ఉన్నారు. ఆయన రాసిన లేఖలు ప్రభాత్ పేరుతో విడుదలవుతుంటాయి. ఆయన అనారోగ్యంపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన రావలసి ఉంది.

ఫూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

సాక్షి, న్యూఢిల్లీ: మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని సత్య శోధక్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. దేశానికి టార్చ్ బేరర్ అయిన పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని, లేనిపక్షంలో పార్లమెంట్‌ని ముట్టడిస్తామని సంజయ్ హెచ్చరించారు.

శివబాలకృష్ణ కేసులో ఆధారాల సేకరణపై ఏసీబీ ఫోకస్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి భాగోతానికి సంబంధించి ఏసీబీ అధికారులు కోర్టుకు సమర్పించిన వాంగ్మూలంలో కీలక విషయాలు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. పలు రియల్‌ఎస్టేట్ కంపెనీలు, ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల జారీ అంశంలో ఆయా కంపెనీల ప్రతినిధులతో మధ్యవర్తిత్వంలో అతని బంధువులే కీలకంగా ఉండేవారని శివబాలకృష్ణ వెల్లడించినట్టు తెలిసింది. అవినీతి సొమ్మును ఆస్తులుగా మార్చడం, కుటుంబ సభ్యులు, ఇతర బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం తదితర వ్యవహారాలన్నీ బంధువులే చక్కబెట్టేవారని తేలింది. బంధువుల తోడుగా ఉన్నతస్థాయి వ్యక్తుల అండతో మొత్తం అవినీతి కథ నడిపినట్టు తేలిందని అంటున్నారు. ఇప్పటికే ఆ బంధువుల్లో ఎవరెవరున్నారన్న కీలక సమాచారం తెలుసుకున్న ఏసీబీ అధికారులు ఆధారాల సేకరణపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది.

నాలుగు చోట్ల నెగ్గిన అవిశ్వాసాలు

- పదవులు కోల్పోయిన ఆదిబట్ల, మోత్కూరు, ఆర్మూరు, సదాశివపేట చైర్‌పర్సన్లు

ఇబ్రహీంపట్నం రూరల్/మోత్కూరు/ఆర్మూర్/సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 'అవిశ్వాసాలు'ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఆదిబట్ల, మోత్కూరు, ఆర్మూరు, సదాశివపేట మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు నెగ్గాయి. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీలో అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకమై చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లను గద్దె దించారు. ఆర్డీఓ, ప్రిసైడింగ్ ఆఫీసర్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్, వైస్‌చైర్‌పర్సన్ కోరె కళమ్మను పదవుల నుంచి తప్పిస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ ఆర్తిక సభ్యులందరినీ మద్దతివ్వాలని బతిమాలారు. అయితే వారెవరూ వినిపించుకోకపోటంతో ఆమె కంటతడి పెట్టారు.

మోత్కూరు మున్సిపాలిటీలో..

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి (బీఆర్‌ఎస్)పై తొమ్మిది మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఆర్డీఓ అమరేందర్ శుక్రవారం మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పది మంది సభ్యులు హాజరయ్యారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా పది మంది చేతులెత్తారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చిన 9 మంది సభ్యులతో పాటు అదనంగా బీఆర్‌ఎస్‌కు చెందిన ఒక కౌన్సిలర్ కూడా చేతులు ఎత్తారు. దీంతో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీఓ అమరేందర్ ప్రకటించారు.

ఆర్మూరులో అవిశ్వాస తీర్మానం నెగ్గింది.!

నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పండిత్ వినీతపై హైకోర్టు తీర్పుతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం హైకోర్టు తీర్పు ప్రకారం.. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై గతనెల 4న నిర్వహించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది కాబట్టి.. ఈనెల19 లోపు నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయాలని, అప్పటి వరకు వైస్‌చైర్మన్‌కు బాధ్యతలు ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అవిశ్వాసంపై ప్రత్యర్థి వర్గం కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.



సదాశివపేటలో అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తిన కౌన్సిలర్లు

సదాశివపేటలో పదవి కోల్పోయిన జయమ్మ

సంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆమెపై సొంత పార్టీ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. ఆర్డీవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మొత్తం 26 మంది కౌన్సిలర్లకు 22 మంది హాజరయ్యారు. చైర్‌పర్సన్‌ను తొలగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 22 మంది కౌన్సిలర్లు చేతులెత్తారు.

అంతా ఆయన చెబితేనే చేశా..

▶ మొదటి పేజీ తరువాయి

కన్ఫెషన్ రిపోర్ట్ (వాగ్మూలం)లో శివబాలకృష్ణ పేర్కొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'నేను ఇంత పెద్ద మొత్తంలో అవినీతి సొమ్ము కూడ బెట్టడంలో పై అధికారి అరవింద్‌కుమార్ పూర్తి సహకారం ఉంది. నా నుంచి ఎన్నో పనులు చేయించుకుని ఆయన కూడా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించారు..'అంటూ ఆరోపణలు చేసినట్టు తెలిసింది. కోర్టుకు సమర్పించిన ఈ కన్ఫెషన్ రిపోర్టులో ఏసీబీ అధికారులు.. అరవింద్‌కుమార్ పాత్రకు సంబంధించిన కీలక అంశాలు ప్రస్తావించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు కన్ఫెషన్ రిపోర్టులోని ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

కోటి రూపాయలు ఇంటికి తీసుకెళ్లి ఇచ్చా

ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌ను నార్సింగిలోని 12 ఎకరాల స్థలంలో చేపట్టారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణంతో కూడిన ఈ ప్రాజెక్టు చాలా కాలంగా అనేక చట్టపరమైన సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉంది. హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్ 2023 నవంబర్, డిసెంబర్‌లలో హెచ్‌ఎండీఏ సెక్రటరీ చంద్రయ్యతో కలిసి సమస్యను పరిష్కరించారు. వివాదాన్ని క్లియర్ చేసి ప్రణాళికను విడుదల చేశారు. ఇందుకోసం అరవింద్ కుమార్ ఆ సంస్థ యాజమాన్యం నుంచి రూ.10 కోట్ల లంచం డిమాండ్ చేశారు. అందులో భాగంగా 2023 డిసెంబర్‌లో రూ.1 కోటి నగదు ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్టు ప్రతినిధి షేక్ సైదా నాకు ఇచ్చారు. మరుసటి రోజు ఉదయం ఆ డబ్బును నేను జూబ్లీహిల్స్ అంబేడ్కర్ వర్సిటీ సమీపంలోని అరవింద్ కుమార్ ఇంటికి వెళ్లి ఆయనకు అందజేశా.

అరవింద్ కుమార్ విచారణకు ఏసీబీ సమాయత్తం?

శివ బాలకృష్ణ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని ప్రస్తుత ప్రకృతి విపత్తుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌ను ప్రశ్నించడానికి ఏసీబీ సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరినట్లు విశ్వసనీయ సమాచారం. అఖిల భారత సర్వీసు అధికారి కావడం వల్ల ఈ విషయమై డీవోపీటీకి కూడా సమాచారం అందించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

భూమార్పిడి చేసినందుకు రూ.కోటి

ఆరు నుంచి ఏడు నెలల క్రితం క్యూ-మార్ట్ రాహుల్ అనే ఒక వ్యక్తి నాకు రెరా కార్యాలయంలో రూ.ఒక కోటి ఇచ్చారు. ఆ డబ్బును అదే రోజు నేను అరవింద్‌కుమార్ నివాసంలో అందజేశా. బాచుపల్లిలోని రెండు ఎకరాలలోపు భూమిని మార్పిడి చేసినందుకు అరవింద్‌కుమార్ రూ.కోటి లంచం డిమాండ్ చేసినట్టుగా ఆ వ్యక్తి నాతో చెప్పాడు. వివిధ పనుల గురించి అరవింద్‌కుమార్ తరఫున నా నుంచి కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేసేవారు. మైహోం బూజాలో ఉండే రంగా భాయ్, మీనా జ్యువెలర్స్ ఎండీ, కేశినేని ప్రాజెక్ట్స్ రవి రమేశ్, ఎల్బీనగర్‌లో ఉండే సుధాకర్ ఇతరులు వీరిలో ఉన్నారు.

ఈస్ట్ మారేడ్‌పల్లి, కోకాపేట్ ప్రాజెక్టుల్లో కూడా..

ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు విషయంలో జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతుల విషయంలో మీనాక్షి కంపెనీకి అరవింద్‌కుమార్ చేసిన సాయానికి బదులుగా ఆయన డిమాండ్ చేసిన మేరకు రూ.50 లక్షలు సదరు కంపెనీ లైజనింగ్ అధికారి నాగబాబు మా ఇంటికి వచ్చి ఇచ్చాడు. ఆ సొమ్మును అదే రోజు అరవింద్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనకు ఇచ్చా. కోకాపేట్ హై రైజ్ బిల్డింగ్ ప్రాజెక్టులో ప్రెస్టీజ్ గ్రూప్‌కు అరవింద్ కుమార్ సహాయం చేశారు. ఈ రియల్ ఎస్టేట్ కంపెనీ జనరల్ మేనేజర్ సురేష్ 2022 చివరిలో అరవింద్ కుమార్ కోసం రూ.40 లక్షల లంచం నాకు ఇచ్చారు. అ డబ్బును కూడా నేను అరవింద్ కుమార్‌కు ఆయన నివాసంలోనే అందజేశా. ఇక కోకాపేట్ మల్టీస్టోర్డ్ హై రైజ్ బిల్డింగ్‌లోని సాలార్ పురియ సత్వ ప్రాజెక్ట్‌కు సాయం చేసినందుకు అమిత్ సలార్ పురియా డిసెంబర్ 2022లో అరవింద్ కుమార్ కోసం రూ.35 లక్షలు లంచం తీసుకు వచ్చారు. అ డబ్బును అరవింద్ కుమార్‌కు ఇచ్చా.

నాకూ కొన్ని ప్లాట్లు బహుమతిగా అందాయి

సాయి సందీప్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ , ప్రైమ్ ల్యాండ్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్‌కు చెందిన కె.సందీప్‌రెడ్డి కంది మండలంలో, ఇతర ప్రాంతాల్లో చేసిన వెంచర్స్‌లో కొన్ని ప్లాట్లు నాకు బహుమతిగా ఇచ్చారు. నాకు గుర్తున్నంత వరకు నాకు గిఫ్ట్‌గా వచ్చిన ప్లాట్లను మా మేనల్లుడు భరణి పేరిట రిజిస్టర్ చేయించాను. నా పై అధికారి అరవింద్‌కుమార్ సైతం తన డ్రైవర్లు, గన్‌మెన్లు, ఇతరుల పేరుమీద ప్లాట్లు రిజిస్టర్ చేయించేవారు. ఆయన వాట్సాప్ ద్వారా నాకు వివరాలు పంపేవారు. ఎవరి పేరుమీద ప్లాట్లు రిజిస్టర్ చేయాలన్నది నాకు సూచించేవారు. ఈ వివరాలు నేను డెవలపర్లకు పంపేవాడిని, నాకు గుర్తు ఉన్నంత వరకు కంది మండలం, ఇతర ప్రాంతాల్లోని సాయి సందీప్ డెవలపర్స్, ఇన్‌ఫ్రా, ప్రైమ్ ల్యాండ్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ వెంచర్స్‌లో ప్లాట్లను 2022 ఆగస్టు, డిసెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ ఫీజు సైతం ఆ కంపెనీలే చెల్లించేవి. వెర్టెక్స్ హోం కంపెనీ రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని మంఖాల్ గ్రామంలో చేసిన వెంచర్‌కు గాను అరవింద్‌కుమార్.. 550 చదరపు గజాల ఓపెన్ ప్లాట్‌ను ఎలాంటి క్రయ విక్రయాలు లేకుండా గిఫ్ట్‌గా పొందారు.

భూగర్భంలో భుగభుగలు

పరవళ్లు తొక్కుతున్న లావా రాశి • ఐస్‌లాండ్‌లో భయపెడుతున్న అగ్నిపర్వతం • 800 ఏళ్ల తర్వాత ఒళ్లు విరుచుకుంటున్న వైనం

అనగనగా ఒక చిన్న పల్లెపట్టు. అంతా సజావుగా సాగిపోతున్న వేళ. ఉన్నట్టుండి ఎటు చూస్తే అటు భూమిపై పగుళ్లు. చూస్తుండగానే అందులోంచి ఫౌంటేన్‌లా విరజిమ్ముతూ లావా ప్రవాహాలు. బిక్కచచ్చిపోయి కకావికలమవుతున్న జనం. ఏదో హాలీవుడ్ సినిమాలా ఉంది కదూ! ఐస్‌లాండ్‌లో పశ్చిమ రెగ్జానెస్ ద్వీపకల్పంలోని గ్రెంతావిక్ అనే బుల్లి బెస్త గ్రామం, దాని పరిసర ప్రాంతాలు ఇప్పుడు అచ్చం అలాంటి భయానక పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. అక్కడ భూగర్భంలో 800 ఏళ్లుగా నిద్రాణంగా ఉన్న అపారమైన లావా రాశి కొన్నాళ్లుగా ఒళ్లు విరుచుకుంటోంది. భారీ ప్రవాహంగా మారి భయపెడుతోంది...!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఐస్‌లాండ్ అగ్నిపర్వతాలకు పెట్టింది పేరు. అక్కడి రెగ్జానెస్ ద్వీపకల్పమైతే అందమైన అగ్నిపర్వతాలకు నిలయం. పెద్ద టూరిస్టు స్పాట్ కూడా. గత 800 ఏళ్లలో ఈ ప్రాంతంలో ఒక్క అగ్నిపర్వతం కూడా బద్దలవలేదు. అలాంటిది గతేడాది నుంచి ఇక్కడ పరిస్థితులు మారుతున్నాయి. కొద్ది రోజులుగా భయానక స్థాయికి చేరాయి. ముఖ్యంగా గ్రెంతావిక్, పరిసర ప్రాంతాల్లో గత నెల రోజుల్లోపే ఏకంగా మూడుసార్లు అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. లావా ప్రవాహాలు ఉవ్వెత్తున ఎగజిమ్మి భయభ్రాంతులను చేశాయి. దాంతో ఆ ప్రాంతాలవారిని ఖాళీ చేయించాల్సి వచ్చింది. ఇదంతా టీజర్ మాత్రమేనని అసలు ముప్పు ముందుందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. గ్రెంతావిక్ కింద భూగర్భంలో మాగ్మా (శిలాద్రవం) పూర్తిగా కరిగి అపార లావా ప్రవహంగా మారిందని తేల్చారు! దాని పరిమాణం రికార్డు స్థాయిలో ఏకంగా 65 లక్షల క్యూబిక్ మీటర్లని లెక్కగట్టారు! అంతేకాదు, ఈ లావా భూగర్భంలో ఏకంగా సెకనుకు 7,400 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవహిస్తోందట. ఇది డాన్యూబ్ వంటి భారీ నదుల ప్రవాహ వేగం కంటే కూడా చాలా ఎక్కువ. 2021–23 మధ్య ఇక్కడ భూగర్భంలో నమోదైన లావా ప్రవాహ రేటు కంటే ఇది 100 రెట్లు ఎక్కువని అధ్యయన సారథి యూనివర్సిటీ ఆఫ్ ఐస్‌లాండ్‌లోని నోర్డిక్ వోల్కెనోలాజికల్ సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ ఫ్రెస్టెనిస్ సిగ్మండ్సన్ లెక్కగట్టారు. ఈ లావా ప్రవాహం ఉజ్జాయింపుగా 15 కిలోమీటర్ల పొడవు, నాలుగు కిలోమీటర్ల ఎత్తు, కేవలం కొన్ని మీటర్ల వెడల్పున్నట్టు తేల్చారు. ఈ గణాంకాలు, హెచ్చరికలతో కూడిన అధ్యయనం జర్నల్‌సైన్స్‌లో గురువారం ప్రచురితమైంది. అందుకు కేవలం కొన్ని గంటల ముందే ఆ ప్రాంతమంతటా అగ్నిపర్వతం బద్దలవడంతో పాటు భూగర్భం నుంచి కూడా లావా ఎగజిమ్మిన ఉదంతాలు నమోదయ్యాయి! ఇలా జరగడం గత రెండు నెలల్లో మూడోసారి. గతేడాది డిసెంబర్ 18 నుంచి ఈ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు లావా ఎగజిమ్మింది. మళ్లీ ఈ ఏడాది జనవరి 14న కూడా రెండుసార్లు లావా పెల్లుబికింది. దాంతో ప్రభుత్వం హుటాహుటిన రంగంలోకి దిగింది. ఈ ద్వీపకల్పమంతటా ఎమర్జెన్సీ ప్రకటించింది.


బ్లూ లగూన్ రిసార్టు ప్రాంతం దిశగా రోడ్డుపై లావా ప్రవాహం

భవిష్యత్తుపై ఆందోళన

తాజా పరిస్థితుల నేపథ్యంలో రెగ్జానెస్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొద్ది రోజులుగా గ్రెంతావిక్‌తో పాటు ఇక్కడి పలు ఆవాస ప్రాంతాల్లో భూగర్భంపై ఒత్తిడి తీవ్రతరమవుతున్న సూచనలు ప్రస్ఫుటమవుతున్నాయి. భూమిలోంచి లావా ప్రవాహాలు ఎగజిమ్ముతుండటమే గాక ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద పగుళ్లు కనిపిస్తున్నాయి. భారీ సంఖ్యలో భూప్రకంపనలూ నమోదవుతున్నాయి. ఒక పెద్ద క్రీడా మైదానంలో సగానికి పైగా భారీ పగులు ఏర్పడటం వణికిస్తోంది. ప్రస్తుతానికైతే మొత్తం ద్వీపకల్పం భవిష్యత్తుపైనే నీలినీడలు కమ్ముకున్నాయని ప్రొఫెసర్ సిగ్మండ్సన్ ఆవేదనగా చెబుతున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ లావా ప్రవాహం మరింతగా పెరిగేలా ఉందని కూడా ఆయన హెచ్చరించారు.

అగ్నిపర్వతాల పుట్టిల్లు

ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో చురుకైన అగ్నిపర్వతాలు ఉన్న దేశంగా ఐస్‌లాండ్‌కు పేరుంది. అందుకే దాన్ని లాండ్ ఆఫ్ ఫైర్ అండ్ ఐస్ అని చమత్కరిస్తుంటారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30కి పైగా అగ్నిపర్వతాలు చురుగ్గా ఉన్నాయి. ఇవి భారీ పర్యాటక ఆకర్షణలు కూడా. వీటిని చూసేందుకు ఏటా విదేశీయులు వస్తుంటారు. ఐస్‌లాండ్ మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ ప్రాంతంలో ఉండటమే అక్కడ ఇన్ని అగ్నిపర్వాతల పుట్టుకకు ప్రధాన కారణమన్నది సైంటిస్టుల అభిప్రాయం.

ఎన్డీఏలోకి ఆరెల్డీ

- తాతకు భారతరత్నతో కేంద్రం నా మనసు గెలుచుకుంది
- చరణ్‌సింగ్ మనవడు, ఆరెల్డీ చీఫ్ జయంత్ వ్యాఖ్యలు

లఖ్‌నవూ: చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం ద్వారా నరేంద్ర మోదీ సర్కారు తన మనసు గెలుచుకుందని ఆయన మనవడు, ఇండియా కూటమి భాగస్వామి రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆరెల్డీ) అధ్యక్షుడు జయంత్‌సింగ్ అన్నారు. 'దిల్ జీత్ లియా (మనసు గెలుచుకుంది)' అంటూ శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది గంటలకే వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తరప్రదేశ్‌లో బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్నట్టు మీడియాకు వెల్లడించారు. ''మా తాతయ్యకు భారతరత్న ప్రకటించారు. ఎన్డీఏలో చేరాలన్న బీజేపీ ఆహ్వానాన్ని నేనెలా తిరస్కరించగలను?'' అన్నారు. ''ప్రధాని మోదీ ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నారు. మన దేశ స్వభావాన్ని, మౌలిక భావోద్వేగాలను తాను బాగా అర్థం చేసుకున్నానని నిరూపించుకున్నారు. కనుక సీట్లు, ఓట్ల చర్చ ఇప్పుడిక అప్రస్తుతం'' అని జయంత్ స్పష్టం చేశారు. సర్దుబాటులో భాగంగా యూపీలో భాగ్‌పత్, బిజ్నోర్ లోక్‌సభ స్థానాలు ఆరెల్డీకి దక్కుతాయి. అలాగే ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా బీజేపీ వాగ్దానం చేసినట్టు చెబుతున్నారు. ఉత్తర యూపీలో ఆరెల్డీకి చెప్పుకోదగ్గ పట్టుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఓడిన 16 స్థానాల్లో ఏడు అక్కడే ఉన్నాయి. జయంత్ నిర్ణయంతో యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి షాక్ తగిలింది.



దేశంలో 96.88 కోట్ల ఓటర్లు

న్యూఢిల్లీ: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి 96.88 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటర్ల జాబితాలో 18–29 ఏళ్ల యువ ఓటర్లు రెండు కోట్ల మందికిపైగా ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల జరిగిన 2019 ఏడాది నుంచి చూస్తే ఓటర్ల సంఖ్య ఆరు శాతం పెరిగిందని ఈసీ పేర్కొంది. ఓటర్లలో లింగనిష్పత్తిని పరిశీలిస్తే 2023 ఏడాదిలో ప్రతి వేయి మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉండగా 2024 ఏడాదిలో ప్రతి వేయి మంది పురుషులకు 948 మంది స్త్రీలు ఉన్నారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత సాధించే ప్రక్రియలో భాగంగా సవరించిన జాబితాను బహిర్గతంచేస్తున్నట్లు ఈసీ స్పష్టంచేసింది. మొత్తంగా 2.63 కోట్లకుపైగా ఉన్న కొత్త ఓటర్లలో1.22 కోట్లమంది పురుషులు కాగా 1.141 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లసంఖ్య ఏకంగా 1.85 కోట్లు ఉండటం విశేషం. ఇందులో శతాధిక ఓటర్లు ఏకంగా 2.38 లక్షల మంది ఉన్నారు. ఫిబ్రవరి 8నాటి తాజా గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 15.3 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. లక్షద్వీప్‌లో కనిష్టంగా కేవలం 57వేల మంది ఓటర్లు ఉన్నారు. తొలిసారిగా 1951వ సంవత్సరంలో ఎన్నికల వేళ 17.32 కోట్ల మంది ఓటర్లుగానమోదుచేయించుకున్నారు. 1957లో ఈ సంఖ్య 19 కోట్లు దాటింది. తొలి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం పోలింగ్ నమోదైంది.

మరో ప్రైమరీలో ట్రంప్ గెలుపు



లాస్‌వెగాస్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ ప్రైమరీ ఎన్నికల్లో దూసుకుపోతున్నారు. మరో రాష్ట్రంలో గెలుపు సొంతం చేసుకున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడడానికి ట్రంప్ అవకాశాలు మెరుగవుతున్నాయి. గురువారం నెవడా రాష్ట్రంలో జరిగిన ప్రైమరీ ఎన్నికలో ఆయన విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీ పడుతున్న మరో నేత నిక్కీ హేలీ ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. నెవడాలోని మొత్తం 26 మంది డెలిగేట్లు ట్రంప్‌నకు మద్దతు ప్రకటించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలవాలంటే మొత్తం 1,215 మంది డెలిగేట్ల మద్దతు అవసరం. ఇప్పటిదాకా ట్రంప్ 62 మంది, నిక్కీ హేలీ 17 మంది డెలిగేట్ల మద్దతు కూడగట్టారు.

ప్రత్యేక కోర్టులో రబ్డీదేవికి ఊరట

న్యూఢిల్లీ: రైల్వే శాఖలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో బిహార్ మాజీ సీఎం రబ్డీదేవి, ఆమె ఇద్దరు కుమార్తెలు మిసా భారతి, హేమా యాదవ్‌లకు ప్రత్యేక కోర్టు ఈ నెల 28వ తేదీ వరకు మధ్యంతర బెయిలిచ్చింది. రెగ్యులర్ బెయిల్ కోసం వీరు పెట్టుకున్న పిటిషన్‌పై స్పందన తెలపాలంటూ ఈడీని ఆదేశిస్తూ స్పెషల్ జడ్జి విశాల్ గొగ్నె తీర్పు వెలువరించారు. కేసు దర్యాప్తు సమయంలో నిందితులను అరెస్ట్ చేయకుండా ఇప్పుడు కస్టడీకి కోరడమెందుకని జడ్జి ఈ సందర్భంగా ఈడీని ప్రశ్నించారు.

యూపీఏపై నిర్మల నిప్పులు

నాటి ప్రభుత్వాలు దేశార్థికాన్ని దీనావస్థలోకి నెట్టాయి • శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో నిర్మల వ్యాఖ్య

న్యూఢిల్లీ: యూపీఏ హయాంలో ఒక్క కుటుంబానికే ప్రాధాన్యమిచ్చి, దేశ ఆర్థిక పరిస్థితిని దయనీయ స్థితికి దిగజార్చారంటూ కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దుమ్మెత్తిపోశారు. ''దేశ ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం, భారతీయులపై దాని ప్రభావం' అంశంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. ''మోదీ ప్రభుత్వానికి దేశమే తొలి ప్రాధాన్యం. యూపీఏకు మాత్రం ఆ ఒక్క (గాంధీ) కుటుంబమే ముఖ్యం. 2008లో దేశం ఆర్థికమాంద్యం కోరల్లో చిక్కుకుంటే జాతి ప్రయోజనాల పరిరక్షణకు యూపీఏ ప్రభుత్వాలు ముందుకురాలేదు. ఆర్థిక వ్యవస్థను కాపాడే ప్రయత్నాలు చేయకపోగా కాంగ్రెస్ చేతులెత్తేసింది. పలు స్కామ్‌లతో దేశార్థికాన్ని దీనావస్థలోకి నెట్టి 2014లో నిష్క్రమించారు. వాళ్ల అధికారంలో కొనసాగితే ఇంకెన్ని దారుణాలు జరిగేవో దేవుడికే తెలుసు. సోనియా గాంధీ సూపర్ పీఎంగా ఉండటం వల్లే యూపీఏ హయాంలో ఆర్థికవ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేది. వాళ్లిప్పుడు మాకు సంక్షోభాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తున్నారా?'' అంటూ ఆగ్రహించారు. కోవిడ్ సంక్షోభంలో మోదీ సర్కార్ ఎంతటి సమర్థతతో, అంకిత భావంతో పనిచేసిందో, పరిస్థితిని చక్కదిద్దిందో అంతా చూశారన్నారు.

వరుస కుంభకోణాలు

''బొగ్గు కుంభకోణం కారణంగా దేశం రూ.1.86 లక్షల కోట్ల ఆదాయం కోల్పోయిందని కాగ్ ఆక్షేపించింది. సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వాన్ని తలంటి ఏకంగా 214 బొగ్గు బ్లాకుల లైసెన్స్‌ను రద్దుచేసింది. కోల్‌స్కామ్ ధాటికి చివరకు చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుదుత్పత్తి తగ్గింది. మొత్తంగా పెట్టుబడులూ దెబ్బతిన్నాయి. అదే మోదీ ప్రభుత్వ పాలనలో పారదర్శకంగా బొగ్గు బ్లాకుల వేలం జరిగింది. వాళ్లు బొగ్గును బూడిదగా మార్చారు. మా మోదీ సర్కార్ లాభసాటి విధానాలతో బొగ్గును వజ్రాల వ్యాపారమంత విలువైనదిగా మార్చింది'' అన్నారు.

నాడు పరువు పోతే నేడు ప్రతిష్ఠ పెరిగింది

''యూపీఏ హయాంలో కామన్వెల్త్ క్రీడల కుంభకోణంతో దేశం పరువు పోయింది. ఇప్పుడు ప్రతిష్టాత్మక జీ20 శిఖరాగ్ర సదస్సును ఔరా అనిపించేలా నిర్వహించి దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా పెంచాం. బ్యాంకింగ్ రంగమంటే మాకు గౌరవం. కానీ యూపీఏ హయంలో ప్రభుత్వ పెద్దలు తాము చెప్పిన వారికి రుణాలొచ్చేలా చేసి మొండిబకాయిలు పెరగడానికి కారకులయ్యారు. మోదీ హయాంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బకాయిలు 3.2 శాతానికి దిగొచ్చాయి'' అన్నారు. యూపీఏ పాలనపై బురదజల్లుతున్నారంటూ నిర్మల ప్రసంగానికి విపక్ష సభ్యులు అడ్డుతగిలారు.

అమెరికా అధ్యక్షురాలిగా కమల లేదా నేను!

రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని నిక్కీ హేలీ వ్యాఖ్య



వాషింగ్టన్: 2024లో అమెరికా అధ్యక్ష పీఠాన్ని మొట్టమొదటిసారిగా మహిళ అధిరోహించనున్నారని ఐరాస మాజీ రాయబారి నిక్కీ హేలీ జోస్యం చెప్పారు. ఆ అవకాశం ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు లేదా తమ ఇద్దరిలో ఎవరో ఒకరికి దక్కనుందని ఆమె చెప్పారు. తాజాగా ఫాక్స్ న్యూస్‌తో నిక్కీ హేలీ ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ అధ్యక్షుడు ట్రంప్ వరుసగా విజయాలు సాధిస్తున్నప్పటికీ ఎన్నికల బరిలో కొనసాగుతానన్నారు. 24న జరిగే సౌత్ కరోలినా ప్రైమరీపైనే తన దృష్టంతా ఉందని నిక్కీ హేలీ చెప్పారు. రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్‌తోపాటు అధ్యక్ష బరిలో నిలిచిన ఆ పార్టీకి చెందిన ఏకైక అభ్యర్థి నిక్కీ హేలీ కావడం గమనార్హం.



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు బైడెన్ జ్ఞాపకశక్తి తగ్గిందనే విషయాన్ని ఒక నివేదిక తగిన సాక్ష్యాధారాలతో బహిర్గతం చేయడంతో ప్రస్తుతం ఈ అంశం అమెరికాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే బైడెన్ వృద్ధాప్యాన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచు కున్న రిపబ్లికన్లకు తాజా నివేదిక మరో శక్తివంతమైన ప్రచారాస్త్రమైంది. అయితే ఈ నివేదికలోని అంశాలన్నీ తప్పు అని 81 ఏళ్ల బైడెన్ ఖండించినా ఆ నివేదికలో పేర్కొన్న విషయాలను గమనిస్తే అవన్నీ నిజాలే అని అనిపించకమానవు. తక్కువ జ్ఞాపకశక్తి ఉన్న వృద్ధుడు అని బైడెన్‌ను నివేదిక అభివర్ణించింది. గత జనవరిలో వాషింగ్టన్‌లోని బైడెన్ కార్యాలయంలో రహస్య పత్రాలను సిబ్బంది కనిపెట్టడంతో ఆ విషయం అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్‌దాకా వెళ్లింది. దీంతో ఆయన న్యాయశాఖ స్పెషల్ కౌన్సిల్‌గా రాబర్ట్ హుర్‌ను నియమించారు. ఈయన ఇటీవల బైడెన్‌ను ఏకధాటిగా ఐదు గంటలపాటు ఇంటర్వ్యూ చేసి ఆయన జ్ఞాపకశక్తిపై ఒక అంచనాకొచ్చారు. ఇదిగాక ఇతరత్రా సాక్ష్యాధారాలను ఆయన తన నివేదికలో వెల్లడించారు. గురువారం విడుదలైన ఆ 345 పేజీల నివేదికలో ఏమున్నాయంటే..

- బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసినకాలంలో అఫ్గానిస్తాన్ లో అమెరికా స్థావరాలు, సైన్యం మోహరింపు రహస్యాలను ఒక ప్రైవేట్ వ్యక్తితో బైడెన్ పంచుకున్నారు. సంబంధిత రహస్య పత్రాలను డెలావర్‌లోని తన గ్యారేజీలో మర్చిపోయారు.
- తన కుమారుడు బ్యూ బైడెన్ క్యాన్సర్‌తో ఏ సంవత్సరంలో చనిపోయిందీ బైడెన్ ఠక్కున చెప్పలేకపోయారు
- ఉపాధ్యక్షుడిగా ఏ సంవత్సరంలో దిగిపోయారు అనేదీ ఈయనకు సరిగా గుర్తులేదు
- తన జీవితచరిత్ర రాస్తున్న ఒక రచయితకు సున్నితమైన అంశాలున్న ఒక నోటు పుస్త కం ఇచ్చారు. అందులో అఫ్గానిస్తాన్‌కు సంబంధించిన రహస్య సమాచారం ఉంది.

అవన్నీ అబద్ధాలు: బైడెన్

'దాదాపు 40 సంవత్సరాల క్రితం విషయాలను ఠక్కున చెప్పాలంటే ఎలా?. నా కుమారుడి మరణాన్ని చర్చించకూడదనే ఆ ప్రశ్న సమయంలో స్పందించలేదు. రెండోసారీ అమెరికాకు అధ్యక్షుడిగా కొనసాగే శక్తిసామర్థ్యాలు నాకున్నాయి''అని బైడెన్ పునరుద్ఘాటించారు. అయితే ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొన్ని విషయాలపై తడబడుతూ, పొరబడటం గమనార్హం.

ఉత్తరాఖండ్‌లో ఉద్రిక్తత

- ప్రభుత్వ స్థలంలోని మదర్సా కూల్చివేతకు యత్నం
- పోలీసులు, మున్సిపల్ యంత్రాంగంపై స్థానికుల దాడి
- పోలీసులు కాల్పుల్లో ఆరుగురు మృతి, పలువురికి గాయాలు

హల్ద్వానీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన మదరసా కూల్చివేతకు స్థానిక యంత్రాంగం ప్రయత్నించడం ఇందుకు కారణం. ఈ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితు లను అదుపులోకి తెచ్చేందుకు అధికారులు పట్టణంలో కర్ఫ్యూ విధించడంతోపాటు కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని బన్‌భూల్‌పూర్ ప్రాంతంలో మదరసా, ప్రార్థనలకు వినియోగించే ఒక నిర్మాణం ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా కట్టిన ఆ నిర్మాణాలను కూల్చివేసేందుకు గురువారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది ప్రయత్నించారు. పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత ప్రక్రియ మొదలైంది. అరగంటలోపే భారీ సంఖ్యలో జనం అక్కడికి చేరుకున్నారు. కొందరు చుట్టుపక్కల భవనాలపైకెక్కి మున్సిపల్ సిబ్బంది, పోలీసులపైకి రాళ్లు రువ్వడం ప్రారంభించారు. సంఘటన స్థలంలో గుమికూడిన వారు రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులు, దేశవాళీ తుపాకులతో అధికారులు, సిబ్బందిని ఆగ్రహంతో ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. వారిని పోలీసులు చెదరగొట్టారు. ఆందోళనకారుల ఒక గుంపు వెంటబడగా పోలీసులు సమీపంలోని పోలీస్‌స్టేషన్ లోపలికి వెళ్లారు. అక్కడికి చేరుకున్న గుంపు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టింది. పోలీస్ స్టేషన్‌కు సైతం నిప్పుపెట్టేందుకు ప్రయత్నించగా లోపలున్న పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చిందని నైనిటాల్ జిల్లా మేజిస్ట్రేట్ వందనా సింగ్ చెప్పారు. పోలీస్ స్టేషన్‌తోపాటు సిబ్బందిపై దాడికి యత్నించినట్లు గుర్తించిన సుమారు 20 మందిలో నలుగురిని అరెస్ట్ చేసి, మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. మృతి చెందిన ఆరుగురిలో ముగ్గురికి బుల్లెట్ గాయాలు, మరో ముగ్గురికి ఇతర గాయాలయ్యాయని చెప్పారు. క్షతగాత్రులైన 60 మందిలో చాలా మంది ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారని ఎస్పీ(సిటీ) హర్బన్స్ సింగ్ చెప్పారు. ఒక జర్నలిస్ట్ సహా గాయపడిన ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు.

లంచ్ విత్ మోదీ!



న్యూఢిల్లీ: సమయం మధ్యాహ్నం 2.30 గంటలు. పార్లమెంట్‌లో వాడీవేడి చర్చలతో అలసి మధ్యాహ్నం భోజనానికి సిద్ధమవుతున్న పలువురు విపక్ష ఎంపీలకు హఠాత్తుగా పిలుపు వచ్చింది. ప్రధాని మోదీ కలవాలనుకుంటున్నారని దాని సారాంశం. అంతా లిఫ్ట్ ఎక్కారు. సరిగ్గా పార్లమెంట్ క్యాంటిన్ వద్ద దిగి విజిటర్స్ లాంజ్‌లో వేచి చూస్తున్నారు. ''పదండి. మీకో శిక్ష విధిస్తాను' అని చమత్కరిస్తూ వారందరితో కలిసి భోజనానికి కూర్చున్నారు. 45 నిమిషాలపాటు కబుర్లు చెప్పుకున్నారు. వారిలో బీజేపీ ఎంపీలతో పాటు విపక్ష సభ్యులు కె.రామ్మోహన్ నాయుడు (టీడీపీ), సస్మిత్ పాత్రా (బీజేడీ), ఎన్‌కే ప్రేమచంద్రన్ (ఆర్ఎస్పీ), రితేశ్ పాండే (బీఎస్పీ) ఉన్నారు.

నిద్ర ఎప్పుడు లేస్తారు?

ఆహార అలవాట్లు మొదలుకుని అంతర్జాతీయ వ్యవహారాలదాకా అన్ని అంశాలు అక్కడ చర్చకొచ్చాయి. రోజూ ఎన్నింటికి నిద్ర లేస్తారు బిజీ షెడ్యూల్‌ను ఎలా అలసిపోకుండా నిర్వహిస్తారు వంటి ఎంపీల ప్రశ్నలకు మోదీ సరదాగా సమాధానాలిచ్చారు. ''నేనెప్పుడూ ప్రధానిని అన్న మూడ్‌లో ఉండను. మంచి ఆహారం తినాలనే మూడ్‌లోనూ ఉంటాను'' అని చమత్కరించారు. కిచిడీ తన ఫేవరెట్ ఫుడ్ అని చెప్పారు. ఒకే రోజులో వేర్వేరు రాష్ట్రాల పర్యటనలు, విదేశీ ప్రయాణాలు, గుజరాత్ గురించి పట్టింపుల వంటివెన్నో విషయాలు చర్చకొచ్చాయని ఒక ఎంపీ వెల్లడించారు. ప్రాణహాని ఉందంటూ ఎస్పీజీ హెచ్చరించినా 2015లో పాకిస్థాన్‌కు వెళ్లి నాటి పీఎం నవాజ్ షరీఫ్‌ను ఎందుకు కలవాల్సి వచ్చిందో మోదీ వివరించారు. అందరూ అన్నం, పప్పు, కిచిడీ తిన్నాక రాగి లడ్డూ రుచిచూశారు. తామంతా కూర్చున్నది మోదీతోనేనా అనే అనుమానం ఒక్కసారిగా కల్గిందని ఒక ఎంపీ చెప్పారు. '' ప్రధానితో కలిసి భోజనం చేయడం అరుదైన అనుభవం. మేం చకచక ప్రశ్నలు అడుగుతుంటే ఆయన టకటక సమాధానాలిస్తున్నారు'' అని మరో ఎంపీ చెప్పారు.

బీజేపీ ఎంపీలకు విప్

న్యూఢిల్లీ: అధికార బీజేపీ తమ పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు శుక్రవారం విప్ జారీ చేసింది. శనివారం పార్లమెంట్‌లో చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశపెట్టనున్నందున చర్చ, ఆమోదం నిమిత్తం పార్టీ సభ్యులంతా తప్పక హాజరుకావాలని అందులో కోరింది. దీంతో, పార్లమెంట్ సమావేశాల్లో ఆఖరి రోజైన శనివారం ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపడుతుందోనన్న చర్చ మొదలైంది.

ఈసీపై పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ఓటరు గుర్తింపు కార్డు అప్‌డేట్, కొత్త ఓటరు నమోదు దరఖాస్తుల్లో ఆధార్ సంఖ్యను జత చేయడానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పష్టమైన మార్పులను చేపట్టనందుకు ఎన్నికల సంఘం అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టేసింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంలో ఈసీకి మేం డెడ్‌లైనేదీ పెట్టలేదని పేర్కొంది.

రఫాను ఖాళీ చేయించండి

రఫా: గాజా దక్షిణ ప్రాంత పట్టణం రఫాను ఖాళీ చేయించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు శుక్రవారం ఆర్మీని ఆదేశించారు. మిగిలి ఉన్న హమాస్ మిలిటెంట్లను పూర్తిస్థాయిలో ఏరివేసేందుకు సైతం వ్యూహాన్ని సిద్ధం చేయాలన్నారు. దీంతో, ఈజిప్టు సరిహద్దులకు సమీపంలోని రఫాలో తలదాచుకుంటున్న 15 లక్షల మంది ప్రజల భద్రతపై అమెరికాతోపాటు అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

'పబ్లిక్ పరీక్షల'బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలను అరికట్టే బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఈ నెల 6న లోక్‌సభ ఆమోదించిన పబ్లిక్ పరీక్షల (ప్రివెన్షన్స్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్) బిల్లు–2024ను రాజ్యసభ శుక్రవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. బిల్లుకు విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆప్ సభ్యులు కూడా మద్దతివ్వడం విశేషం.

'జీవితఖైదు కాలపరిమితి'పై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: జీవితఖైదు పడిన దోషి చనిపోయేదాకా జైలు శిక్ష అనుభవించాలా అంటూ ఒక యావజ్జీవ ఖైదీ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. 'యావజ్జీవశిక్ష అంటే ఎంత కాలం? నేర శిక్షా స్మృతి(సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 432 కింద శిక్షా కాలాన్ని తగ్గించడమో, రద్దుచేయడమో చేయొచ్చా?' అన్న అంశాలపై విచారిస్తామని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం తెలిపింది.

పాకిస్తాన్‌లో హంగ్

ఇస్లామాబాద్/లాహోర్: పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో హంగ్ నెలకొంది. గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టలేదు. పోరు ఏకపక్షమేనని, సైన్యం దన్నుతో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్ (ఎన్) విజయం ఖాయమని వెలువడ్డ ముందస్తు అంచనాలన్నీ తలకిందులయ్యాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ స్థాపించిన పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. శుక్రవారం రాత్రికల్లా ఫలితాల సరళి దాదాపుగా ముగింపుకు వచ్చింది. మెజారిటీ మార్కు 133 కాగా పీటీఐ 97 సీట్లు నెగ్గి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఇమ్రాన్ జైలుపాలై పోటీకే దూరమైనా, ఎన్నికల గుర్తు రద్దై అభ్యర్థులంతా స్వతంత్రులుగా నానారకాల గుర్తులపై పోటీ చేయాల్సి వచ్చినా దేశవ్యాప్తంగా వారి జోరు కొనసాగడం విశేషం. నవాజ్ పార్టీకి 66, బిలావల్ భుట్టో సారథ్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి 51 స్థానాలు దక్కాయి. మిగతా పార్టీలకు 24 సీట్లొచ్చాయి. మరో 27 స్థానాల ఫలితాలు వెల్లడవాల్సి ఉంది. పాక్ జాతీయ అసెంబ్లీలో మొత్తం స్థానాలు 336 కాగా 266 సీట్లకే ఎన్నికలు జరుగుతాయి. మహిళలకు, మైనారిటీలకు రిజర్వు చేసిన 70 సీట్లను పార్టీలు గెలుచుకునే స్థానాల ఆధారంగా వాటికి దామాషా పద్ధతిలో కేటాయిస్తారు. ఒక అభ్యర్థి మృతి నేపథ్యంలో ఈసారి 265 స్థానాల్లో పోలింగ్ జరగ్గా ఇప్పటిదాకా 238 స్థానాల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈసారి ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దానికి తోడు ఫలితాల వెల్లడి విపరీతంగా ఆలస్యమవుతుండటంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల అధికారులే ఫలితాలను పీఎంఎల్‌కు అనుకూలంగా మార్చేస్తున్నారని పీటీఐ దుమ్మెత్తిపోస్తోంది. లాహోర్ స్థానంలో చాలాసేపటిదాకా వెనకబడి ఉన్న నవాజ్ చివరికి మంచి మెజారిటీతో నెగ్గినట్టు ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లాహోర్‌లోని మరో మూడు స్థానాల్లో ఆయన కూతురు, సోదరుడు, మరో బంధువు గెలిచినట్టు ఈసీ ప్రకటించింది. అయితే మరో స్థానంలో మాత్రం పీటీఐ మద్దతుతో బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థి చేతిలో నవాజ్ ఓటమి చవిచూడటం విశేషం. ఈ నేపథ్యంలో పీటీఐ ప్రదర్శనను షరీఫ్ అభినందించడం విశేషం. కాకపోతే పీఎంఎల్ అత్యధిక స్థానాల్లో నెగ్గి అతి పెద్ద పార్టీగా అవతరించిందని ఆయన చెప్పుకొచ్చారు. దేశ ప్రయోజనాల రీత్యా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామంటూ పిలుపునిచ్చారు. పీటీఐ చైర్మన్ గోహర్ ఖాన్ మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమంటూ కుండబద్దలు కొట్టారు. స్వతంత్రులుగా నెగ్గిన ఆ పార్టీ అభ్యర్థులకు ఎర వేసి లాక్కునేందుకు పీఎంఎల్ జోరుగా ప్రయత్నిస్తోందని వార్తలొస్తున్నాయి.

ఇమ్రాన్ మద్దతుదార్ల జోరు

- ఇప్పటికి 97 స్థానాల్లో గెలుపు
- 66 సీట్లకు పీఎంఎల్ పరిమితం
- పీపీపీకి 51, ఇతరులకు 24
- సంకీర్ణానికి నవాజ్ పిలుపు
- 'ఇమ్రాన్' అభ్యర్థులకు ఎర!

సాక్షి హైదరాబాద్

శనివారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2024

'వేయి' కళ్లు చాలవే..



ప్రముఖ బాలీవుడ్ డిజైనర్ నీతా లుల్లా ఆధ్వర్యంలో.. రెండు వందల మందికి పైగా ఔత్సాహిక డిజైనర్లు సృష్టించిన 1000 రకాల సరికొత్త డిజైన్లు ర్యాంప్‌పై మెరిశాయి. నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన షో టైమ్ ఫ్యాషన్ ప్రదర్శన ఆకట్టుకుంది. డిజైనర్లు రూపుదిద్దిన దుస్తుల్లో మోడల్స్ తళుక్కుమన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



భాగ్యరత్న

పీవీకి నగరంతో విడదీయలేని అనుబంధం

- ఎక్స్‌ప్రెస్ హైవేకు ఆయన పేరు.. నెక్లెస్ రోడ్‌లో స్మారకం
- భారతరత్న పురస్కారానికి ఎంపికపై సర్వత్రా హర్షం
- మాజీ ప్రధాని సేవలను గుర్తు చేసుకున్న నగర వాసులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంతో నగరంలో హర్షం వెల్లువెత్తింది. ఉస్మానియా వర్సిటీలో ఆర్ట్స్ కాలేజీ నుంచి బ్యాచిలర్ పట్టభద్రుడైన పీవీకి నగరంతో విడదీయలేని అనుబంధం ఉంది. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడిగా 1930లో నగరం వేదికగా జరిగిన హైదరాబాద్ వందేమాతరం ఉద్యమంలో తొలిసారి పాల్గొన్నది కూడా నగరం నుంచే.

విశ్వనగరికి బాటలు వేసిన సంస్కరణలు..

ప్రస్తుతం హైదరాబాద్‌ను విశ్వ నగరంగా మార్చేందుకు బీజం వేసిన ఆర్థిక సంస్కరణలు పీవీ హయాంలోనే వెలుగు చూశాయి. విద్యారంగం, విదేశీ విధానాల విషయంలో ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక విధానాలు నగర రూపురేఖల్ని మార్చాయని చెప్పవచ్చు. చారిత్రకంగా చూస్తే గోల్కొండ, హైదరాబాద్‌లు ఒకప్పుడు అంతర్జాతీయ వ్యాపార విపణి కేంద్రాలుగా ఉండేవని, ఆ తర్వాత మళ్లీ రెండోసారి పీవీ హయాంలోనే నగరం విశ్వవ్యాప్తంగా ఆర్థిక సంబంధాలను విస్తరించుకుందనవచ్చు.

సంస్కరణల పితామహుడి సంస్మరణలో..

నగర విజయాలకు బాటలు వేసిన పీవీని నగరం అనేక రకాలుగా ఘనంగా స్మరించుకుంటోంది. అందుకు తొలి పునాది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పడింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నగరంతో అనుసంధానిస్తూ మెహిదీపట్నం మీదుగా నెలకొల్పిన అత్యంత పొడవైన 11.6 కి.మీ పీవీ ఎక్స్‌ప్రెస్ హైవేకు 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విభజనానంతరం 2014లో పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ ఫర్ వెటర్నరీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే హైదరాబాద్ వెటర్నరీ కాలేజ్ ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. మిగిలిన ప్రధానులందరికీ దేశ రాజధానిలో ఘాట్‌లు ఏర్పాటు చేయగా పీవీకి ఒక్కరికే నగరంలో ఏర్పాటు చేశారు. అదే చోట గత 2021లో అడుగుల కాంస్య విగ్రహాన్ని నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞానభూమిలో నెలకొల్పారు. అదే సమయంలో నెక్లెస్‌రోడ్‌కు పీవీ నరసింహారావు మార్గ్‌గా నామకరణం చేశారు.

ఓయూ విద్యార్థిగా వందేమాతరం ఉద్యమంలో..

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నకు ఎంపికైన ఓయూ పూర్వ విద్యార్థిగా పీవీ చరిత్ర పుటల్లోకెక్కారు. ఓయూ క్యాంపస్‌లోని కృష్ణవేణి హాస్టల్‌లో (బి–హాస్టల్ భవనం ప్రస్తుతం మూతపడింది) ఉంటూ ఆర్ట్స్ కాలేజీలో ఆయన డిగ్రీ చదివారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అనేక ఆందోళన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆయన అరెస్ట్‌కు అప్పట్లో వారెంట్ జారీ చేయగా పీవీ ఓయూ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం నగరాన్ని వీడిన పీవీ నాగ్‌పూర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి దేశ ప్రజలకు సేవలందించారు. కాగా.. ఓయూ పూర్వ విద్యార్థి, మాజీ ప్రధాని పీవీకి కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం పట్ల ఓయూ వీసీ ప్రొ.రవీందర్, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మిగిలింది రెండేళ్లే!

ఏం చేస్తారో ఏమో!!

- కప్పగంతుల్లో కార్పొరేటర్లు
- స్టాండింగ్ కమిటీ ఆచూకీ లేదు
- బడ్జెట్ ఆమోదం పొందలేదు
- కోర్టు మెట్లెక్కితే కానీ కౌన్సిల్ సమావేశం
- నేటితో జీహెచ్ఎంసీ పాలకమండలికి మూడేళ్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కౌన్సిల్ కొలువుదీరి నేటికి మూడేళ్లు పూర్తవుతాయి. ఇక మిగిలింది రెండేళ్లే. ఈ రెండేళ్లలో ఎవరెవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే దాదాపు పదిహేను మంది పార్టీలు మారారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో కప్పగంతులు ఇంకా కొనసాగవచ్చనే అంచనాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీలోకి పలువురు వెళ్లారు. ఇప్పుడిక కాంగ్రెస్సే అధికారంలోకి రావడంతో మరికొందరు అటు వెళ్లే అవకాశాలున్నాయి. దీంతో మిగిలిన రెండేళ్ల కాలానికి ఏ పార్టీలో ఎంత మంది ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల మేయర్ విజయలక్ష్మి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం కూడా పలు ఊహాగానాలకు తావిచ్చింది. కార్పొరేటర్ల పార్టీ మార్పిళ్ల సంగతిలా ఉండగా, ఈ మూడేళ్ల కాలంలో పాలకమండలి తీరు వివాదాస్పదం కావడం తప్ప చెప్పుకోదగ్గ పని ఒక్కటి కూడా చేయలేదనే విమర్శలున్నాయి.



స్టాండింగ్ కమిటీ లేకుండానే..

గత అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగలేదు. ఆ కోడ్ ముగిసిపోయి, త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రానున్నప్పటికీ కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక పూర్తి కాలేదు. దీంతో ఈసారి స్టాండింగ్ కమిటీ పరిశీలన లేకుండానే బడ్జెట్ నేరుగా కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలోనే ఆమోదం పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకు సైతం సీఎం నుంచి ప్రత్యేకంగా అనుమతి పొందాల్సి వచ్చింది. వివిధ కారణాలతో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికే జరగలేదు. ఇక మిగిలిన రెండేళ్లలో ఎప్పుడు ఎన్నుకుంటారో అర్థంకాని పరిస్థితి.

కోర్టుకు వెళ్తేనే కౌన్సిల్ సమావేశం

మిగతావాటి సంగతి అటుంచి కౌన్సిల్ సర్వసభ్య సమావేశ నిర్వహణకు సైతం కోర్టు మెట్లెక్కాల్సిన దుస్థితి గతంలో మునుపెన్నడూ లేదు. కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో అభివృద్ధి పనులు మూలకు పడ్డాయని బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ హైకోర్టుకు వెళ్లడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహణకు సిద్ధమయ్యారు.

కొందరికి కలిసొచ్చిన కాలం

కొందరు సిట్టింగ్ కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలుగా టికెట్లు లభించడంతో పాటు కొందరు ఎమ్మెల్యేలుగా కూడా ఎన్నికయ్యారు. శాస్త్రిపురం కార్పొరేటర్ మహ్మద్‌ముబిన్ బహదూర్‌పురా నుంచి, మెహిదీపట్నం కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ నాంపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో వీరిద్దరి కార్పొరేటర్ల సీట్లు ఖాళీ అయ్యాయి. మరో కార్పొరేటర్ దేవర కరుణాకర్ మరణంతో గుడిమల్కాపూర్ స్థానం ఖాళీగా ఉంది.

రసాభాసలతోనే..

కౌన్సిల్ సమావేశాలు జరిగిందే తక్కువ. అవి సైతం రసాభాసలతోనే ముగిశాయి. మేయర్ చాంబర్‌లో విధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ కౌన్సిల్ హయాంలో ప్రజలకు ఉపయోగపడేది కానీ.. సమాజానికి ఉపకరించేది కానీ కనీసం ఒక్కటంటే ఒక్క మంచి కార్యక్రమం కూడా చేపట్టకపోవడం శోచనీయం. గతంలోని కౌన్సిల్స్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ హైదరాబాద్ వంటి కార్యక్రమాలపైనైనా ప్రత్యేక ఫోకస్ ఉంచి ఎంతోకొంత ఫలితం సాధించాయి. కానీ.. ఈ కౌన్సిల్ వంటి దారుణమైన పరిస్థితి జీహెచ్ఎంసీలో ఎప్పుడూ లేదనే ఆరోపణలున్నాయి. వివిధ విభాగాల్లో అవినీతికి అంతే లేకుండాపోయింది. అయినా కట్టడికి అటు అధికారులు కానీ.. ఇటు పాలకమండలి కానీ చేసిందేమీ లేదనే అపకీర్తిని మాత్రం మూటగట్టుకుంది.

అక్షర లక్షలు

ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన పుస్తకాలు

- పది రోజుల పాటూ పాఠకులకు పండగే
- ప్రదర్శనను ప్రారంభించిన పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య
- సకల రుగ్మతలకు విరుగుడు పుస్తక పఠనమే: మంత్రి జూపల్లి
- మొదటి రోజే వేలాదిగా తరలివచ్చిన పుస్తకప్రియులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పుస్తకాలు కొలువుదీరాయి. 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవానికి తరలివచ్చాయి. శుక్రవారం సాయంత్రం పుస్తక ప్రదర్శనను ప్రముఖ రచయిత, ఇంటినే గ్రంథాలయంగా మార్చుకున్న పుస్తక మహోద్యమకారుడు పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పుస్తకమే మనిషిని పరిపూర్ణం చేస్తుందన్నారు. పుస్తక ప్రదర్శన వేదికకు, ప్రాంగణానికి ప్రజాగాయకుడు గద్దర్, ఆచార్య రవ్వా శ్రీహరిల పేర్లు పెట్టడం అభినందనీయమన్నారు. పుస్తకమే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని, పుస్తకాలు బాగా చదివిన వాళ్లే మహాత్ములయ్యారని చెప్పారు. తాను ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో 2 లక్షలకు పైగా పుస్తకాలు ఉన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ, పుస్తకమే ప్రపంచాన్ని ఏలుతోందన్నారు. అక్షరానికి మరణం లేదని చెప్పారు. పుస్తక ప్రదర్శన కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందజేస్తోందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాస్, సుధా భాస్కర్, 'వీక్షణం' వేణుగోపాల్, గద్దర్ కూతురు వెన్నెల తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం మంత్రి జూపల్లి కృష్ణారావు బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో తెలంగాణ అమరుల స్తూపాన్ని ఆవిష్కరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విఠలాచార్య తదితరులు

అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకల రుగ్మతలకు విరుగుడు పుస్తక పఠనమేనని పేర్కొన్నారు.

విభిన్న రంగాలపై అరుదైన గ్రంథాలు

బుక్‌ఫెయిర్‌లో ఈసారి 365 స్టాళ్లను ఏర్పాటు చేశారు. విభిన్న రంగాలకు చెందిన లక్షలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ స్థాయిలో పేరొందిన పలు ప్రచురణ సంస్థలు సరికొత్త పుస్తకాలను అందుబాటులోకి తెచ్చాయి. రచయితలు తాము రాసిన పుస్తకాలను స్వయంగా విక్రయించేందుకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలోనూ పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదనేందుకు నిదర్శనంగా ప్రదర్శన ప్రారంభమైన మొదటి రోజే వేలాది మంది పుస్తకప్రియులు, సందర్శకులు తరలి వచ్చారు. బాలల సాహిత్యం, ఆధ్యాత్మికం, వ్యక్తిత్వ వికాసం, వైద్యం, ఆరోగ్యం, ఆయుర్వేదం, హోమియో వంటి వివిధ రంగాలకు చెందిన పుస్తకాలతో పాటు, చరిత్ర, సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. మరోవైపు మాజీ ప్రధాని పీవీకి శుక్రవారం కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో పలువురు యువతీ యువకులు ఆయన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఆయన రాసిన పుస్తకాలు, ఆయనపై వెలువడినవి రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి.



ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న సందర్శకులు



పుస్తకాలను ఆసక్తిగా చూస్తున్న చిన్నారులు

నేడు, రేపు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి..

శని, ఆదివారాలు రెండు రోజులు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన కొనసాగనుంది. శనివారం సాయంత్రం 6 గంటలకు 'గద్దరన్న యాదిలో' సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పసునూరి రవీందర్ అధ్యక్షత వహించనున్నారు. ప్రొఫెసర్ ఖాసీం, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, ఏపూరి సోమన్న, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, యశ్పాల్, మాస్టార్జీ తదితరులు పాల్గొంటారు. 11వ తేదీ ఆదివారం సాయంత్రం 'నేటి బాలసాహిత్యం తీరుతెన్నులు' అనే అంశంపై సదస్సు ఉంటుంది. మణికొండ వేదకుమార్, చొక్కాపు వెంకటరమణ, డా.సి.ఎ.ప్రసాద్, డా.వీఆర్.శర్మ, అమరవాది నీరజ, దుర్గం భైతి, పెండోట వెంకటేశ్వర్లు పాల్గొంటారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రైటర్స్ స్టాల్‌లో 'రుద్ర ప్రయాగ చిరుతపులి'

వివిధ భాషల్లో ఇప్పటికే కోటికి పైగా అమ్ముడైన జిమ్‌కార్బెట్ రాసిన 'ది మ్యాన్ ఈటింగ్ లియోపార్డ్ ఆఫ్ రుద్రప్రయాగ్' పుస్తకం తెలుగులో 'రుద్ర ప్రయాగ చిరుతపులి'గా వెలువడింది. అనేక సంవత్సరాలుగా తెలుగు పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ పుస్తకాన్ని 356– 360 స్టాళ్లలో అందుబాటులో ఉంచారు.

మారితేనే మనుగడ!

ట్రాఫిక్ రూల్స్ పట్టని సిటీజనులు

- ఏడాదిలో 47.25 లక్షల ఉల్లంఘనలు
- 2022 కంటే ఏడు శాతం పెరిగిన వైనం
- ఈ– చలాన్ల మోతలోనూ మారని తీరు
- చెల్లించిన జరిమానా రూ.71 కోట్లకు పైనే
- ఈ వ్యవహార శైలి సైతం జామ్స్‌కు కారణమే

ట్రాఫిక్ HOT టాపిక్‌-5

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వాహనాల సంఖ్య ఏటా పెరుగుతోంది. నియంత్రణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వట్లేదు.. మౌలిక వసతుల కల్పనను యంత్రాంగాలు అవసరమైన స్థాయిలో చేయట్లేదు. నిబంధనలు మన కోసమే అన్న సివిక్ సెన్స్ వాహన చోదకుల్లో కొరవడి ఎడాపెడా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. రహదారులపై విచ్చలవిడిగా దూసుకుపోతూ ఎక్కడపడితే అక్కడ ఉల్లంఘనలు చేస్తున్న వాహనచోదకులూ ట్రాఫిక్ కష్టాలకు కారణం అవుతున్నారు. నగరంలో 2022 కంటే 2023లో ఉల్లంఘనల కేసులు ఏడు శాతం పెరిగాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వీటి కంటే దాదాపు రెట్టింపు..

నగర వ్యాప్తంగా గతేడాది చోరీలు, దోపిడీలు, బందిపోటు దొంగతనాలు వంటి సొత్తు సంబంధిత నేరాల కేసులు 3,198 నమోదయ్యాయి. వీటిలో నగర వాసులు కోల్పోయిన మొత్తం రూ.38.38 కోట్లుగా ఉంది. అదే ట్రాఫిక్ ఉల్లంఘనల విషయానికి వస్తే జారీ అయిన ఈ–చలాన్ల సంఖ్య 47.25 లక్షలు కాగా.. వీటికి సంబంధించిన వాహన చోదకులు చెల్లించిన మొత్తం ఏకంగా రూ.71 కోట్లకు పైనే ఉంది.

వారికి రెడ్ కూడా 'గ్రీనే'..

ఏడాది	కేసులు
2022	42,261
2023	65,413

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఖాతరు చేయని వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఏ జంక్షన్‌లో చూసినా వీరు అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. కొన్ని సెకన్ల వేచి చూడలేక ముందుకు 'ఉరుకుతూ' ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి వారితో పాటు ఎదుటి వారికీ మృత్యువును దరి చేరుస్తున్నారు. ఎర్ర లైట్‌కు ఆగాలని.. గ్రీన్ లైట్ వచ్చాకే వెళ్లాలని, పసుపు కనిపిస్తే ఆగేందుకు/వెళ్లేందుకు సిద్ధపడాలన్న స్పృహ అతి తక్కువ మందిలో ఉంటోంది. అనేక జంక్షన్లు జామ్ కావడానికీ ఇదే ప్రధాన కారణంగా మారుతోంది.



ఎవరికి వారే బాధ్యులు..

నగరంలో ఈ పరిస్థితుల నెలకొనడానికి ఏ ఒక్కరో కారణం కాదు. ప్రభుత్వ యంత్రాంగాల అలసత్వం, వాహన చోదకుల నిర్లక్ష్యం వెరసీ.. పరిస్థితి అధ్వానంగా మారుతోంది. కేవలం చలాన్ల రూపంలోనే కాకుండా విలువైన పని గంటలు, ఇంధనం రూపంలోనూ నగర జీవి నష్టపోతున్నాడు. నిబంధనలను ఇబ్బందిగా ఫీల్ అవుతున్న నగరవాసి, మౌలిక వసతుల కల్పనను ఓ భారంగా భావిస్తున్నా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ ఎడ్యుకేషన్‌కు సరైన ప్రాధాన్యం ఇవ్వని ట్రాఫిక్ కాప్స్ సమూలంగా మారితేనే పరిస్థితుల్లో మార్పు వస్తుంది.

– ప్రభాకర్, మాజీ ఏసీపీ

'నిషా'చరులకు కొదవే లేదు...

ఏడాది	కేసులు
2022	44,990
2023	37,866

రోడ్డు ప్రమాదాలను మూడురకాలుగా విభజించే ట్రాఫిక్ పోలీసులు... ఆ ప్రాధాన్యతా క్రమంలోనే కఠినంగా వ్యవహరిస్తుంటారు. వాహన చోదకుడికి ప్రమాదం కలిగించేవి, ఎదుటి వ్యక్తికి ప్రమాదకారులు, వాహనచోదకుడితో పాటు ఎదుటి వారికీ ప్రమాదాన్ని చేకూర్చేవి. అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన మూడో కేటగిరీలో కీలకమైంది డ్రంకన్ డ్రైవింగ్. మద్యం తాగి వాహనం నడపడం వల్ల కేవలం దాని చోదకుడికి మాత్రమే ప్రమాదం కాదు. ఒక్కో సందర్భంలో పదుల సంఖ్యలో బాధితులుగా మారుతుంటారు.

'కనిష్టంగా' హెల్మెట్, సీట్ బెల్ట్...

ద్విచక్ర వాహన చోదకులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నది ప్రాథమిక నిబంధన. రోడ్డు ప్రమాదాల బారినపడుతున్న ద్విచక్ర వాహన చోదకుల్లో 80 శాతం తలపై గాయాలతోనే మరణిస్తుంటారు. మరెందరో క్షతగాత్రులు తలలోని కీలక భాగాలు దెబ్బతిని జీవశ్చవాలుగా మారుతుంటారు. ఇది తెలిసీ హెల్మెట్ లేకుండా దూసుకుపోతుంటారు. సీట్ బెల్ట్ లేకుండా తేలికపాటి, భారీ వాహనాల్లో ప్రయాణమూ ప్రమాదహేతువే అయినా ఎవరికీ పట్టదు.

ఏడాది	వితౌట్ హెల్మెట్	వితౌట్ సీట్‌బెల్ట్
2022	23,80,699	20,976
2023	18,33,761	18,429

చిరుధాన్యాలతో ఆరోగ్యం



శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేస్తున్న గవర్నర్

- సంప్రదాయ ఆహారంతోనే కరోనాను జయించాం
- గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

ఏజీవర్సిటీ: భారత దేశ సంప్రదా య ఆహారంతోనే భయంకరమైన కరోనాను జయించగలిగాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలతో తయారైన ఆహా ర పదార్థాలు, నూడుల్స్, బిస్కె ట్లు ఇతర తిను బండారాలను తీసుకోవాలి. చిన్న పిల్లలు తినే ఆహార పదార్థాలపై తల్లులకు అవగాహన కల్పించాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ 9వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని ఆమె గుర్తు చేశారు. మన దేశంలో పండించిన చిరుధాన్యాలను ప్రపంచ దేశాలు పరిపుష్టిగా తింటూ ఆరోగ్యాన్ని పెంచుకుంటున్నాయని, మనం మాత్రం వాటిని దూరం పెడుతున్నామన్నారు. భారత దేశ సనాతన సంస్కృతీ సంప్రదాయాలలో చిరు ధాన్యాలు ఒకటని గవర్నర్ పేర్కొన్నారు. అంతకుముందు పరిశోధన సంస్థలో మిల్లెట్స్‌తో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను తమిళిసై పరిశీలించారు. మిలెట్స్‌పై పలు రంగాలలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు అవార్డులను అందజేశారు. హరియాణాలోని రైతు అభివృద్ధి సహకార సంఘంతో సీఎస్‌హెచ్ మేత జొన్న హైబ్రిడ్ కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలిన్ డి ఆరోస్, ఉదయపూర్ మహారాణా ప్రతాప్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఎస్ఎల్ మెహతా, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీతారాం సత్యవతి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

హఫీజ్‌పేట్ : మహిళలు స్వేచ్ఛతో పాటు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లోని ఇంద్రజిత్ గుప్తా మెమోరియల్ హాల్‌లో మహిళ సంక్షేమ కేంద్ర సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళలు ఒకరిపై ఆధారపడకుండా ఉండాలని స్వయంగా సంపాదించుకోవడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సీఆర్ ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల శిక్షణ, ఆరోగ్య పరమైనటువంటి కార్యక్రమాలతో మహిళలలో చైతన్యం నింపాలన్నారు. మహిళలు ప్రశ్నించడం, సహాయం చేయడంలో వెనుకడుగు వేయకుండా శిక్షణ ఇవ్వాలన్నారు. కాగా తన జీతం నుంచి లక్ష రూపాయలు సీఆర్ ఫౌండేషన్‌కు విరాళంగా అందిస్తున్నానన్నారు. అనంతరం ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని కూనంనేని, వినయ్ పి, పిఎస్ఎస్ఆర్ లక్ష్మి, డాక్టర్ బివి విజయలక్ష్మి, కృష్ణ కుమారి, పాల్గొన్నారు.

భూముల చుట్టే వివాదాలు

- జిల్లాలో భారీగా భూ కొనుగోళ్లు
- ప్రజాప్రతినిధులు, అధికారుల గుట్టు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం
- లెక్క తీస్తుండటంతో అధికారుల్లో ఆందోళన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూముల కొనుగోళ్ల వ్యవహారం గత ప్రభుత్వంలోని పెద్దలతో అంటకాగిన అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అధికారం మాటున అక్రమార్జనకు పాల్పడటంతో పాటు జిల్లాలో భారీగా భూ కొనుగోళ్లకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇతర బినామీ పేరున పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా అధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిర్వహించిన భూ సేకరణ, ఉపాధి కల్పన, పెట్టుబడులతో పేరుతో దేశవిదేశాలకు చెందిన కంపెనీల రాక, వాటికి కేటాయించిన భూముల వివరాలు ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారులకు ముందే తెలియడం, వారి తమ బినామీలను రంగంలోకి దింపి..రైతుల నుంచి అగ్గువకు భూములు కొట్టేయడం, ఆ తర్వాత ఆయా భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించి భారీగా సొమ్ము చేసుకోవడం వంటి అంశాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

మాజీ సీఎస్ మొదలు..:

మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ వట్టినాగులపల్లి సహా యాచారం మండలాల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రాగా, ఆ తర్వాత మాజీ డీజీపీపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో అరెస్టు అయిన హెచ్ఎండీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివబాలకృష్ణ సైతం వట్టినాగులపల్లి, శంషాబాద్, శంకర్‌పల్లి విల్లాలు, అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు, వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. హెచ్ఎండీఏ మాజీ కమిషనర్ అర్వింద్‌కుమార్ కూడా జిల్లాలో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పద భూములకు అనుమతులు ఇప్పించి, భారీగా సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. నార్సింగి, వట్టినాగులపల్లిలోని పలు వివాదాస్పద భూములకు క్లియరెన్స్ ఇప్పించి, ఇందుకు ప్రతిఫలంగా మహేశ్వరం మండలం, మంఖాల్ రెవెన్యూ పరిధిలోని ఓ ప్రముఖ వెంచర్‌లో విలువైన ప్లాట్‌ను గిఫ్ట్‌గా పొందారనే ఆరోపణలు లేకపోలేదు. ఆయా అక్రమార్కులపై పలువురు సామాజిక వేత్తలు, అధికార పార్టీ నేతలు మీడియా సాక్షిగా ఆరోపణలు గుప్పించడంతో పాటు వారి అక్రమాల చిట్టాను ఐటీ, ఏసీబీ సంస్థలకు అందజేస్తున్నారు. విచారణ జరిపించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ అధికారులకు కునుకు కరువే

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వారితో అంటకాగిన అప్పటి ఉన్నతాధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుండటంతో యాచారం, కడ్తాల్, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శంషాబాద్, మహేశ్వరం, పరిసరాల్లో భూములు కొనుగోలు చేసిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు సైతం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగా హెచ్ఎండీఏ, జిల్లా రెవెన్యూ, పోలీసు విభాగాల్లో పని చేసిన అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఎప్పుడు ఏ పిడుగులాంటి వార్త వినాల్సి వస్తుందో? అనే ఆందోళన మొదలైంది. ఐటీ, ఏసీబీ దాడులు జరిగే అవకాశం ఉండటంతో వారంతా జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే వారి ఇంట్లోని బీరువాల్లోనే కాదు బ్యాంకు లాకర్లలో భద్రంగా దాచుకున్న నగదు, నగలు, విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఎవరికీ అనుమానం రాకుండా దూరపు బంధువులు, బినామీలు, స్నేహితుల ఇళ్లకు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

డాక్టర్ స్వర్ణలతకు 'ఆరోగ్య' సుశ్రుత అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ స్వర్ణలత

లక్డీకాపూల్ : నిమ్స్ నెఫ్రాలజిస్టు, జీవన్‌దాన్ తెలంగాణ ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ జి. స్వర్ణలతను ఆరోగ్య సుశ్రుత-2024 అవార్డు వరించింది. ఇప్పటికే జీవన్‌దాన్‌కు అంతర్జాతీయ అవార్డు లభించిన సంగతి తెలిసిందే. తాజాగా వైద్య రంగంలో ఆమె చేస్తున్న కృషికి 1వ టెలివిజన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీని ప్రగతి మైదాన్‌లో జరిగిన ఆరోగ్య సదస్సులో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మాన్సుఖ్ మండవీయ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. మరణించిన వారి అవయవాలను సేకరించి ఆర్గాన్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అసాధారమైన కృషి చేసినందుకుగానూ ఆమెకు గతంలో హ యత్ ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలతను డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, వైద్యులు అభినందించారు.

నేడు ఆనందిత కూచిపూడి నృత్య ప్రదర్శన



లక్డీకాపూల్ : సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్ అవార్డు గ్రహీత కుమారి దామెర్ల ఆనందిత కూచిపూడి నృత్య ప్రదర్శన శనివారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో నిర్వహించనున్నట్లు చైతన్య ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి కెకె రాజా తెలిపారు. ఆనందిత నవరస దైవ విలాసం నృత్య రూపాకాన్ని కనక విజయలక్ష్మి దామెర్ల పర్యవేక్షణలో ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జి. సత్యవాణి, కళాబంధు డాక్టర్ జి. అనూహ్య రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

'ఉద్యోగులను బెదిరిస్తే సహించం'

సాక్షి,సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీ అండతో జలమండలి ఉద్యోగులు, కార్మికులను బెదిరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ (బీఆర్‌టీయూ)అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌టీయూకు అనుబంధ గుర్తింపు సంఘం నుంచి బహిష్కరణకు గురైన రాజిరెడ్డి, జహంగీర్‌తో పాటు మరో సంఘం నేత సతీష్ తదితరులు కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీలో చేరి ఉద్యోగులను, కార్మికులను బెదిరిస్తూ ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే దాని గొడుగు కిందకు చేరడం వీరి అలవాటన్నారు. ఐఎన్‌టీయూసీలో చేరిన వారికి బీఆర్‌టీయూ అనుబంధంగా ఉన్న గుర్తింపు సంఘం, యూనియన్ ఆఫీస్‌తో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు, కార్మికుల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్న వారి ఆటలను సాగనివ్వబోమని హెచ్చరించారు.

బస్సు కండక్టర్‌పై మహిళ దాడి

అత్తాపూర్: తాను దిగాల్సిన చోటబస్సు ఆపలేదని ఆగ్రహించిన ఓ మహిళ కండక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ప్రసన్న శుక్రవారం శివరాంపల్లిలో బస్సు ఎక్కిన ఆమె హైదర్‌గూడ కల్లు కంపౌండ్ ప్రాంతంలో దిగాల్సి ఉండగా అత్తాపూర్‌లో దిగింది. వెనక్కి వెళ్లేందుకుగాను రోడ్డు దాటి మెహిదీపట్నం నుంచి ఉప్పల్ వెళుతున్న 300 నంబర్ బస్సు ఎక్కింది. సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న బస్టాపులో దిగేందుకు ప్రయత్నించగా కండక్టర్ ముత్యాల నర్సింహ ఎక్కడ దిగాలమ్మా అని అడిగాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ప్రసన్న మహిళలకు ఉచితంగా బస్సులు ఎందుకు నడుపుతున్నారో అంటూ ఆయన దవడలు వాయించింది. దీంతో ప్రయాణికులు జోక్యం చేసుకుని బస్సును రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బస్సు స్టేషన్‌కు చేరుకోగానే ప్రసన్న అందరికళ్లుకప్పి అక్కడినుంచి పరారైంది. కండక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూడళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన జంక్షన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంక్షన్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ కూడా సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లపై ఉన్న కల్వర్టుల వెడల్పు కోసం అవసరమైన చోట ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పాదచారుల ప్రమాదాల నివారణకు అవసరమైన చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు స్థలం గుర్తించాలని సూచించారు. ఇప్పటికే నగరంలో 22 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టగా ఇందులో 11 అందుబాటులోకి వచ్చాయన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద ఎస్కలేటర్‌లు పని చేయని పక్షంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రజలకు వరద ముంపు లేకుండా మాన్సూన్ ప్రిపేర్ ప్లాన్ ముందస్తు తయారు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ చంద్రశేఖరరావు మృతి

సాక్షి,సిటీబ్యూరో: డా. బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య ఆర్‌వీఆర్ చంద్రశేఖరరావు గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన డా.బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి 1989 నుంచి 1992 వరకు ఉపకులపతిగా విధులు నిర్వర్తించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి పలు సంస్కరణలు చేపట్టారు. ఆయన మృతి పట్ల వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. ఏ.వీ.ఎన్.ఆర్. రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘాల నేతలు మాజీ ఉపకులపతి మృతి పట్ల సంతాపం తెలిపారు.

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల లోగో ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ఆవిష్కరించారు. సంఘానికి అన్నివిధాలా సహాయసహకారాలు అందజేస్తానని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం గత ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో ఉద్యమ జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేస్తున్నామని, నూతన ఉత్తేజంతో యువ జర్నలిసులను కూడా కలుపుకుని పోయేందుకు కృషి చేస్తున్నట్లు టీయూజేఎస్ కన్వీనర్ ఎం.ఎం.రహమాన్ తెలిపారు. ముఖ్యమంత్రి తమ విజ్ఞప్తికి స్పందించి లోగోను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.ఉద్యమ జర్నలిస్టుల సంఘాన్ని అత్యున్నత ప్రాధాన్యతలో గుర్తించాలని, అక్కడికక్కడే సమాచార శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినందుకు సీఎంకు రహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎన్జీ సిలిండర్‌లో గంజాయి తరలింపు

- దేశంలోనే తొలిసారిగా ఈ తరహా దందా
- నిందితుల అరెస్ట్





కుత్బుల్లాపూర్: వాహన తనిఖీల్లో భాగంగా సీఎన్జీ సిలిండర్లలో గంజాయిని తరలిస్తూ మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్(ఎస్ఓటీ) టీంకు ఓ ముఠా సభ్యులు అడ్డంగా దొరికిపోయారు. సుమారు రూ.40లక్షల విలువ చేసే 65 కిలోల గంజాయితో పాటు రెండు కార్లను, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో మేడ్చల్ డీసీపీ నికిత పంత్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అంతర్రాష్ట్ర ముఠాగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అరవింద్ చౌదరి(28), అభిషేక్(36), ఆశిష్(25), ఆకాష్ సోలంకి(25)లు గత కొంతకాలంగా వివిధ ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో మేడ్చల్ సమీపంలో గురువారం రాత్రి 8.30గంటల సమయంలో కారులో సీఎన్జీ సిలిండర్‌తో వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేసి సదరు డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో తమదైన శైలిలో ఎస్ఓటి బృందం విచారణ చేపట్టడంతో సిలిండర్‌లో ఉన్న గంజాయి బయటపడింది.దేశంలోనే ఇలా సిలిండర్‌లో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డ కేసు ఇదేనని తెలిపారు. అటు కార్మికులకు ఇటు విద్యార్థులకు గంజాయి ఇతర మత్తు పదార్థాలు అందజేస్తున్నట్లు తెలిస్తే 100కు లేదా సైబరాబాద్ వాట్సాప్ నెం.9490617444, 7901105423కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు.

రెండేళ్ల క్రితమే కత్తులు కొని..

- పక్కా పథకం ప్రకారమే హత్య
- రియల్టర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్



ప్రధాన నిందితుడు మణికంఠ

బంజారాహిల్స్: రెండేళ్లుగా పగ పెంచుకున్న ప్రత్యర్థులు అదును కోసం వేచి చూశారు.. కత్తులు సైతం సిద్ధంగా ఉంచుకుని పక్కా పథకం ప్రకారం సహచరులతో కలిసి దారుణంగా హత్య చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రియల్టర్ పుట్టా రాము (36) హత్యకు సంబంధించి శుక్రవారం జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో కలిసి వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం, సింగోటం గ్రామానికి చెందిన పుట్టా రాము (36) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. అతను తరచూ జీడిమెట్ల రామిరెడ్డినగర్‌కు చెందిన ఇందువుల మణికంఠ అలియాస్ మణి (30) అనే డ్రైవర్‌తో కలిసి మూడు ముక్కలాట ఆడేవాడు. జూదంలో రాము బాగానే సంపాదించాడు. దీంతో మణికంఠ రాముపై ఈర్ష్య పెంచుకున్నాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య రెండేళ్ల క్రితం గొడవ జరగడంతో రాము మణికంఠను తీవ్రంగా కొట్టడమే కాకుండా అతడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనపై దాడి చేసిన రామును ఎలాగైనా అంతం చేయాలని నిర్ణయించుకున్న మణికంఠ కత్తులు కొనుగోలు చేసి దాచి పెట్టి అదును కోసం వేచి చూడసాగాడు. ఈ నేపథ్యంలో యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో వ్యభిచార గృహం నిర్వహించే పఠాన్ నసీమా(19), ఆమె తల్లి హిమామ్‌బీ అలియాస్ అసీనా(35)తో కలిసి పథకం పన్నాడు. నసీమా బుధవారం రాత్రి రామును తమ ఇంటికి ఆహ్వానించింది. ఈ విషయాన్ని మణికంఠకు మెసేజ్ చేసింది. దీంతో మణికంఠ తన స్నేహితులు దారావత్ వినోద్‌కుమార్, మహ్మద్ కైసర్, కావలి శివకుమార్, కప్పల నిఖిల్, తున్నాకుమార్‌తో పాటు మరో ఐదుగురితో కలిసి అక్కడికి వచ్చాడు. గదిలో ఉన్న రామును తల్లీకూతుళ్ల ముందే కత్తులతో దారుణంగా పొడిచి హత్య చేశారు. ప్రధాన నిందితుడు మణికంఠతో పాటు వినోద్‌కుమార్, కైసర్, శివకుమార్, నిఖిల్, తున్నాకుమార్, నసీమా, హిమామ్‌బీలను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఐదుగురి కోసం గాలింపు చేపట్టారు. మణికంఠపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి ఐదు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీల్లో జీహెచ్ఎంసీ అధికారుల పర్యటన

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం


జీజేఆర్‌నగర్‌లో పర్యటిస్తున్న డీసీ జగన్

బంజారాహిల్స్: గుర్తింపు పొందిన మురికివాడలు, బస్తీల్లో సమస్యలు తెలుసుకుని, వాటి సత్వర పరిష్కార నిమిత్తమై జీహెచ్ఎంసీ అధికారులు రెండో రోజైన శుక్రవారం కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఉప కమిషనర్ జగన్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తుమ్మలబస్తీ, బీజేఆర్‌నగర్ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా వీధి దీపాలు వెలగడం లేదని, రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలనే అంశాలపై ఫిర్యాదులు అందాయి. కొన్నిచోట్ల డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుందని ఫిర్యాదు చేయగా అప్పటికప్పుడు జగన్ జలమండలి అధికారులతో మాట్లాడారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ఉచిత విద్యుత్‌పై సర్వే ముమ్మరం


వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి పథకంలో పేర్కొన్న 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారుల అర్హుల ఎంపిక ప్రక్రియ ముమ్మరం కొనసాగుతోంది. బంజారాహిల్స్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏడీఈ హైమానంద ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని సింగాడికుంట బస్తీలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగించే బిల్లింగ్‌ను నమోదు చేసుకున్నారు. దీంతో పాటు ఆధార్ కార్డు నెంబర్, రేషన్ కార్డు నెంబర్, మొబైల్ ఫోన్ నెంబర్‌ను కూడా దరఖాస్తులో భర్తీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తు నెంబర్లను కూడా ఇందులో చేర్చారు. ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని హైమానంద తెలిపారు. ఇంకా కొన్ని రోజులు సిబ్బంది బస్తీల్లో పర్యటిస్తారని, ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తారన్నారు. తమ ఇంటికి వచ్చే బిల్లింగ్ లైన్‌మెన్లకు వినియోగదారులు సహకరించి వారు అడిగిన పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

వెంగళరావునగర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలనా కార్యక్రమం శుక్రవారం యూసుఫ్‌గూడలో ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యుత్ 200 యూనిట్లు ఉచిత స్కీంకు (గృహజ్యోతి పథకం) సంబంధించిన దరఖాస్తుల పరిశీలన జరిగింది. దరఖాస్తుదారుల నుంచి తెల్లరేషన్ కార్డులను విద్యుత్ శాఖ అధికారులు స్వీకరించారు. అనంతరం పరిశీలించి తెల్ల రేషన్ కార్డులో సమగ్రంగా పేర్లు, అడ్రస్‌లు ఉన్న వారిని అర్హులుగా చేర్చారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ... ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరూ తమ తెల్లరేషన్ కార్డులు, ఆధార్ కార్డులను పరిశీలనా కేంద్రానికి తీసుకుని రావాలని సూచించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ నరేందర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్, విద్యుత్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ తాత్కాలిక ఉద్యోగిని ఆత్మహత్య


నీరుడు యాదమ్మ (ఫైల్)

బంజారాహిల్స్: ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని జీహెచ్ఎంసీ తాత్కాలిక ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటగిరి ప్రాంతంలో నివాసం ఉండే నీరుడు యాదమ్మ (58) జీహెచ్ఎంసీలో తాత్కాలిక ఉద్యోగినిగా పనిచేస్తుంది. ఆమె భర్త పదేళ్ల క్రితమే చనిపోయాడు. గత ఏడాది కుమారుడు నరేందర్ కూడా మృత్యువాతపడ్డాడు. ఇంకో కుమారుడు హోటల్‌లో పనిచేస్తుంటాడు. అయితే భర్త, ఒక కుమారుడు చనిపోయిన దగ్గర నుంచి మానసికంగా కుంగిపోయింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఒంటరి జీవితాన్ని భరించలేక తీవ్ర మనస్తాపంతో యాదమ్మ శుక్రవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ కన్వీనర్ వెంకటేశం

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. భారత్ బంద్‌లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రవాణారంగ కార్మికులు ట్రాన్స్‌పోర్ట్ బంద్ పాటించి విజయవంతం చేయాలని కోరారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ట్రానోస్పర్ట్ జేఏసీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో బంద్ పోస్టర్‌ను జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ), బీఆర్‌టీయూ నేత వి.మారయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ... బీఎన్ఎస్ కంటే ఐపీసీలో శిక్షలు న్యాయమైనవని స్పష్టమైందని, ఈ నిబంధనలు అమలైతే, డ్రైవర్లు రోడ్లపై కాకుండా జైళ్లలో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. లారీ యజమానులు సంఘం నేత రాజేందర్ రెడ్డి, జేఏసీ నేతలు షేక్ సలావుద్దీన్, నగేష్, తిరుమలేశాగౌడ్, ప్రేమ్ చందర్ రెడ్డి, సిహెచ్. జంగయ్య, లతీఫ్, నిరంజన్ పాల్గొన్నారు.

రోజూ రెండు గంటలు శ్రమించాల్సిందే: సీవీ ఆనంద్


టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏసీబీ డీజీ సీవీ ఆనంద్

బంజారాహిల్స్: ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలనుకునే వారు రోజూ కనీసం రెండు గంటల పాటు ఏదో ఒక క్రీడలో శ్రమించాల్సిందేనని, చెమటోడ్చాల్సిందేనని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో 16వ హైదరాబాద్ ఓపెన్ సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల క్రీడాకారులతో కలిసి ఆయన టెన్నిస్ ఆడారు. మాదాపూర్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 11 వ తేదీ వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో 408 మంది క్రీడాకారులు 30, 40, 50, 60, 70 సంవత్సరాల విభాగాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కిలారు రాజేశ్వర్‌రావు, ట్రెజరర్ రమేష్ చౌదరి, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటైన్స్ డేను అడ్డుకుంటాం: బజరంగ్‌దళ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్‌దళ్ నేతలు

హిమాయత్‌నగర్: ఫిబ్రవరి 14వ తేదీ వలంటైన్స్ డేను అడ్డుకుంటామని బజరంగ్‌దళ్ హెచ్చరించింది. దేశం కోసం.. ధర్మం కోసం ప్రతి ఒక్కరూ జాతీయ భావాలను అలవర్చుకోవాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్ కోరారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పండరినాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు, వీహెచ్‌పి ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామిలతో కలిసి 'బ్యాన్ వాలెంటైన్స్ డే, వీర జవాన్ల దివాస్' పేరుతో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రేమ ముసుగులో సాగే తంతును అడ్డుకొని తీరుతామన్నారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఘటన ఆధారంగా ఆ రోజు వీరమరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతి కలిగేలా ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. ×ఫిబ్రవరి 14 అనేది ప్రేమికుల రోజు కాదని.. అమరవీరుల సంస్కరణ దినస్గా జరపాలని బజరంగ్‌దళ్ నేతలు స్పష్టం చేశారు. బజరంగ్ దళ్ రాష్ట్ర సహ సంయోజక్ వెంకట్, విశ్వహిందూ పరిషత్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ధీరజ్, గ్రేటర్ హైదరాబాద్ బజరంగ్ దళ్ నాయకులు అఖిల్, రాహుల్, చైతన్య, సుమంత్, అభిషేక్, గణేష్, రాకేష్, పవన్, నందకిషోర్, మహేష్, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న దుర్గా భవానీనగర్ బస్తీలో దారిని ఆక్రమించి నిర్మాణం చేస్తున్న వ్యక్తులపై స్థానికులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు శుక్రవారం బస్తీలో పర్యటించారు. విచారణ చేస్తామని విచారణ పూర్తయ్యేంత వరకు ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని అధికారులు వారికి సూచించారు. అదే విధంగా 64 గజాల్లో స్థలం ఉండగా ఇక్కడ 100 గజాలపైగా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని మండల అధికారులకు కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు.

2,96,383 @ ఖైరతాబాద్ ఓటర్లు

- కొత్త ఓటర్లు 3209 మంది
- జాబితా విడుదల చేసిన ఎన్నికల అధికారులు


ఓటరు జాబితాను చూపిస్తున్న బీఎల్ఓ

బంజారాహిల్స్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 (ఎస్ఎస్ఆర్–2024)లో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారులు ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,96,383 మంది ఉన్నారు.

- ఇందులో పురుషులు 1,53,833, మహిళలు 1,42,516, థర్డ్ జెండర్ 34 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం కొత్తగా ఓటరుగా నమోదైన వారు 3209 మంది ఉన్నారు.
- కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపులో భాగంగా మృతి చెందిన వారి ఓటర్లు 1815 మందిని జాబితా నుంచి తొలగించారు.
- ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో పోలింగ్ స్టేషన్‌కు 629 మందిని మార్చారు. ఓటరు జాబితా నుంచి శాశ్వతంగా ఇతర నియోజకవర్గాలకు 1117 మంది షిఫ్టు అయ్యారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జనవరి 6న విడుదల చేసిన ముసాయిదా జాబితాతో పోలిస్తే మొత్తం 3209 మంది ఓటర్లు పెరిగారు.
- గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 2,96,014 ఉండగా, మార్పులు, చేర్పులు, సవరణల అనంతరం స్వల్పంగా తుది జాబితాలో ఓటర్లు పెరగడం జరిగింది.
- మరోవైపు ఓటరు తుది జాబితాలో ఈసారి కూడా మహిళల కంటే పురుషులే ఎక్కువ మంది ఉన్నారు.

నమోదుకు ఇంకో అవకాశం...

- ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేర్లు లేనివారు నమోదు చేసుకునేందుకు మళ్లీ అవకాశం కల్పించారు. అలాగే మార్పులు, చేర్పులు, తొలగింపు చేసుకోవచ్చు.
- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు అవకాశం ఉంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటిఫికేషన్ తర్వాత మరోసారి జాబితా ప్రకటిస్తారు.

ఏసీబీ వలలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఏజీఎం

రూ. 13 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏజీఎం మహ్మద్ మసూద్


ఏసీబీకి చిక్కిన ఏజీఎం మహ్మద్ మసూద్‌అలీ

హిమాయత్‌నగర్: తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (టెక్నికల్), చీఫ్ ఇంజినీర్ మహ్మద్ మసూద్ అలీ ఏసీబీ వలలో చిక్కాడు. బోనాల బాబురావు అనే సివిల్ కాంట్రాక్టర్ నుంచి కాంట్రాక్ట్ పనుల బిల్లులను ప్రాసెస్ చేసేందుకు రూ. 13 వేలను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హిమాయత్‌నగర్ ఉర్దూ గల్లీలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బాధితుడి ఫిర్యాదు మేరకు ఏజీఎం మహ్మద్ మసూద్ అలీ లంచం డబ్బును తీసుకున్న వెంటనే అధికారులు ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డ్రాయింగ్ సెక్షన్‌కు చెందిన పనుల బకాయి మొత్తం రూ. 16 లక్షల కాగా, అదనపు సెక్యూరిటీ డిపాజిట్ మొత్తం రూ. 1,19,500లను రీఫండ్ చేయడానికి లంచాన్ని డిమాండ్ చేసినట్లు బాధితుడు తెలిపినట్లు ఏసీబీ అధికారులు ప్రకటనలో తెలిపారు. మహ్మద్ మసూద్‌ను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు వారు వెల్లడించారు.

సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి అశ్విని

బంజారాహిల్స్: నటీ, బిగ్‌బాస్–7 కంటెస్టెంట్ అశ్విని తాజ్‌కృష్ణాలో సందడి చేశారు. ఇక్కడ రెండు రోజుల పాటు జరిగే సూత్ర ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి డిజైనర్లు హాజరై తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌లో దుస్తులు, ఆభరణాలు, ఉపకరణాలు, సౌందర్య సాధనాలు, గృహాలంకరణ ఉత్పత్తులు వంటి వాటిని అందుబాటులో ఉంచారు. ముంబాయి, ఢిల్లీ, కోల్‌కత్తా, జైపూర్, పూణే, ఇండోర్, రాయ్‌పూర్, పాట్నా, కొల్హాపూర్, బెంగుళూరు, కోయంబత్తూర్, మంగళూరు తదితర నగరాల నుంచి తీసుకువచ్చిన ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయి. స్వయంవర్, అన్మోల్ జ్యూవెలరీ, శ్రీకలెక్షన్, సంప్రదాయ టెంప్టేషన్, గీతాంజలి పాదరక్షలు, తక్ ప్రింట్లు, కాన్వి హ్యాండ్లూమ్స్, ఓం కలెక్షన్స్ వంటి ఉత్పత్తులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకునేలా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం కూడా ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

కొత్త రేషన్ కార్డులిచ్చిన తర్వాత గ్యారంటీలు ఇవ్వాలి


వెరిఫికేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను బీఆర్ఎస్ నగర నాయకుడు జి.రామన్ గౌడ్ శుక్రవారం హిమాయత్‌నగర్‌లో పర్యవేక్షించారు. ఈ పథకంపై ప్రజలకు సరైన అవగాహన లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్ ముత్యాలబాగ్, సంజయ్ గాంధీ నగర్, దోమల్‌గూడ తదితర ప్రాంతాల ప్రజలు వెరిఫికేషన్ కేంద్రానికి వచ్చి తమ వివరాలను తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తరేషన్ కార్డులు ఇచ్చిన అనంతరమే ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తే బాగుండేదని అన్నారు. రేషన్ కార్డు లేని వారితో పాటు ఈ పథకానికి సంబంధించిన లోపాలను ప్రభుత్వం గుర్తించి పేదలందరికీ ఈ పథకం అందించేలా చర్యలు తీసుకోవాలని రామన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

వెంకయ్యనాయుడికి సన్మానం


వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న ఆదినారాయణ తదితరులు

లిబర్టీ: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణతో కూడిన ప్రతినిధి బృందం ఘనంగా సత్కరించింది. మచ్చలేని నాయకుడిగా పేరుపొందిన వెంకయ్యనాయుడుకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ఇవ్వాలని ఎంపిక చేయడానికి స్వాగతిస్తూ శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధి బృందం శాలువతో పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. శాసన సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ప్రజా సంక్షేమం దేశ ప్రగతి కోసం వెంకయ్యనాయుడు కృషి చేశారని ఆదినారాయణ అన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఉప రాష్ట్రపతిగా సమర్థవంతంగా దేశానికి సేవలు అందించారని ఆయన కొనియాడారు. నాటి తరానికి నేటి తరానికి వెంకయ్యనాయుడు ఆదర్శ రాజకీయ నాయకుడని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత ధర్నాను అడ్డుకుంటాం

- స్వార్థ రాజకీయాల కోసమే పూలే విగ్రహ నాటకం
- తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య

హిమాయత్‌నగర్: తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వం పూలే విగ్రహ సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ఈ నెల 12న ధర్నా చౌక్‌లో కవిత తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి అనుమతి ఇవ్వొద్దని, ప్రభుత్వం అనుమతి ఇస్తే వేలాది మంది ఉద్యమకారులతో చలో ధర్నా చౌక్‌కు పిలుపునిచ్చి, కవిత ధర్నాను అడ్డుకుంటామని సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ హెచ్చరించారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ చైర్మన్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని పూలే విగ్రహం కవితకు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత బీసీ నినాదంతో కవిత కొత్త నాటకానికి తెర తీసిందని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్‌ను ఎత్తివేసి కుట్రలు చేసిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని, ఇప్పుడు అదే ధర్నా చౌక్‌లో జ్యోతిరావు పూలే విగ్రహం కోసం కవిత ధర్నా చేపట్టడం ఆమె అవకాశవాద రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. ధర్నా చౌక్‌ను ఎత్తివేసినందుకు బీఆర్ఎస్ పార్టీ తరుపున తెలంగాణ సమాజానికి కవిత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న వంధ్యత్వ కేసులు

జీనోమ్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ కేపీసీ గాంధీ


మాట్లాడుతున్న డాక్టర్ గాంధీ

బంజారాహిల్స్: స్త్రీ, పురుషులలో పెరుగుతున్న వంధ్యత్వ సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయని జీనోమ్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ కేపీసీ గాంధీ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జీనోమ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. లైంగికంగా పరిణితి చెందినా పలు కారణాల వల్ల పునరుత్పత్తి సమస్యల అధికమవుతున్నాయని ఆయన అన్నారు. జీనోమ్ ఫౌండేషన్ అటువంటి వ్యక్తుల నుంచి ఆస్పత్రుల ద్వారా జన్యు పరీక్షల కోసం అభ్యర్థనలను స్వీకరిస్తుందని అన్నారు. తమ ఇంటిగ్రేటెడ్ విధానం ద్వారా 80 నుంచి 90 శాతం విజయవంతం అవుతున్నామన్నారు. జీవనశైలిలో వేగవంతమైన పరివర్తన పురుషుల పునరుత్పత్తి ఆరోగ్యంపై వినాశకరమైన ప్రభావానికి దారితీస్తుందని అన్నారు. నివేదికల ప్రకారం... మూడు దశాబ్దాల క్రితం 60 మిలియన్/మిలీ ఉండే సాధారణ భారతీయ వయోజన పురుషుడి స్పెర్మ్ కౌంట్ ఇప్పుడు దాదాపు 20 మిలియన్/మిలీకి చేరుకుందన్నారు. ప్రతి సంవత్సరం మగ స్పెర్మ్ నాణ్యతలో 2 శాతం తగ్గుదల ఉందని అన్నారు. డాక్టర్ కనకభూషణం, రీసెర్చ్ డైరెక్టర్, డాక్టర్ కె.పి.సి.గాంధీ, జీనోమ్ ఫౌండేషన్, డాక్టర్ సుమ, ప్రసాద్ హాస్పిటల్స్, ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సంధ్య, ఒయాసిస్ ఇన్ఫెర్టిలిటీ సెంటర్ ఎండీ డాక్టర్ కృష్ణ చైతన్య, కిమ్స్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ వసుంధర, జెనోమ్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎస్.కనకభూషణం పాల్గొన్నారు.

వేద పండితులకు సన్మానం

లిబర్టీ: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని భారతీయ ధార్మిక సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ అన్నారు. భారతీయ ధార్మిక సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరమత సహనాన్ని ప్రజలు పాటించాలని సూచించారు. ప్రజలు భక్తి మార్గంలో పయనిస్తే ముక్తి లభిస్తుందన్నారు.

అమ్మవారి భక్తుడి నిరాహార దీక్ష


నిరాహార దీక్ష చేపట్టిన గడ్డం శ్రీధర్

రహమత్‌నగర్: ఆలయ నిర్మాణ పనుల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ అమ్మవారి భక్తుడు వినూత్న నిరసనకు దిగాడు. ఆలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టాడు. వివరాలివీ... రహమత్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణ పనులను బస్తీవాసులకు కనీస సమాచారం ఇవ్వకుండా చేపడున్నారని గతంలో పలుమార్లు శ్రీధర్ ఆరోపించాడు. నిర్వాహకులు పట్టించుకోక పోవడంతో శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... కొంత మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు. శ్రీధర్ దీక్షకు స్థానికులు మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాను గడ్డం, తల వెంట్రుకలు తీయనని అమ్మవారి ఆలయంలో శపథం చేసి గత ఐదు నెలలుగా శ్రీధర్ అలాగే ఉంటున్నాడు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

బంజారాహిల్స్: పెండింగ్ జీతాలను చెల్లించాలని విద్యా వలంటీర్లు విద్యాశాఖ సంచాలకులు దేవసేనకు శుక్రవారం తెలంగాణ విద్యా వలంటీర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన తాము ఐదేళ్లుగా విద్యావలంటీర్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నామని, అయితే 2019–20వ విద్యా సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు ఇంతవరకు చెల్లించలేదని వాపోయారు. మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన తాము 450 కిలోమీటర్లు ప్రయాణం చేసి పదుల సంఖ్యలో వలంటీర్లు గతంలో ఇక్కడకు వచ్చి విన్నవించుకున్నామని, కానీ తమ జీతాలు మాత్రం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్తను శుభ్రం చేయకుంటే సహించం

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: కాలనీలు, బస్తీల్లో ఉత్పన్నం అవుతున్న చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ కార్మికులపై ఉందని, ఏ మాత్రం అలక్ష్యం ప్రదర్శించినా ప్రజలు ఇబ్బందులు పడతారని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య కార్మికులు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని పలు ప్రాంతాల ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమెకు వెంగళరావునగర్ కాలనీ, సిద్ధార్థ నగర్‌కాలనీ, కళ్యాణ్‌నగర్‌కాలనీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం రోడ్ల పక్కనే ఉండటం కనిపించింది. దాంతో ఆగ్రహించిన కార్పొరేటర్ అప్పటికప్పుడు జీహెచ్ఎంసీ కార్మికులను, ఎస్ఎఫ్ఏలను పిలిపించి చెత్తను శుభ్రం చేయించారు. జవహర్‌నగర్ వైన్‌షాపు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత షాపు నిర్వాహకులదేనని, ఈ చుట్టుపక్కల ఇష్టానుసారంగా వ్యర్థాలు వేస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలతోపాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజ్, బాలు రజక, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


డాక్యుమెంట్లను స్వీకరిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: అర్హులైన ప్రతి ఒక్కరూ గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రామకృష్ణానగర్ కమ్యునిటీహాల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ నెంబర్ అన్ని వివరాలు సేకరించారు. అతి త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సోమాజిగూడ విద్యుత్ అధికారి సాయిరెడ్డి, నాయకులు మురళి, ఫయాజ్, శ్యామ్ కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు అవార్డుతో సత్కారం


అవార్డు అందుకుంటున్న కుర్రా సూర్యనారాయణ

శ్రీనగర్‌కాలనీ: ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ తెలంగాణ స్టేట్ చైర్మన్ కుర్రా సూర్యనారాయణకు హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. త్యాగరాజగన సభలో శుక్రవారం మానవహక్కుల పరిరక్షణతో పాటు పలు సేవాకార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించిన కుర్రా సూర్యనారాయణకు గ్రాడ్యుయేషన్ అండ్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో భాగంగా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును హోమ్ థియోలాజికల్ అందించిందని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. తనకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని, మరిన్ని సేవాకార్యక్రమాలను చేపడతానని సూర్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



ఫిలింనగర్: విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని క్రమశిక్షణతో ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కళ్యాణ్ అన్నారు. శుక్రవారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఎగ్జామ్ స్టేషనరీ వస్తువులను ఉచితంగా అందజేశారు.

శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఆదిరెడ్డిని శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతల సహకారం తప్పనిసరిగా ఉండాలని ఈ సందర్భంగా ఆదిరెడ్డి కోరారు. నాయకులు దూడల రవిగౌడ్, మోసిన్ ఖురేషి, ఆకాష్, గణేష్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాబా నివాసం వద్ద సంబురాలు

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో చేరిన జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబాఫసీయుద్దీన్ నివాసం వద్ద గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డితో కలిసి అక్కడి చేరుకున్న బాబా ఫసీయుద్దీన్ స్థానిక చిల్లాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తన కార్యాలయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనపై సొంత పార్టీ నాయకులే కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు. పార్టీలో ఉద్యమకారులకు స్థానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు అబ్బు, అశోక్, కృష్ణవేణి, రఫీ, మహేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



విదేశాలకు చెల్లింపులు చేయలేక దివాలా అంచుల్లో ఉన్న దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో గట్టెక్కించిన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావును భారతరత్న వరించింది. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగానే కాదు.. దేశానికి గాంధీ, నెహ్రూ కుటుంబేతర వ్యక్తుల్లో పూర్తికాలం పనిచేసిన తొలి ప్రధానిగా, మైనార్టీ ప్రభుత్వాన్ని విజయవంతంగా ఐదేళ్లు కొనసాగించిన రాజకీయ చాణక్యుడిగా పీవీ పేరు పొందారు. దక్షిణ భారత దేశం నుంచి ప్రధాని అయిన తొలి వ్యక్తి కూడా పీవీనే కావడం గమనార్హం. ఆయన రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా తాను పని చేసిన అన్ని పదవులకు వన్నె తెచ్చారు.

- సాక్షి, హైదరాబాద్

గడ్డు పరిస్థితిలో బాధ్యతలు చేపట్టి..

పీవీ భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే నాటికి దేశం గడ్డు పరిస్థితుల్లో ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు బిలియన్ డాలర్ల కంటే తగ్గిపోయాయి. విదేశాలకు చెల్లించాల్సిన అప్పులు, దిగుమతుల కోసం చేయాల్సిన చెల్లింపులు పేరుకుపోయాయి. ద్రవ్యోల్బణం గరిష్టంగా రెండంకెలకు చేరింది. ఏతావాతా దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉన్న సమయంలో.. దేశాన్ని ముందుకు నడిపించేందుకు పీవీ సిద్ధమయ్యారు. వెంటనే దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేపని మొదలుపెట్టారు. అప్పట్లో రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఉన్న ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్‌ను పిలిపించి నేరుగా కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మన్మోహన్‌తోపాటు ఇతర ఆర్థికవేత్తలతో చర్చించి సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. ఎగుమతులు పెరిగి విదేశీ మారక ద్రవ్యం సమకూరేందుకు వీలుగా రూపాయి విలువను తగ్గించారు. తాను ప్రధాని బాధ్యతలు స్వీకరించిన నెలలోనే రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న బంగారం నిల్వలను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తాకట్టు పెట్టి 400 మిలియన్ డాలర్ల రుణం తెచ్చారు. కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచారు. లైసెన్సుల విధానాన్ని సరళీకృతం చేశారు. అన్ని రంగాల్లో ప్రభుత్వ సంస్థల గుత్తాధిపత్యాన్ని తగ్గిస్తూ.. ప్రైవేటు సంస్థల స్థాపనకు అవకాశం కల్పించారు.

ఎన్ని విమర్శలు వచ్చినా..

1991 జూలై 24న ప్రవేశపెట్టిన దేశ బడ్జెట్‌లో అనేక సంస్కరణలను ప్రకటించారు. కార్పొరేట్ పన్ను పెంపు, టీడీఎస్ విధానం అమల్లోకి తేవడం, వంట గ్యాస్, కిరోసిన్, పెట్రోల్, ఎరువుల ధరలు పెంపు, చక్కెరపై సబ్సిడీ తొలగింపు, దిగుమతుల పన్ను తొలగింపు వంటి విధానాలను అమల్లోకి తెచ్చారు. ఈ చర్యలతో పీవీ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)కు దేశాన్ని అమ్మేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. అయినా మొక్కవోని ధైర్యంతో పార్టీలో, ప్రభుత్వంలో అసమ్మతివాదులను ఒప్పిస్తూ సంస్కరణలను కొనసాగించారు. ఎగుమతుల కోసం ప్రత్యేక వాణిజ్య విధానాన్ని తేవడంతోపాటు చిన్న సంస్థలకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ చర్యలన్నింటి ఫలితంగా రెండున్నరేళ్లలో ద్రవ్యోల్బణం 17 శాతం నుంచి 8.5 శాతానికి తగ్గింది. బిలియన్ డాలర్లలోపే ఉన్న విదేశీ మారకద్రవ్య నిల్వలు 15 బిలియన్ డాలర్లకు చేరాయి. ద్రవ్య లోటు 8.4 నుంచి 5.7 శాతానికి తగ్గింది. ఎగుమతులు రెండింతలయ్యాయి. వృద్ధి రేటు 4 శాతానికి పెరిగింది. అక్కడి నుంచి ఇక భారత్ వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి తలెత్తలేదు. ఇప్పుడు ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదో స్థానానికి చేరింది. దీనంతటికీ నాడు పీవీ వేసిన ఆర్థిక సంస్కరణలే పునాది.

'ఆర్థిక' భారతానికి ఊపిరి పీవీ

ఆర్థిక సంస్కరణల శకాన్ని ప్రారంభించిన పీవీ నరసింహారావు

ఉస్మానియాలో విద్యాభ్యాసం.. కలం పేరుతో వ్యాసాలు..

అపర మేధావి, బహుభాషా కోవిదుడుగా పేరు పొందిన పీవీ నరసింహారావు.. 1921 జూన్ 28న నాటి హైదరాబాద్ సంస్థానంలోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లికి చెందిన నియోగి బ్రాహ్మణ దంపతులు సీతారామారావు, రుక్మాబాయిలకు జన్మించారు. మూడేళ్ల వయసులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణి దంపతులు ఆయన్ను దత్తత తీసుకున్నారు. భీమదేవరపల్లి మండలం కట్కూరులోని బంధువు గబ్బెట రాధాకిషన్‌రావు ఇంట్లో ఉంటూ పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివారు. 1938 సమయంలో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. నిజాం నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడారు. దీంతో ఆయనను ఉస్మానియా వర్సిటీ నుంచి బహిష్కరించగా.. ఓ మిత్రుడి సాయంతో నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో చేరి న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నారు. కొంతకాలం జర్నలిస్టుగానూ పనిచేశారు. తన సోదరుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి 'జయ-విజయ' అనే కలం పేరుతో కాకతీయ వారపత్రికకు వ్యాసాలు రాశారు.

ఎమ్మెల్యే నుంచి ప్రధాని వరకు..

కాలేజీలో రోజుల నుంచే పీవీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా చేరారు. 1957-77 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి మంథని నుంచి ప్రాతినిధ్యం వహించారు. అందులో 1962-71 మధ్య వివిధ శాఖల మంత్రిగా పనిచేశారు. 1971లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

- సీఎంగా పలు భూసంస్కరణలను ప్రవేశపెట్టారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయించారు. గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేశారు.
- 1969లో కాంగ్రెస్ పార్టీ చీలిన సమయంలో ఇందిరాగాంధీ వెన్నంటి నిలిచారు. 1978లో ఇందిరాగాంధీ స్థాపించిన కాంగ్రెస్ (ఐ)లో చేరారు.
- 1977లో తొలిసారిగా హన్మకొండ ఎంపీగా గెలిచిన ఆయన.. 1984, 1989, 1991, 1996లలో జరిగిన ఎన్నికల్లో మహారాష్ట్రలోని రాంటెక్, కర్నూల్ జిల్లా నంద్యాల, ఒడిశాలోని బరంపురం లోక్‌సభ స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. కేంద్రంలో హోం, రక్షణ, విదేశాంగ శాఖల మంత్రిగా పనిచేశారు.
- 1991లో రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ తీసుకోవాలని పీవీ భావించారు. ఆ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీ చేయలేదు కూడా. కానీ రాజీవ్‌గాంధీ హత్యతో పీవీ క్రియాశీలకంగా వ్యవహరించాల్సి వచ్చింది.
- రక్షణ మంత్రిగా పనిచేసిన అనుభవంతో పార్టీలోని ఇతర పోటీదారులను వెనక్కినెట్టి మైనార్టీలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపించే అవకాశం దక్కించుకున్నారు. 1991 జూన్ 21న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి ఎంపీ కాకపోవడంతో.. నంద్యాల లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అప్పుడు ఏకంగా ఐదు లక్షల ఓట్ల భారీ మెజార్టీ సాధించి గిన్నిస్ రికార్డుల్లో ఎక్కారు.
- 1995 మే 16 వరకు మైనార్టీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపి రాజకీయ దురంధరుడిగా నిలిచారు.
- ఆర్థిక రంగమైనా, రాజకీయ రంగమైనా, అభివృద్ధి పథమైనా, సంక్షేమ బాటలోనైనా.. తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చిన పీవీ 83 ఏళ్ల వయసులో.. 2004 డిసెంబర్ 23న ఢిల్లీలో కన్నుమూశారు. తర్వాత 19 ఏళ్ల అనంతరం ఆయనకు కేంద్రం భారతరత్న ప్రకటించింది.

బేగంపేట.. బ్రాహ్మణవాడి అడ్డాగా..

పీవీ నరసింహారావు హైదరాబాద్‌లో ఉన్నంతకాలం బేగంపేటలోని బ్రాహ్మణవాడి కేంద్రంగానే కార్యకలాపాలను నిర్వహించారు. తొలుత స్వామి రామానంద తీర్థ ఇక్కడ నివాసం ఏర్పర్చుకోగా.. ఆయన అనుచరుడిగా పీవీ ఎక్కువ సమయం ఇక్కడే గడిపేవారు. 1973లో రామానంద తీర్థ పరమపదించగా.. పీవీ అక్కడ స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంస్థను నెలకొల్పారు. ఆ సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవి ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె ఈ కమిటీ భవనంలో పీవీ స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పీవీ రాసిన, సేకరించిన వేలాది పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి.

60 ఏళ్ల వయసులో కంప్యూటర్‌తో కుస్తీ పట్టి..



ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడంలో పీవీ ఎప్పుడూ ముందుండే వారు. ఆయన అసాధారణ ప్రతిభతో త్వరగానే పట్టు సాధించేవారు. అలా ఏకంగా దేశ, విదేశ భాషలు సహా 13 భాషలను నేర్చుకున్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో మన దేశంలోకి కంప్యూటర్లను ప్రవేశపెట్టినప్పుడు.. పీవీ ఓ కంప్యూటర్ తెప్పించుకుని పట్టుపట్టాడు. 60 ఏళ్ల వయసులో కూడా రోజూ గంటల పాటు కూర్చుని టైపింగ్ మాత్రమేకాదు.. కంప్యూటర్ లాంగ్వేజ్‌నూ నేర్చుకున్నారు.

పీవీ ఇంట్లోనే పనిజేసిన.. ప్యాంట్లు వేసుకుని సిగ్గుపడ్డం



నా చిన్నప్పుడు పీవీ ఇంట్ల, వారి పొలాల్లో పని చేసిన. ఊర్లో అందరం ఆయన ఇంటిని గడి అని పిలిచేటోళ్లం. పీవీ ఇంటివాళ్లు అందరితో కలివిడిగా ఉండేవారు. మాది చిన్న పల్లెటూరు. ధోవతులు తప్ప ప్యాంట్లు తెలియవు. ఎవరన్నా ప్యాంట్ వేసుకుంటే వింతగా జూసేది. ఏ ఊరి దొరనో అని గొప్పగా అనుకునే వాళ్లం. ఒకనాడు ఇంటికి వచ్చిన పీవీ దొరను.. మీరెందుకు ప్యాంట్లు వేసుకోరని అడిగిన. ఆయన చిన్నగా నవ్విండు. తర్వాత మా ఊళ్లనే బావులకాడ పనిచేసే పది మందికి ప్యాంట్లు కుట్టిచ్చిండు. వాళ్లు బజార్ల తిరగాలంటే ఒకటే సిగ్గుపడుడు. గుర్తొస్తే నవ్వొస్తది. పీవీకి భారతరత్న వచ్చిందంటే.. మా ఊరికి కాదు దేశానికి గౌరవం ఇచ్చినట్టే..

- కాల్వ రాజయ్య, వంగర గ్రామస్తుడు

వంగరలో సంబురాలు

సాక్షి ప్రతినిధి, వరంగల్/మంథని: పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంతో.. ఆయన స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో.. కుటుంబసభ్యులు, గ్రామస్తులు సంబురాలు జరుపుకొన్నారు. పీవీ ఇంటి ఆవరణలో టపాసులు కాల్చారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పీవీ సేవలను ఆలస్యంగానైనా గుర్తించి భారతరత్న ఇచ్చినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. అందరు ప్రధానమంత్రులను గౌరవించినట్టుగానే.. పీవీకి కూడా ఢిల్లీలో ఘాట్ నిర్మించాలని కోరారు. మరోవైపు పీవీ రాజకీయ అరంగేట్రం చేసి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంథని నియోజకవర్గంలోనూ స్థానికులు సంబురాలు చేసుకున్నారు.

తెలుగు ప్రజలందరికీ గౌరవం

పీవీకి భారతరత్నపై ఏపీ సీఎం జగన్ హర్షం

సాక్షి, అమరావతి : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించటంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. 'పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు, ఉన్నత రాజకీయ, నైతిక విలువలు కలిగిన పండితుడు. ఆయనకు అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించడం తెలుగు ప్రజలందరికీ గౌరవం'అని సీఎం పేర్కొన్నారు. అలాగే, రైతుల కోసం పాటుపడిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ, బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా భారతరత్న ప్రకటించడం యావత్ జాతి గర్వించదగ్గ విషయమని శుక్రవారం రాత్రి 'ఎక్స్'లో సీఎం ట్వీట్ చేశారు.



శుక్రవారం పీవీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

పీవీకి భారతరత్న

మొదటి పేజీ తరువాయి

కీలక పాత్ర పోషించారు. రెండుసార్లు యూపీ సీఎంగా, అనంతరం కేంద్ర హోం మంత్రిగా రాణించారు. ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపారు. 1979లో స్వల్పకాలం ప్రధానిగానూ చేశారు. 1987లో తుదిశ్వాస విడిచారు. ఆయనదీ, పీవీదీ పూర్తిగా బీజేపీయేతర నేపథ్యమే కావడం గమనార్హం. వారికి భారతరత్న పురస్కారం రాజకీయంగా, సామాజికంగా ఎంతో ప్రభావం చూపగల నిర్ణయమంటున్నారు. ముఖ్యంగా రాజకీయ జీవితాన్నంతా కాంగ్రెస్‌కే ధారపోసిన పీవీకి ఆ పార్టీ సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వలేదని ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాల్లో దీని ప్రభావం గణనీయంగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతోంది. ఇక యూపీలో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిన 16 స్థానాల్లో ఆరు చరణ్‌సింగ్ మనవడైన జయంత్ సింగ్ సారథ్యంలోని ఆర్‌ఎల్‌డీ ప్రాబల్యమున్నవే. ఆయనను ఎన్డీఏలో చేర్చుకునేందుకు బీజేపీ కొంతకాలంగా గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించగానే జయంత్ ఎన్డీయేలో చేరుతున్నట్టు వెల్లడించడం విశేషం! ఇక మన్కొంబు సాంబశివన్ స్వామినాథన్ ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త. తన విశేష పరిశోధనలతో భారత్‌ను స్వయంసమృద్ధంగా తీర్చిదిద్ది కరువు మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టిన దార్శనికుడు. ఆయన 2023లో మృతి చెందారు. బిహార్ దివంగత ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌తో పాటు బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీలకు కూడా ఇటీవలే భారతరత్న ప్రకటించడం తెలిసిందే. దాంతో ఈ ఏడాది ఈ పురస్కార గ్రహీతల సంఖ్య ఐదుకు చేరింది. ఒకే ఏడాదిలో ఇంత మందికి భారతరత్న ఇవ్వడం ఇదే తొలిసారి. 1999లో అత్యధికంగా నలుగురికి ఈ గౌరవం దక్కింది. 1954 నుంచి ఇప్పటిదాకా మొత్తమ్మీద ఇప్పటిదాకా 53 మందికి భారతరత్న పురస్కారం అందజేశారు. ఈసారి ఈ అవార్డు ప్రకటించిన వారిలో అద్వానీ (96) మాత్రమే జీవించి ఉన్నారు.

సంస్కరణల రూపశిల్పి పీవీ...

మాజీ ప్రధాని పీవీని భారతరత్నతో సత్కరిస్తున్నందుకు సంతోషిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. ''ఆయన విశిష్ట పండితుడు. గొప్ప రాజనీతిజ్ఞుడు. పలు హోదాలలో దేశానికి అసమాన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, అనేక ఏళ్ల పాటు లోక్‌సభ, శాసనసభ సభ్యునిగా ఆయన చేసిన కృషి మరువలేనిది. దేశ ఆర్థికాభివృద్ధిలో దూరదృష్టితో కూడిన ఆయన నాయకత్వం అతి కీలకపాత్ర పోషించింది. దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి బలమైన పునాది వేసింది. భారత మార్కెట్లను ప్రపంచానికి తెరుస్తూ ప్రధానిగా పీవీ తెచ్చిన సంస్కరణలు చాలా కీలకమైనవి. తద్వారా ఆర్థిక రంగంలో నూతన శకానికి తెర తీశారు పీవీ. విదేశాంగ విధానాన్ని సమూలంగా మార్చేయడమే గాక భాష, విద్య తదితర రంగాలెన్నింటిపైనో చెరగని ముద్ర వేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశ సాంస్కృతిక, మేధో వారసత్వాన్ని సుసంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ''అంటూ ప్రస్తుతించారు.

మార్గదర్శకుడు స్వామినాథన్...

వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి స్వామినాథన్ చేసిన సేవలు మరవలేనివని మోదీ అన్నారు. ''క్లిష్ట సమయంలో దేశం వ్యవసాయ స్వావలంబన సాధించడంలో ఆయనది కీలక పాత్ర. దేశ వ్యవసాయాన్ని ఆధునీకరించే దిశగా అద్భుతమైన ప్రయోగాలు చేశారు. స్వామినాథన్ దార్శనికత సాగు తీరుతెన్నులనే సమూలంగా మార్చడమే గాక దేశ ఆహార భద్రతకు, శ్రేయస్సుకు బాటలు పరిచింది. నాకాయన ఎంతగానో తెలుసు. ఆయన అంతర్దృష్టిని నేనెప్పుడూ గౌరవిస్తాను. స్వామినాథన్ బాటలో యువతను, విద్యార్థులను పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నాం''అని వివరించారు.

రైతు సంక్షేమానికి అంకితం...

దివంగత ప్రధాని చరణ్‌సింగ్‌ను భారతరత్నతో సత్కరించడం తమ ప్రభుత్వ అదృష్టమని మోదీ అన్నారు. ''దేశానికి ఆయన చేసిన సాటిలేని కృషికి ఈ గౌరవం అంకితం. ఆయన జీవితమంతా రైతుల హక్కులు, సంక్షేమానికే అంకితం చేశారు. దేశ నిర్మాణంలో తనదైన ముద్ర వేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిలిచారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయన నిబద్ధత యావత్ జాతికి స్ఫూర్తిదాయకం'' అంటూ కొనియాడారు.

స్వాగతించిన పార్టీలు

పీవీ, చరణ్‌సింగ్, ఎంఎస్‌లకు భారతరత్న ప్రకటించడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయాన్ని పార్టీలకు అతీతంగా నేతలంతా స్వాగతించారు. వారు ముగ్గురూ ఎప్పటికీ భారతరత్నాలేనని కాంగ్రెస్ పేర్కొంది. కాంగ్రెస్ తరఫున ఈ నిర్ణయాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జాతి నిర్మాణానికి పీవీ చేసిన కృషి ఎనలేనిదని ప్రస్తుతించారు. ఆర్థికం, విదేశాంగం, వ్యవసాయం, అణు శక్తి మొదలుకుని లుక్ ఈస్ట్ పాలసీ దాకా ఆయన కృషిని ఒక్కొక్కటిగా ఖర్గే ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. మరోవైపు, పీవీకి భారతరత్న రావడంపై ఏమంటారని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని పార్లమెంటు బయట మీడియా ప్రత్యేకంగా ప్రశ్నించడం విశేషం. ''నేను స్వాగతిస్తున్నా. కచ్చితంగా''అంటూ ముక్తసరి స్పందనతో సరిపెట్టారామె. స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన మోదీ, ఆయన ఫార్ములా ఆధారంగా రూపొందిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంపై మాత్రం మూగనోము పట్టారంటూ కాంగ్రెస్ విమర్శించింది. ఇలాంటి నిర్ణయాల్లో బీజేపీ పార్టీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తుందని మరోసారి రుజువైందని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. వారికి ఎప్పుడో ఈ గౌరవం దక్కి ఉండాల్సిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. పీవీకి భారతరత్న ఇవ్వడాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుతించారు.

మనందరికీ గర్వకారణం

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకి భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల పలు రాజకీయపార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి భారతరత్న పురస్కారంలభించడం మనందరికీ గర్వకారణం. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రపంచ దేశాలతో పోటీపడేలా చేయడంలో పీవీ సేవలు చిరస్మరణీయం.

-సీఎం రేవంత్‌రెడ్డి

పీవీకి భారతరత్న రావడం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. బీఆర్‌ఎస్ చేసిన డిమాండ్‌ను గౌరవించి పురస్కారం ప్రకటించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

పీవీకి భారతరత్న దక్కడం తెలంగాణకు గర్వకారణం. అదేవిధంగా ఎంఎస్ స్వామినాథన్, మాజీ ప్రధాని చరణ్ సింగ్‌లకు భారతరత్న దక్కడం హర్షణీయం.

- భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి

దూరదృష్టి ఉన్న నాయకుడిగా దేశానికి వివిధ హోదాల్లో పీవీ చేసిన సేవలకు సరైన గుర్తింపు లభించింది. ఆయనకు భారతరత్న ప్రకటించడం దేశ ప్రజలందరికీ గర్వకారణం.

- జి.కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి

తెలుగు ప్రజలకు ప్రత్యేకించి తెలంగాణకు దక్కిన గౌరవం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డకు అత్యున్నత పురస్కారం లభించడం పట్ల ఆ జిల్లా వాసిగా గర్వపడుతున్నా.

-బండి సంజయ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

మోదీ సంస్కారానికి నిదర్శనం: ఎమ్మెల్సీ వాణీదేవి

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల ఆయన కుమార్తె, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కౌన్సిల్ మీడియా పాయింట్ వద్ద వాణీదేవి మాట్లాడుతూ...పీవీకి ఈ పురస్కారం ఇవ్వడం ద్వారా భారతరత్న విలువ పెరిగిందన్నారు. పార్టీలకతీతంగా...దేశానికి పీవీ అందించిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ప్రకటించడం ప్రధాని మోదీ సంస్కారానికి నిదర్శనమన్నారు.

పీవీకి భారతరత్న పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన వారిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, శేరి సుభాష్‌రెడ్డి, మహమూద్ అలీ, మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, ఎల్.రమణ,తదితరులు ఉన్నారు.

రూ.3 లక్షల కోట్ల బడ్జెట్!?

2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పద్దు

సాక్షి, హైదరాబాద్: ఆరుగ్యారంటీల అమలుకు ప్రాధాన్యతనిస్తూ, సంక్షేమ పథకాల అమలు కోసం గ్రీన్‌చానెల్ ఆసరా కల్పిస్తూ, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులను ప్రాధాన్యతల వారీగా చూపిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పక్షాన అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఈ తొలి బడ్జెట్ పద్దు రూ.2.95లక్షల కోట్ల నుంచి రూ.3లక్షల కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శాసనమండలిలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్ సమర్పించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ పద్దు కింద మూడు నెలల కాలానికి అసెంబ్లీ అనుమతి తీసుకుని జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ఓటాన్ అకౌంట్‌కు శనివారం ఉదయం 9 గంటలకు భేటీ కానున్న రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.

పెద్ద పద్దులు తగ్గించకుండానే...!

గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,90,296 కోట్లుగా సభ ఆమోదం కోసం పెట్టిన విషయం విదితమే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రతిపాదనల కోసం ఆర్థిక శాఖ అన్ని ప్రభుత్వ శాఖలతో సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల కంటే ముందే ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు కోరింది. ఈ మేరకు ఆయా ప్రభుత్వ శాఖలు తమ ప్రతిపాదనలు పంపాయి. విద్యుత్ శాఖ రూ.18 వేల కోట్లు, సాగునీటి శాఖ రూ.25వేల కోట్లు, సంక్షేమ శాఖలన్నీ కలిపి రూ.40వేల కోట్ల పైచిలుకు, గృహనిర్మాణశాఖ రూ.25వేల కోట్లు, ఆర్టీసీ రూ.7వేల కోట్లు, వైద్యారోగ్య శాఖ రూ.13వేల కోట్లు, అన్ని రకాల విద్యాశాఖలు కలిపి రూ.21వేల కోట్లు, వ్యవసాయ శాఖ రూ.30వేల కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.40వేల కోట్ల పైచిలుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. కీలకమైన ఈ ఐదారు శాఖల బడ్జెట్ పద్దు రూ.2లక్షల కోట్ల వరకు చేరాయి. వీటికి తోడు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, అప్పులకు వడ్డీల చెల్లింపుల కింద మరో రూ.65వేల కోట్లు అవసరమవుతాయి.

నాలుగు గ్యారంటీలకే నిధులు?

ఆరు గ్యారంటీల అమలు కోసం రూ.65వేల కోట్ల వరకు అవసరమవుతాయనే అంచనాలున్నా ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో కేవలం నాలుగు గ్యారంటీల (మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10లక్షలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్)లకు నిధులు ప్రతిపాదించనున్నారు. వీటిని ఆయా శాఖల పద్దుల్లో సర్దుబాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటికి తోడు రైతుభరోసా, రైతు రుణమాఫీ, పింఛన్లు, కొత్త ఉద్యోగాల కల్పనలకు అవసరమైన నిధులను కూడా ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆయాశాఖల్లో సర్దుబాటు చేయనున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన వాటిలో రైతుబంధు (రైతు భరోసా) మినహా ఇతర పథకాలకు నిధుల కేటాయింపు లేదని సమాచారం. వీటికి తోడు రెవెన్యూ పద్దు, మూల ధన వ్యయం, ద్రవ్యలోటు అంచనాలు కలిపి బడ్జెట్ పద్దు ఈసారి రూ.2.95 లక్షల కోట్ల నుంచి రూ.3లక్షల కోట్ల వరకు వెళుతుందని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి.

కేంద్రంపై పెద్దగా ఆశలు పెట్టుకోకుండానే..

గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్ను వాటాలు, ఇవ్వాల్సిన గ్రాంట్‌ఇన్ ఎయిడ్‌లు ఆశించిన మేర రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పద్దులో చూపించిన మొత్తానికి, సవరణల బడ్జెట్‌కు చాలా తేడా కనిపించింది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల్లో వాటా కింద రూ. 21,471 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ. 41,259 కోట్లను ప్రతిపాదించింది. అయితే, వాస్తవ రూపంలోకి వచ్చేసరికి డిసెంబర్ నాటికి రూ. 10,253 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేవలం రూ. 4978 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వం నుంచి తమకు ఏ మేరకు సహకారం ఉంటుందన్న దానిపై ఆచితూచి అంచనాలతో రాష్ట్రం బడ్జెట్ కసరత్తు చేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్రంపై పెద్దగా ఆశలు పెట్టుకోకుండానే వాస్తవిక అంచనాలకు అనుగుణంగా ప్రతిపాదనలు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాల్లో తగ్గుదల!

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర పన్నుల్లో వాటాను తెలంగాణకు 2.102 శాతంగా ప్రతిపాదించింది. ఇందులో కార్పొరేషన్ ట్యాక్స్ కింద రూ.8051.77 కోట్లు, ఆదాయపన్ను కింద రూ. 8872.10 కోట్లు, సీజీఎస్టీ కింద రూ. 7838.82 కోట్లు, కస్టమ్స్ డ్యూటీ కింద రూ. 523.20 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ కింద రూ. 312.84 కోట్లు, సర్వీసు టాక్స్, ఇతర పన్నులు కలిపి మొత్తం రూ. 25639.84 కోట్లు తెలంగాణకు వచ్చే అవకాశముందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే పన్నుల్లో వాటా ప్రతిపాదనలు పెరిగి, గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాల్లో తగ్గుదల ఉండే అవకాశముందని ఆర్థిక శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

అప్పులు.. భూముల అమ్మకాలు ఎలా?

రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పుల పాలు చేసిందని మొదటి సమావేశాల్లోనే శ్వేతపత్రం విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్ పత్రంలో ఏ మేరకు రుణ సమీకరణను ప్రతిపాదిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. గతేడాది రుణాల కింద బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.40,615 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో రూ.36వేల కోట్లకు పైగా డిసెంబర్ నాటికే సమీకరణ జరిగింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి నెల చివరకు మరో రూ.5,400 కోట్లు తీసుకోనుంది. విధానాలు, ప్రభుత్వ ఆలోచనలు ఎలా ఉన్నా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మనుగడకు బహిరంగ మార్కెట్‌లో రుణ సేకరణ అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా అప్పుల పద్దు రూ.40వేల కోట్లు దాటుతుందని తెలుస్తోంది. ఇక, రాజీవ్ స్వగృహ, దిల్ భూముల అమ్మకాలకు ప్రభుత్వం మొగ్గు చూపుతోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో పన్నేతర ఆదాయం పద్దు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సాక్షి రియల్టీ
శనివారం
10-2-2024

బాచుపల్లి.. బాహుబలి!

అంతర్జాతీయ విద్యా సంస్థలతో ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన ప్రాంతం..

ప్రపంచ స్థాయి ఐటీ కేంద్రాలకు సమీప దూరం..

నగర రూపురేఖల్ని మార్చిన మెట్రో స్టేషన్, ఔటర్ రింగ్ రోడ్డులతో అనుసంధానం..

అందుబాటు ధరలతో పెట్టుబడిదారులు, కొనుగోలుదారులను ఆకర్షిస్తున్న చోటు..

...ఈ లక్షణాలన్నీ బాచుపల్లి సొంతం. పెట్టుబడిదారులను, కొనుగోలుదారులను ఆర్థికంగా, మానసికంగా శక్తివంతులను చేస్తున్న ఈ బాచుపల్లి నగర స్థిరాస్తి రంగంలో బాహుబలిగా మారింది.



- ఎడ్యుకేషనల్ హబ్‌గా పేరొందిన ప్రాంతం
- అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలకు నిలయం
- సమీప దూరంలోనే ఔటర్, మెట్రో స్టేషన్లు
- మెరుగైన మౌలిక వసతులతో శరవేగంగా అభివృద్ధి
- గతేడాది రూ.35,164 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు
- రూ.646 కోట్ల ఆదాయం

సబ్ రిజిస్ట్రేషన్ గణాంకాలివీ

నెల	డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి-23	3,017	41.72
ఫిబ్రవరి	2,100	45.07
మార్చి	3,521	60.50
ఏప్రిల్	2,727	49.13
మే	3,288	68.17
జూన్	3,116	52.81
జూలై	2,790	46.80
ఆగస్టు	3,061	55.23
సెప్టెంబర్	2,910	60.79
అక్టోబర్	2,715	45.53
నవంబర్	2,711	56.25
డిసెంబర్	3,208	64.07
జనవరి-24	2,544	45.97

ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అంశాలివీ

- మియాపూర్ మెట్రో స్టేషన్‌ను బాచుపల్లి వరకు విస్తరించాలి.
- నిజాంపేట నుంచి ఔటర్ 32-ఏ రేడియల్ రింగ్‌ను ప్రారంభించాలి.
- జేఎన్‌టీయూ-ప్రగతినగర్ మీదుగా బాచుపల్లికి స్కైవే లేదా ఫ్లైఓవర్‌ను నిర్మించాలి.
- బాచుపల్లి జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.
- బాచుపల్లి జంక్షన్ నుంచి బౌరంపేట మార్గంలో నత్తనడకన సాగుతున్న నాలుగు లైన్ల రహదారి పనులను వేగవంతం చేయాలి.

సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలం క్రితం వరకూ బాచుపల్లి అంటే సిటీకి దూరమనే భావన ఉండేది. నిజాంపేట కాంక్రీట్ జంగిల్‌గా అభివృద్ధి చెందిన తర్వాత స్థలం కొరత కారణంగా బిల్డర్లు బాచుపల్లి వైపు దృష్టి మళ్లించారు. మియాపూర్, నిజాంపేట, ప్రగతినగర్ ఈ మూడు మార్గాలు బాచుపల్లికి అనుసంధానమై ఉండటంతో పాటు హౌజింగ్ బోర్డ్ కాలనీ, కూకట్‌పల్లి, మియాపూర్ రెసిడెన్షియల్ హబ్‌లు బాచుపల్లికి దగ్గరగా ఉన్నాయి. దీంతో పాటు కాజీపల్లి, బాలానగర్, హైటెక్‌సిటీ వంటి ఐటీ, పారిశ్రామిక ప్రాంతాలూ బాచుపల్లికి సమీప దూరమే. దీంతో ఒక్కసారిగా బాచుపల్లిలో అభివృద్ధి టాప్‌గేర్‌లో పడింది. గేటెడ్ కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాలు, లగ్జరీ విల్లాలు, వాణిజ్య సముదాయాలతో ప్రధాన నగరంతో పోటీపడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

రూ.646 కోట్ల ఆదాయం...

బాచుపల్లి ప్రాంతం సూరారం సబ్ రిజిస్ట్రేషన్ (ఎస్‌ఆర్‌ఓ) పరిధిలోకి వస్తుంది. ఏటేటా ఎస్‌ఆర్‌ఓ ఆదాయం పెరగడమే ఈ ప్రాంతం అభివృద్ధికి ఉదాహరణ. సూరారం ఎస్‌ఆర్‌ఓలో గతేడాది 35,164 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. రూ.646 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జనవరిలో 2,544 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగగా.. రూ.45.97 కోట్ల ఆదాయం సమకూరింది. వాసవి, అపర్ణా, ప్రణీత్, ఏపీఆర్, ఆస్పైర్ స్పేస్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు బాచుపల్లిలో అన్ని వర్గాల వారికీ అనుకూలమైన ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నాయి.

మెట్రో, ఔటర్‌తో సులభంగా..

బాచుపల్లి నుంచి 10 కి.మీ. దూరంలో హైటెక్‌సిటీ, 13 కి.మీ. దూరంలో గచ్చిబౌలి ప్రాంతాలున్నాయి. మియాపూర్, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్లకు సమీప దూరంలోనే బాచుపల్లి ఉండటంతో ఐటీ కంపెనీ ఉద్యోగులు, ఓఆర్‌ఆర్ అనుసంధానమై ఉండటంతో జిల్లా వాసులూ ఇక్కడ నివాసం ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మియాపూర్, జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్లు, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌కు 8-10 కి.మీ. దూరంలోనే బాచుపల్లి ఉండటంతో ఇక్కడి నుంచి సిటీలోని ఏ ప్రాంతానికైనా సులభంగా ప్రయాణించొచ్చు. మియాపూర్ నుంచి గండిమైసమ్మ మీదుగా మేడ్చల్ వరకు జాతీయ రహదారి ఉంది. పైగా ఈ ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకునే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా జిల్లా కేంద్రాలకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. పారిశ్రామిక కేంద్రం పటాన్‌చెరు, జిల్లా కేంద్రం మేడ్చల్‌కు ఓఆర్‌ఆర్ దగ్గరి దారి.

నీటి సమస్య తీరింది..

నిజాంపేట, బాచుపల్లి తదితర ప్రాంతాలను ఇది వరకు నీటి సమస్య వేధించేది. పూర్తిగా బోర్లపైనే ఆధారం. భూగర్భ జలాలు కలుషితమనే అపోహ ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. జల మండలి ప్రత్యేక లైన్లు వేయడంతో సమస్య తీరిపోయింది. పైగా గోదావరి, మిషన్ భగీరథ నీరు బాచుపల్లి ఏరియాకు వచ్చాయి. దీంతో గ్రౌండ్ వాటర్ మీద ఆధారం తగ్గింది. కాలుష్యం వెదజల్లే ఔషధ పరిశ్రమలు ఔటర్ బయటకు తరలిపోనుండటంతో ఈ ప్రాంతం నివాసాలకు మరింత ఆకర్షణీయంగా మారనుందని నిర్మాణదారులు పేర్కొంటున్నారు. ఇక్కడి మౌలిక, రవాణా సదుపాయాలు చూస్తుంటే సమీప భవిష్యత్తులో మియాపూర్, కేపీహెచ్‌బీ తరహాలో బాచుపల్లి ప్రాంతం శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందటం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఔటర్‌తో కొత్త అవకాశాలు..

బాచుపల్లి ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్డుకు 2-3 కి.మీ. దూరంలో ఉంది. ఇటీవలే సుల్తాన్‌పూర్ నుంచి దుండిగల్ ఔటర్ మార్గంలో 4-ఏ మల్లంపేట ఓఆర్‌ఆర్ జంక్షన్ ప్రారంభమైంది. బాచుపల్లిలో మౌలిక వసతులు, గృహ నిర్మాణాలు సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థిరాస్తి అవకాశాలు మరింత మెరుగయ్యాయని ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు. హైటెక్ సిటీ నుంచి 15 కి.మీ. దూరంలో అందుబాటు ధరలలో ఉన్న ప్రాంతం ఏదైనా ఉందంటే అది బాచుపల్లి మాత్రమే. మిగిలిన ప్రాంతంలో ధరలు రెండింతలున్నాయి. నాలుగేళ్ల క్రితం బాచుపల్లిలో అపార్ట్‌మెంట్లలో ధర చ.అ.కు రూ.2,500లుగా ఉండగా.. ఇప్పుడది 50 శాతం మేర పెరిగి రూ.5-6 వేలకు చేరాయి. భూముల ధరలైతే నాలుగు రెట్లు పెరిగాయని ఆయన చెప్పారు.

ముందు గృహ ప్రవేశం చేయండి.. ఆ తర్వాతే

ఈఎంఐ కట్టండి!



సాక్షి, హైదరాబాద్: సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. పొదుపు చేసిన సొమ్ము కొంత, గృహ రుణం కొంత కలిపి సొంతిల్లు కొనుగోలు చేస్తుంటారు. అయితే ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయ్యే వరకూ కొనుగోలుదారులు అటు బ్యాంక్‌కు నెలవారీ వాయిదా (ఈఎంఐ), ఉండే ఇంటికి అద్దె రెండూ చెల్లించాల్సిందే. కష్టమర్ల ఇబ్బందులు తెలుసుకున్న ప్రైమార్క్ ప్రాజెక్ట్స్ కొనుగోలుదారులు గృహ ప్రవేశం చేసే వరకూ ఈఎంఐ కట్టే పనిలేకుండా సరికొత్త ఆఫర్‌ను తీసుకొచ్చింది. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో గృహ రుణం తీసుకునే కస్టమర్లకు ఏడాది వరకు ఒక్క రూపాయి ఈఎంఐ చెల్లించాల్సిన అవసరం లేదని సంస్థ ఎండీ వంశీ కృష్ణ 'సాక్షి'కి తెలిపారు.

- గుండ్లపోచంపల్లిలో 5 ఎకరాలలో ఎకో నెస్ట్ ప్రీమియం ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాం. 5 టవర్లు, ఒక్కోటి 10 అంతస్తులలో ఉంటుంది. మొత్తం 410 యూనిట్లు. 1150 చ.అ. నుంచి 2,160 చ.అ. మధ్య ఫ్లాట్ల విస్తీర్ణాలుంటాయి. ధర చ.అ.కు రూ.4,500గా ఉంది. ఇప్పటికే 150 ఫ్లాట్లు విక్రయమయ్యాయి. 20 వేల చ.అ.లలో క్లబ్ హౌస్ ఉంటుంది. స్విమ్మింగ్ పూల్, జిమ్, జాగింగ్, వాకింగ్ ట్రాక్స్ వంటి అన్ని రకాల వసతులుంటాయి. ఈ ఏడాది ముగింపు నాటికి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుంది.
- వర్క్ ఫ్రం హోమ్ విధానం అందుబాటులో ఉన్నా చాలా మంది ఉద్యోగులకు ఇంటి నుంచి కాకుండా ప్రత్యేక వాతావరణం ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌లో ప్రత్యేకంగా వర్క్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నాం. 600 చ.అ.లలో 10 సీట్ల సామర్థ్యంతో పాటు సమావేశ గది ఉంటుంది.
- సాధారణంగా ఇతర ప్రాజెక్ట్స్‌లో కామన్ ఏరియా ఎక్కువగా ఉండి, గదుల మధ్య అంతర్గత ఏరియా తక్కువగా ఉంటుంది. కానీ, ప్రైమార్క్ ప్రాజెక్ట్స్‌లో ఇంటర్నల్ ఏరియా ఎక్కువగా ఉంటుంది. దీంతో గదులు విశాలంగా ఉంటాయి. ఇప్పటికే బహదూర్‌పల్లిలో 5 ఎకరాలలో డీ‌స్ట్రేచర్ పేరుతో 416 యూనిట్ల ప్రాజెక్ట్‌ను నిర్మించాం. 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

బహదూర్‌పల్లిలో నార్త్‌వేవ్...

రెరా అనుమతులు రాగానే బహదూర్‌పల్లిలో 13.5 ఎకరాలలో నార్త్‌వేవ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నాం. 14 బ్లాక్‌లలో 1,026 యూనిట్లుంటాయి. 1,150 చ.అ. నుంచి 1,810 చ.అ. మధ్య సైజులుంటాయి. 2 బీహెచ్‌కే ప్రారంభ ధర రూ.60 లక్షలు. ఈ ప్రాజెక్ట్‌లో రెండు క్లబ్ హౌస్‌లు ఉంటాయి. 2026 డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తవుతుంది.

వాసవి అర్బన్‌లో పీఎంఏవై స్కీమ్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి నిర్మాణం, ఆధునిక వసతులు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం... ఇంతకంటే ఏం కావాలి సొంతింటి కల నెరవేర్చుకునేందుకు. ధరలు కూడా ఆకాశాన్నంటుతాయనుకుంటే పొరపాటే. అందుబాటు ధరలలో సామాన్యుల సొంతింటి కలను నిజం చేసేందుకు వాసవి గ్రూప్ అద్భుతమైన ప్రాజెక్ట్‌తో ముందుకొచ్చింది. బాచుపల్లిలో అర్బన్ పేరుతో హైరైజ్ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం వర్తిస్తుందని, కొనుగోలుదారుల వార్షిక ఆదాయాన్ని బట్టి ఏడాదికి 4 నుంచి 6.5 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని వాసవి గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా తెలిపారు. జీఎస్‌టీ 1 శాతం మాత్రమే ఉంటుందని చెప్పారు.

- 17.86 ఎకరాల విస్తీర్ణంలో 2 సెల్లార్లు + స్టిల్ట్ + 23 అంతస్తులలో గేటెడ్ కమ్యూనిటీ ఉంటుంది. 12 టవర్లలో మొత్తం 3,714 యూనిట్లుంటాయి. 875, 950, 975 చ.అ. మధ్య 2 బీహెచ్‌కే విస్తీర్ణాలుంటాయి. ప్రారంభ ధర రూ.42.50 లక్షలు. ఇప్పటికే 2 వేల యూనిట్లను విక్రయించాం. ఈ ప్రాజెక్ట్‌లో 70 శాతం ఓపెన్ స్పేస్ ఉంటుంది.
- లక్ష చ.అ.లలో సోషల్, హెల్త్, యుటిలిటీ పేర్లతో మూడు క్లబ్‌హౌస్‌లుంటాయి. ఒక్కోటి జీ+4 అంతస్తులలో ఉంటుంది. మెడిటేషన్, ఓపెన్ యోగా, సైకిల్ ట్రాక్, వాకింగ్, జాగింగ్ ట్రాక్స్, కిడ్స్ ప్లే ఏరియా, ఫార్మసీ, క్లినిక్, యాంపి థియేటర్, సూపర్ మార్కెట్, స్పా, జిమ్, గెస్ట్ రూమ్స్, ఇండోర్ గేమ్స్, బాంక్వెట్ హాల్, మల్టిపర్పస్ హాల్, స్విమ్మింగ్ పూల్ వంటి అన్ని రకాల వసతులుంటాయి.


శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

15న ఎంపీ సీఎం రాక

సాక్షి, హైదరాబాద్: ఈనెల 15న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మహేంద్ర యాదవ్ రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్నని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా మహేంద్ర యాదవ్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్, ఆపై స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారని పార్టీ నాయకుల సమాచారం.

గురుకుల ఉద్యోగులకు ఇంకా జీతాలు రాలే

- మొదట్లో సాంకేతిక సమస్యతో నిలిచాయన్న అధికారులు
- ఇప్పుడు ఫోన్లు కూడా ఎత్తని వైనం
- పదో తేదీ వచ్చినా జీతం రాకపోవడంతో ఆ ఉద్యోగుల ఆవేదన

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో వేతనాల గోల మొదలైంది. పదో తేదీ సమీపించినా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్) పరిధిలోని ఉద్యోగులకు ఇప్పటివరకు వారి ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. ఈ నెల 1నే ప్రభుత్వ ఉద్యోగులందరికీ వేతనాలు విడుదల చేసినట్లు సీఎంఓ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇందుకు ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. అయితే ఆ మూడు గురుకుల సొసైటీల్లోని ఉద్యోగులకు ఆ రోజున వేతనాలు జమకాలేదు. మరుసటిరోజు జమ కావొచ్చని వారంతా భావించినప్పటికీ పదో తేదీ కావొస్తున్నా వేతనాలు అందకపోవడంతో ఉద్యోగుల నుంచి రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులకు ఫోన్లు పోటెత్తాయి.

కారణం చెప్పని సొసైటీ కార్యాలయం

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల సొసైటీల పరిధిలో దాదాపు 20వేల మంది రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. రోజులు గడుస్తున్నా వేతనాలపై స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందిన ఉద్యోగులు సొసైటీ కార్యదర్శి కార్యాలయంలోని ఉన్నతాధికారులను సంప్రదించారు. నేడు, రేపు జమ కావొచ్చంటూ చెప్పుకొచ్చిన అధికారులు గత రెండు రోజులుగా ఫోన్లు ఎత్తడం మానేశారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు శుక్రవారం ఎస్సీ గురుకుల సొసైటీ కార్యాలయానికి వచ్చి వేతనాలపై ఆరా తీశారు. సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయని, ఒకట్రెండు రోజుల్లో జమ కావొచ్చని చెప్పుకొచ్చారు. కానీ ఇందుకు సంబంధించి పక్కా సమాచారం ఇవ్వకపోవడంతో ఉద్యోగుల్లో పలు అనుమానాలు మొదలయ్యాయి. దీనిపై గురుకుల సొసైటీ కార్యదర్శిని కలిసే ప్రయత్నం చేసినప్పటికీ ఆమె కార్యాలయానికి రాలేదని, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారంటూ కార్యదర్శి పేషి అధికారులు చెప్పినట్లు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలకు చెందిన కొందరు టీచర్లు 'సాక్షి'వద్ద వాపోయారు.

ఈసెట్, లాసెట్ షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఈసెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. నోటిఫికేషన్ ఈ నెల 14 విడుదలవుతుంది. 15వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటారు. ఏప్రిల్ 24 వరకూ ఫీజు చెల్లించుకోవచ్చు. మే 6వ తేదీన పరీక్ష జరుగుతుంది.
జూన్ 3న లాసెట్: లాసెట్ నోటిఫికేషన్ ఈ నెల 28వ తేదీన విడుదలవుతుంది. మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 25 వరకూ దరఖాస్తులు తీసుకుంటారు. పరీక్ష జూన్ 3 తేదీన ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుంది.

మార్చి 1 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 1 నుంచి మార్చి 11 వరకూ జరుగుతాయి. ఫైనల్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు వీటిని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాట్లు చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గ్రూప్–4 పరీక్షల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదల

▶ మొదటి పేజీ తరువాయి
నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉద్యోగాల కోసం 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా... గతేడాది జూలై 1వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఓఎంఆర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పేపర్–1(జనరల్ స్టడీస్) పరీక్షకు 762872 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్–2 పరీక్షకు 761198 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థుల జవాబుపత్రాలను మూల్యాంకనం చేసిన టీఎస్‌పీఎస్సీ.... తాజాగా 7,26,837మంది అభ్యర్థులు సాధించిన ర్యాంకులు, మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచింది. ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థుల జాబితాను త్వరలో షార్ట్‌లిస్ట్ చేసి వెల్లడించనున్నట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరస్కరణకు గురైన అభ్యర్థులను ఈ జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు.

పెరిగిన 'క్షయ వ్యాధిగ్రస్తులు'

- నాలుగేళ్లలో తెలంగాణలో 2,72,271 మందికి గుర్తింపు
- లోక్‌సభలో గణాంకాల వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత నాలుగేళ్లలో క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. తెలంగాణలో 2020–2023 మధ్య కాలంలో 2,72,271 మందికి క్షయ ఉన్నట్లు గుర్తించామని.. అందులో 2020లో 63,057 మంది, 2021లో 61,046 మంది, 2022లో 73,272 మంది, 2023లో 74,896 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఈ నాలుగేళ్లలో గిరిజన ప్రాంతాల్లో 30,869 మంది క్షయ బారిన పడ్డారని కేంద్రమంత్రి చెప్పారు. క్షయ నివారణకు రాష్ట్రంలో రూ.129.12 కోట్లు ఖర్చు చేశారని శుక్రవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అదే సమయంలో ఏపీలో ఈ నాలుగేళ్లలో 3,35,744 మంది క్షయ వ్యాధి బారినపడగా ఏపీ ప్రభుత్వం రూ.183.47 కోట్లు క్షయవ్యాధి నివారణకు ఖర్చు చేసిందని తెలిపారు.

రియల్టీ వార్తలు

అపరిమిత ఎత్తు ఎవరికి లాభం?



- ఎఫ్ఎస్ఐతో చిన్న, మధ్య స్థాయి బిల్డర్లకు కష్టాలు
- భూములు, గృహాల ధరల పెరుగుదలకు కారణమిదే
- భవనాల ఎత్తుపై ఆంక్షలుంటే పెట్టుబడిదారుల నిరాసక్తి
- గణనీయంగా ఇంపాక్ట్ ఫీజు పెంపుతోనే ఎఫ్ఎస్ఐ నియంత్రణ

> హైదరాబాద్‌లో భూముల ధరలు ఎక్కువ. పైగా మెరుగైన మౌలిక వసతులున్న స్థలాల కొరత కారణంగా ఇక్కడ అందుబాటు గృహాలను నిర్మించడం లాభదాయకం కాదు. దీనికి పరిష్కారమే వర్టికల్ బిల్డింగ్‌లు అంటే ఆకాశ హర్మ్యాలు! అపరిమిత ఎఫ్ఎస్ఐ దీన్ని మరింత సులభతరం చేసింది. ఇది మంచిదే. కానీ, ప్రస్తుతం ఎంత మంది బిల్డర్లు అఫర్డబుల్ హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న? గచ్చిబౌలి నుంచి 10 కి.మీ. చుట్టూ 2 బీహెచ్‌కే ధర రూ.75 లక్షలకు తక్కువ ఎక్కడా లేదు. దీనికి వసతులు, రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ చార్జీలు అదనం. ఇంటీరియర్ ఇతరత్రా ఖర్చులు కలిపి రూ.కోటి అవుతుంది. నెల జీతం రూ.లక్షకు పైనే ఉంటే తప్ప ఈ బడ్జెట్‌లో కొనలేని పరిస్థితి.

సాక్షి, హైదరాబాద్: నగరాభివృద్ధికి ఆకాశ హర్మ్యాలే ప్రతీక. ఆర్థికంగా, సాంకేతికంగా మనం ఎంత శక్తివంతులమో ఇవి నిరూపిస్తాయి. హైదరాబాద్ అభివృద్ధి ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)కు ముందు, ఆ తర్వాత అని విభజించాలి. 2006కు ముందు నగరంలో ఐదంతస్తుల భవనాలు అవి కూడా ఎంసీహెచ్ పరిధిలోనే ఉండేవి. అప్పుడు 95 శాతం అభివృద్ధి ఎంసీహెచ్ పరిధిలో, 5 శాతం మిగిలిన మున్సిపాలిటీలలో జరిగేది. 2006లో జీవో–86 వచ్చాక పరిస్థితి తారుమారైంది. అభివృద్ధి సిటీ నుంచి బయటికి విస్తరించింది. ప్రెస్టిజ్, సత్వా, బ్రిగేడ్, మంత్రి వంటి అంతర్జాతీయ డెవలపర్లు నగరంలో అడుగుపెట్టారు. అంతర్జాతీయ డిజైన్లు, ఎలివేషన్స్, సెవెన్ స్టార్ స్థాయిలో క్లబ్ హౌస్‌లు, ల్యాండ్ స్కేపింగ్‌లతో భవనాల రూపురేఖలే మారిపోయాయి. వీళ్లను ప్రేరణగా తీసుకొని స్థానిక బిల్డర్లు గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ ప్రాజెక్టుల వైపు దృష్టి మళ్లించారు.

మౌలిక వసతులు కల్పిస్తేనే..

ప్రపంచ స్థాయి జీవనశైలి, కస్టమర్ల అభిరుచిలో మార్పులు వంటి రకరకాల కారణాలతో విదేశాల్లో మాదిరిగా హైఎండ్, హైరైజ్ భవనాలకు డిమాండ్ ఏర్పడింది. ఇళ్ల కొరతను అధిగమించాలంటే ఏ ప్రభుత్వమైనా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిందే. భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తేనే నగరాలు పెట్టుబడులకు స్వర్గధామంగా మారతాయి. కొరియా, థాయ్‌లాండ్, మలేషియా, హాంకాంగ్, చైనా, జపాన్, సింగపూర్, ఇండోనేసియాలు ఎప్పుడో ఆకాశహర్మ్యాలకు శ్రీకారం చుట్టాయి. హైదరాబాద్ కూడా ఇదే స్థాయిలో అభివృద్ధి చెందే వీలును 2006లో ప్రభుత్వం కల్పించింది. భవనాలకు అపరిమిత ఎత్తుకు అనుమతిస్తూ జీవో–86ను తీసుకొచ్చింది. ఫలితంగా నగరంలో హైరైజ్ భవనాల సంఖ్య పెరిగింది. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా వంటివి నగరంలోకి అడుగుపెట్టాయి.

ఇంపాక్ట్ ఫీజు తగ్గించడమే తప్పు..

ఎఫ్ఎస్ఐను పరోక్షంగా నియంత్రించాలి. సాధారణ స్థాయి కంటే నిర్మాణ స్థలం కొంత ఎక్కువే రావడం వల్ల సహజంగానే అక్కడి మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుంది. దీనికి అధిగమించడానికి నిర్మాణ సంస్థలు ఇంపాక్ట్ ఫీజును చెల్లిస్తాయి. జీవో–86లో ఇంపాక్ట్ ఫీజు అనేది ముఖ్యమైన అంశం. ప్రతి 3–5 ఏళ్లకు ఒకసారి ఇంపాక్ట్ ఫీజు పెంచాలి. ఇది భూమి ధరకు సమానంగా ఉండాలి. కానీ, 2006లో ఈ జీవో వచ్చిన తర్వాత 2016 ఇంపాక్ట్ ఫీజును సవరించారు. అయితే పెంచాల్సింది పోయి 20–30 శాతం తగ్గించేశారు. ఇదే పెద్ద తప్పు. ఒక నిర్దిష్టమైన ఎత్తు తర్వాత ఇంపాక్ట్ ఫీజు గణనీయంగా పెంచాలి. 18 మీటర్ల తర్వాత ప్రతి ఐదంతస్తులకు 0.5 మీటర్లు అదనంగా సెట్‌బ్యాక్ పెంచాలి. దీంతో బిల్టప్ ఏరియా తగ్గుతుంది. దీంతో భూమి యజమానిపై ప్రభావం పడుతుంది కాబట్టి బిల్డర్లపై ఒత్తిడి ఉండదు. ఇంపాక్ట్ ఫీజు పెంపుతో ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుంది.

– సీ శేఖర్ రెడ్డి, చైర్మన్, సీఐఐ తెలంగాణ

సొంతింటి కల మరింత దూరం

అపరిమిత ఎఫ్ఎస్ఐ కారణంగా భూముల ధరలతో పాటు యజమానులలో అత్యాశ పెరిగింది. ప్లాటింగ్‌కు అనువైన చోట విల్లాలు నిర్మించాలని, విల్లాలకు అనువైన ప్రాంతంలో లోరైజ్ అపార్ట్‌మెంట్లను, తక్కువ ఎత్తులో నిర్మాణాలుండే భూములలో హైరైజ్ భవంతులను నిర్మించాలంటూ బిల్డర్‌ను ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఆర్థికంగా బలమైన బిల్డర్లు మినహా జాయింట్ వెంచర్ ప్రాతిపదికన చేపట్టే డెవలపర్లెవరూ దీన్ని తట్టుకోలేకపోతున్నారు. ఏ పరిశ్రమైనా అభివృద్ధి చెందాలంటే చిన్న, మధ్య, భారీ అన్ని రకాల విభాగాలు ఉండాలి. రోజుకొకటి ఒంటి మీద వేసుకునే దుస్తుల్లోనే స్మాల్, మీడియం, లార్జ్ సైజ్‌లుంటాయి. అలాంటిది జీవితకాలం ఉండే ఇంటిలో, ఆ గృహాలను నిర్మించే నిర్మాణ రంగంలో అన్ని వర్గాల తరగతులు ఉండాలి లేకపోతే పరిశ్రమ మనుగడ సాగించదు. అపరిమిత ఎఫ్ఎస్ఐ కారణంగా చిన్న, మధ్య స్థాయి డెవలపర్లు కనుమరుగై పరిశ్రమ బడా బిల్డర్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీంతో గృహాల ధరలు పెరుగుతాయి. సామాన్యుని సొంతింటి కల మరింత దూరమవుతుంది.

– నరేంద్రకుమార్, ఎండీ, ప్రణీత్ గ్రూప్

ఇళ్ల ధరల పెరుగుదల హైదరాబాద్‌లోనే అత్యధికం!



సాక్షి, హైదరాబాద్: గత ఏడాది కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో గృహాల ధరలు పెరిగాయని, సగటును 10–24 శాతం మేర వృద్ధి చెందాయని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరి తెలిపారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 24 మేర పెరిగాయని పేర్కొన్నారు. 2022లో నగరంలో చ.అ.కు రూ.6,150గా ఉన్న ధరలు.. ప్రస్తుతం రూ.7,080లకు పెరిగాయని వివరించారు. స్థిరమైన రెపో రేట్ల కారణంగా రానున్న రోజులలో గృహాల కొనుగోళ్లు మరింత ఊపందుకుంటాయని చెప్పారు. ప్రపంచ మార్కెట్ల అస్థిరత, ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలు బలంగా ఉండటంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి రెపో రేట్లను 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచాలని నిర్ణయించిందని, ఫలితంగా సరసమైన గృహ రుణ వడ్డీ రేట్ల ప్రయోజనం గృహ కొనుగోలుదారులు పొడిగించినట్లయిందని, దీంతో గృహాల డిమాండ్‌ను కొనసాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.


Own house dream
now a reality...
VASAVI - SUCHIR
URBAN
BACHUPALLY
2 BHK PREMIUM APARTMENTS
TS RERA NO. P02200002275
VASAVI GROUP
You dream. We deliver.
₹42.5*
LAKHS ONWARDS
PREMIUM AFFORDABLE PROJECT
BY TIMES GROUP 2021
*T&C Apply
3 CLUBHOUSES
1,00,000 sq.ft.
40+ EXCITING AMENITIES
12 Towers
23 Floors
70% Open Space
3714 Units
875-975sq.ft. Area Range
+91 90191 00099 | www.thevasavigroup.com
SALES OFFICE OPEN ON SUNDAYS
hmda
Member of CREDAI HYDERABAD
NAREDCO TELANGANA
SCAN QR CODE TO DOWNLOAD BROCHURE


PrimarK
14 YEARS OF EXCELLENCE
PRIMARK'S DE STATURE
T.S. RERA No. P02200002514
JOIN 200+ FAMILIES
LIVING LIFE AT ITS BEST
2 & 3 BHK LUXURY FLATS
EXCLUSIVE OFFER
NO EMIs* for 3 MONTHS
READY TO OCCUPY
5 ACRES | 6 BLOCKS
8 FLOORS | 416 UNITS
Bahadurpally
Near Pragati Nagar, Kukatpally
*T&C Apply
Scan For Location
+91 91777 84 222 | +91 91777 87 444
PRIMARK'S econest
Live In Nature's Glory
T.S. RERA No: P02200003576
BOOK NOW, PAY EMIs
ON POSSESSION.
2 & 3 BHK LUXURY FLATS
NO EMIs* FOR 1 YEAR
Gundlapochampally
Near Apparel Export Park
5 ACRES | 5 BLOCKS | 10 FLOORS | 410 UNITS
*T&C Apply
Scan For Location
+91 90592 85286 | +91 90592 64265
outlinemedia.in
Corporate Office:
3rd Floor, Artham's Arcade, Above Vijaya Diagnostic Centre
Raghavendra Colony, Kondapur, Telangana - 500084.
Email: sales@primarkprojects.in
www.primarkprojects.in
Home Loans & Project Funded By
BAJAJ FINSERV
Project Funded By
HeroFinCorp.








* నేచురల్ ఆర్ట్

వృథా నుంచి ధగధగ...

కొబ్బరిచిప్ప... మామిడి ఆకు... కాదేది కళకు అనర్హం!

కొబ్బరి చిప్పలతో మ్యూజిక్ సిస్టమ్
పాత రికార్డ్ టేప్స్‌తో టిష్యూ స్టాండ్స్
మామిడి, రావి ఆకులతో ల్యాంప్స్
సొర, బీరకాయ పీచులతో ముచ్చటైన హ్యాంగింగ్స్...
ఇలా ఎన్నో వృథాగా పడేసే వస్తువులతో
18 ఏళ్లుగా అందమైన కళారూపాలకు ప్రాణం పోస్తూ
వాటితో ఉపాధి పొందుతున్నాడు జగదీష్.




పాత రికార్డ్ టేప్స్‌తో టిష్యూ స్టాండ్స్

కర్ణాటకలోని నందిహళ్ళి గ్రామవాసి అయిన జగదీష్ మరో పాతిక మంది మహిళలకు తన కళారూపాలతో శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నాడు. 'దేశవ్యాప్తంగా జరిగే ఎగ్జిబిషన్స్‌లో పాల్గొంటానని, అక్కడకు వచ్చిన జనం తనను, తన పనినీ ప్రోత్సహిస్తుంటారని ఆనందంగా తెలియజేసే జగదీష్ హైదరాబాద్‌లో గచ్చిబౌలిలోని నిధిమ్స్‌లో జరుగుతున్న దస్తకారీ హాత్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో తన జగ్గూసేస్ క్రియేటివ్ వర్క్స్ స్టాల్‌లో ఆకట్టుకునే కళారూపాలను ప్రదర్శనకు ఉంచాడు. జగదీష్ మాట్లాడుతూ ...


జగదీష్

''నా క్రాఫ్ట్స్ స్టూడియో బెంగళూరులో ఉంది. పేదరికంలో పుట్టి పెరిగాను. మా అమ్మానాన్నలకు తగిన ఆదాయం లేకపోవడంతో స్కూల్ వయసులోనే చదువును ఆపేయాల్సి వచ్చింది. 'ఏదైనా పని చేసుకొని బతకాలి, ఏం చేయాలి' అని ఎప్పుడూ ఆలోచించేవాడిని. చెట్టు కింద కూర్చున్నప్పుడు ఆ చెట్టే నాకు గురువు అయ్యింది. ఆ చెట్టు నుంచి రాలిన ఆకులపై పెయింట్స్ వేసేవాడిని. ఆ తర్వాత వాటితోనే అందమైన కళాకృతులను తయారుచేయడం మొదలుపెట్టాను. అలాగే, ఎండిన చెట్టు బెరడులను సేకరించి, వాటితోనూ సృజనాత్మక వస్తువులను చేయడం ఆరంభించాను.

ఆకులలో ఆత్మ...

రాలిన ఆకులు కూడా కొత్త అర్థం చెబుతాయనిపించేలా కళాకృతులను సృష్టించాలనుకున్నాను. అందుకోసం ఆకుల మీద అనేక విధాల ప్రయోగాలు చేశాను. ఇప్పుడంటే రకరకాల కెమికల్ పద్ధతులతో లీఫ్ ఆర్ట్స్ చేసే వారు పుట్టుకువస్తున్నారు. కానీ, ఇరవై ఏళ్ల క్రితం... కొన్ని రోజుల పాటు ఆకులను నీళ్లలో నానబెట్టి, పై పొరలన్నీ తొలగించి, అసలైన ఆత్మను బయటకు తీసేవాడిని. ఇందుకు రోజుల తరబడి సమయం పట్టేది. చేతులపై చర్మం దెబ్బతినేది. అన్నం కూడా తినలేకపోయేవాడిని. అయినా అవేమీ పట్టించుకునేవాడిని కాదు. ఆకుల మాదిరిగానే సొరకాయ, బీరకాయ పీచులను తయారు చేశాను. వీటితోనే ల్యాంపులు, డెకొరేటివ్ ఐటమ్స్ తయారు చేస్తూ వచ్చాను.

కాదేదీ కళకు అనర్హం...

చెట్లకొమ్మలు, బెరళ్లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి పీచు, ఉల్లి పొట్టు.. ఇలా ప్రతిదానినీ కళాత్మకమైన వస్తువులుగా మార్చడం మొదలుపెట్టాను. చెట్టు బెరళ్లను తెచ్చి, వాటికి గడియారం ముళ్లను బిగించి, అందమైన వాల్ క్లాక్‌ను తయారు చేశాను. కొబ్బరి చిప్పలతో తయారు చేసిన మ్యూజిక్ సిస్టమ్ చాలా మందిని ఆకట్టుకుంది. ఎండిపోయిన చెట్ల కొమ్మలకు ఆర్గానిక్ కలర్స్ వాడి, ఆకులతో పక్షులను చేసి ఇంటి ముందు అలంకరణ వస్తువుగా మార్చేశాను. నా దగ్గర రూ.150/- నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు ధర పలికే కళాత్మక వస్తువులు ఉన్నాయి. నాకై నేనుగా నేర్చుకున్న ఈ కళ ఇన్నేళ్లుగా నన్ను బతికించడమే కాదు మరికొందరికీ ఆదాయవనరుగా మారింది. నా కళాత్మక వస్తువులను ఇష్టపడేవారు 'జగ్గూసేస్ క్రియేటివ్ వర్క్' వెబ్‌సైట్ చూసి మీ ప్రోత్సాహాన్ని అందించవచ్చు. పర్యావరణహితంగా చేస్తున్న వస్తువుల తయారీకి గుర్తింపుగా స్టేట్ క్రాఫ్ట్ కౌన్సిల్ నుంచి అవార్డులూ అందుకున్నాను' అంటూ తన గురించి, చేస్తున్న సృజనాత్మక పని గురించి తెలియజేశారు జగదీష్.


కొబ్బరి చిప్పలతో మ్యూజిక్ సిస్టమ్

– నిర్మలారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

నులిపురుగులు చిన్న సమస్య కాదు.
అలాగని పెద్ద సమస్యా కాదు.
చిన్న పిల్లలను బాధించే చికాకు సమస్య.
ఆరోగ్యంగా పిల్లలు ఎదగాలంటే
ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ ఉండాలి.
మన దేశంలో 65 శాతం మంది చిన్నారులు
నులిపురుగులతో బాధ పడుతున్నారు.
పూర్వం అమ్మమ్మలు, నానమ్మలు
పిల్లల ప్రవర్తనలో మార్పు గమనించి
నులిపురుగుల మందు వేసే వారు.
ఇప్పుడు తల్లులకు వ్యవధి ఉండటం లేదు.
కాని తప్పదు జాగ్రత్త.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం


ప్రతీకాత్మక చిత్రం

చిన్ని బొజ్జలకు కావాలి ఈ రక్ష

నులిపురుగులు పిల్లలను బాగా ఇబ్బంది పెడతాయి. అవి కడుపులో ఉన్నాయంటే పిల్లలు మలద్వారం వద్ద దురద ఉందని చెబుతుంటారు. పదేపదే అక్కడ గీరుకునే ప్రయత్నం చేస్తారు. అలాగే ముక్కు ఎక్కువగా దురద పెడుతున్నా 'కడుపులో నులిపురుగులున్నాయేమో' అని పెద్దలు అనేవారు. ఇంతకు మునుపు పిల్లలు ఆరుబయలులో విసర్జన చేసేవారు కాబట్టి పెద్దలు నులిపురుగులు గమనించేవారు. ఇప్పుడు ఇళ్లల్లో టాయిలెట్లు వాడి ఫ్లష్ చేయడం వల్ల నులి పురుగులను గమనించే అవకాశం లేదు. పెద్దల కంటే పిల్లలకు నులి పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని గ్రహించాలి.

నులి పురుగులంటే?

నులి పురుగులు పేగుల్లో చేరి మన పోషకాలను దొంగిలించి తినే పరాన్న జీవులు. వీటివల్ల వచ్చే ఇన్ఫెక్షన్‌ని 'అస్కారియాసిస్' అంటారు, మన దేశంలోదాదాపు 85 శాతం మంది పిల్లల్లో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోందని ఆరోగ్య సంస్థలు ప్రకటించాయి. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలు కనిపిస్తాయి. ఆకలి మందగిస్తుంది. 'మా పిల్లవాడు ఇంతకు ముందు బాగా తినేవాడు ఇప్పుడు తినడం లేదు' అని తల్లులు కంప్లయింట్ చేస్తారు. పిల్లల ఎదుగుదల దెబ్బతింటుంది. కొందరు పిల్లలు నులిపురుగుల వల్ల సరిగా నిద్రపోలేక ఇబ్బంది పడతారు.

ఎలా ప్రవేశిస్తాయి?

చిన్నపిల్లలు మట్టిలో ఆడుకోవడం సర్వ సాధారణం. మట్టిలో ఆడుకొని చేతులు శుభ్రం చేసుకోకుండా తింటే నోటి ద్వారా పొట్ట, పేగుల్లోకి నులి పురుగులు ప్రవేశిస్తాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, కాళ్లకు చెప్పులు వేసుకోకుండా తిరగడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం, దుమ్ము ధూళి చేరిన కలుషిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల నులిపురుగుల సమస్య తలెత్తవచ్చు.

ఏం చేయాలి?

ప్రధానంగా చిన్నపిల్లల చేతి గోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. గోళ్లు కొరికే అలవాటును మాన్పించాలి. ప్రతిరోజూ వేడి చేసి చల్లార్చిన మంచినీటిని మాత్రమే తాగించాలి. వైద్యుల సలహాతో అల్బెండజోల్ మాత్రలు వాడాలి. ప్రకృతి వైద్యంలో ఎనిమా ద్వారా కూడా ఈ నులి పురుగుల బెడద తొలగిస్తారు. కొన్ని సులువైన చిట్కాల ద్వారా కూడా నులిపురుగుల సమస్యను అధిగమించవచ్చు. వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉండటం వల్ల నులిపురుగులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రెండు వెల్లుల్లి రెబ్బలను బాగా దంచి ఆ రసంలో గ్లాసు నీటిని కలిపి తాగించడం ద్వారా కడుపులో నులిపురుగులను నివారించవచ్చు. రెండు లవంగాలను ఒక గ్లాసు నీటిలో వేసి ఆ నీటిని తాగించడం వల్ల కడుపులో నులి పురుగులను నివారించవచ్చు. బొప్పాయి పండును తినిపించడం, సన్నగా ఉండే ఆవాలను వేయించి పొడిచేసి మజ్జిగలో కలిపి తాగించడం వంటి వాటి ద్వారా నులిపురుగుల బెడదను అధిగమించేలా చేయవచ్చు. అన్నింటికీ మించి వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయడం అవసరం.

బ్యూటిప్స్

మెరిసే ముఖానికి...



- అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి మిక్స్ చేయండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. కీరాదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. ఇది ముడతలు, సన్నని గీతలు వంటి సమస్యలు దూరం అవుతాయి.
- ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్లు పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను బాగా కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే.. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి ముఖ చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది.
- పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. ఉడికిన తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని బాగా ఆరనివ్వాలి. తర్వాత మైల్డ్ క్లెన్సర్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.



- రెండు టీస్పూన్ల వేప పొడి, ఒక స్పూన్ నిమ్మరసం తీసుకోండి. వీటిని మెత్తగా చేసి ముఖం, మెడ భాగాలల్లో రాయాలి. పావు గంట తర్వాత చల్లటి నీటితో వలయాకారంలో ముఖాన్ని రుద్దుతూ శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే ముఖం కాంతిమంతంగా మెరుస్తుంది.



ఎర్న్-లెర్న్ అండ్ గ్రో

సామాన్య మహిళలే ఏఐ 'కార్య'కర్తలు

మసాలా దినుసులు, ఎండు మిరపకాయలను గ్రైండింగ్ చేసే చిన్నపాటి వ్యాపారం చేస్తున్న పుణెకు చెందిన 53 సంవత్సరాల బేబి రాజారామ్ బొకాలే నోటి నుంచి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించిన విషయాలు, విశేషాలు వినిపిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మోడల్స్‌కు తన గొంతును అరువు ఇస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తుంటుంది బేబి. పర్సనల్ ఫైనాన్స్ నుంచి ఫ్రాడ్ జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పే ఎన్నో విషయాల వరకు మరాఠీలో చెబుతుంది...


బేబి రాజారామ్ బొకాలే


ఏఐ మోడల్స్‌కి మరాఠీ

భారత పర్యటనకు వచ్చిన మైక్రోసాఫ్ట్ సీయీవో సత్య నాదెళ్ల సోషల్ ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ 'కార్య' టీమ్‌లాంటి చేంజ్‌మేకర్స్‌తో కలిసి పని చేయడానికి ఉత్సాహం చూపారు. 'కార్య'కు సంస్కృతంలో 'మీకు గౌరవాన్ని ఇచ్చే పని' అనే అర్థం ఉంది. 2017లో బెంగళూరు కేంద్రంగా మైక్రోసాఫ్ట్ రిసెర్చి ప్రాజెక్ట్‌గా మొదలైన కార్య 'ఎర్న్, లెర్న్ అండ్ గ్రో' అనే నినాదంతో ముందుకు వెళుతోంది. కృత్రిమ మేధ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి, పరిశోధనల కోసం అనేక భారతీయ భాషలలో డేటాసెట్లను క్రియేట్ చేస్తోంది.

'ఎన్నో లక్షల మంది మరాఠీ మాట్లాడుతున్నప్పటికీ డిజిటల్ ప్రపంచంలో ఆ భాషకు సముచిత ప్రాధాన్యత లేదు' అంటున్న 'కార్య' నిర్వాహకులు మరాఠీపైనే కాదు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉన్న ఎన్నో భాషలపై దృష్టి పెడుతున్నారు. నైపుణ్యాలను (స్కిల్స్) వాడుకోవడంతోపాటు పేదరికాన్ని దూరం చేయడానికి, డిజిటల్ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. బేబీ రాజారామ్ బొకాలేలాంటి సామాన్య మహిళలే ఇందుకు ఉదాహరణ.

పగటిపూట తన పనులన్నీ పూర్తయ్యాక ఏఐ మోడల్స్ కోసం తన మాతృభాష మరాఠీలో స్టోరీలు చదువుతుంది బొకాలే. బ్యాంకింగ్, సేవింగ్స్, ఫ్రాడ్ ప్రివెన్షన్లకు సంబంధించిన ఈ స్టోరీలను ఇన్‌ఫర్‌మేటివ్, ఎంటర్‌టైనింగ్ విధానంలో రూపొందించారు.

'నా వాయిస్ రికార్డు అవుతున్నందుకు గర్వంగా ఉంది. స్టోరీ చదువుతున్నప్పుడు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. కష్టపడి సంపాదించిన డబ్బు ఖర్చు చేయడం తప్ప పొదుపు చేయడం అనే అలవాటు చాలా మందిలో ఉండదు. పొదుపు అలవాటును ఒక కథ నొక్కి చెబుతుంది' అంటున్న బొకాలే తన డిజిటల్ అక్షరాస్యతను కూడా పెంచుకుంటోంది. ఏఐ టెక్నాలజీకి సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తన స్మార్ట్ ఫోన్ ద్వారా తెలుసుకుంటుంది.

'మరాఠీలో ఏఐ టూల్స్ అందుబాటులోకి వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అంటుంది బొకాలే. మొత్తం పదకొండు రోజులలో ఆమె చేసిన అయిదు గంటల పనికి రెండువేల రూపాయలు అందుకుంది.

వాయిస్ అరువు ఇచ్చినందుకు వచ్చిన డబ్బులను గ్రైండర్ రిపేరింగ్ కోసం ఉపయోగించింది.

పొదుపు మంత్రం


ఈ ఫొటోలో ఉన్న వారు (ఎడమ నుంచి) పార్వతీ కెంబ్లే, సురేఖ గైక్వాడ్, బేబీ రాజారామ్ బొకాలే. గతంలో ఈ ముగ్గురు ఒకచోట కూర్చుంటే ఏం మాట్లాడుకునేవారో తెలియదుగానీ ఇప్పుడు మాత్రం పొదుపు, వ్యాపారం లాంటి విషయాల గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. వీరి సెల్ఫ్–హెల్ప్ బ్యాంకింగ్ గ్రూప్ ఎంతో మంది మహిళల్లో పొదుపు అలవాట్లను పెంచుతోంది. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునేలా చేస్తోంది.

'సమయం రాత్రి 10.30 గంటలు. ఒక మూలన రంగురంగుల వెలుగులతో మెరిసిపోతున్న కృష్ణుడి మందిరం ఉన్న చిత్రం కనిపిస్తోంది. మంచంపై కూర్చున్న ఆమె తన స్మార్ట్ ఫోన్‌లో ఒక యాప్ ఓపెన్ చేసి స్పష్టమైన, ప్రతిధ్వనించే గొంతుతో ఒక కథను బిగ్గరగా చదవడం మొదలుపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌కు మరాఠీలో ట్రెనింగ్ ఇచ్చేందుకు బొకాలే గొంతును ఉపయోగించుకుంటున్నారు' అంటూ తన బ్లాగ్‌లో రాసింది మైక్రోసాఫ్ట్.

'ఇలాంటి పని ఒకటి చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు' నవ్వుతూ అంటుంది బొకాలే. కాలేజీ పిల్లల నోటి నుంచి 'ఏఐ' అనే మాట వినడం తప్ప దానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌లో భాగం అవుతానని ఆమె ఊహించలేదు.

పుణెలోని ఖారద్ ఏరియాలో చుట్టపక్కల వారు బొకాలేను 'బేబీ అక్కా' అని ప్రేమగా పిలుస్తారు. సెల్ఫ్–హెల్ప్ బ్యాంకింగ్ గ్రూప్ మొదలు పెట్టి మహిళలలో పొదుపు అలవాట్లు పెంపొందిస్తుంది బొకాలే. తాము దాచుకున్న పొదుపు మొత్తాలతో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించిన మహిళలు ఎందరో ఉన్నారు.

51 సంవత్సరాల సురేఖ గైక్వాడ్ కూడా 'కార్య' కోసం మరాఠీ విషయంలో బేబీలాగే పనిచేస్తుంది. చిన్నపాటి కిరాణా దుకాణం నడుతున్న సురేఖ 'ఈ పని నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది' అంటుంది. బ్యాంకులో డబ్బు ఎలా డిపాజిట్ చేయాలి, ఎలా డ్రా చేయాలి... వంటి వాటి నుంచి కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత వల్ల కలిగే ఉపయోగాల వరకు ఎన్నో విషయాలు తెలుసుకుంది. పొదుపుపై దృష్టి పెట్టింది సురేఖ.

55 సంవత్సరాల మీనా జాదవ్ కూడా 'కార్య' కోసం పనిచేస్తోంది. తనకు వచ్చిన డబ్బును టైలరింగ్ బిజినెస్‌కు అవసరమైన మెటీరియల్ కొనడానికి ఉపయోగించింది. ఇప్పుడు మీనా సేవింగ్ ఎకౌంట్‌ను ఉపయోగిస్తుంది. ఏటీయం ను ఎలా ఉపయోగించాలో తెలుసుకుంది.

మరో మహిళ తాను సంపాదించిన డబ్బును కుమార్తె చదువుకు సంబంధించి పొదుపు ఖాతా ప్రారంభించడానికి ఉపయోగించింది. వీరందరు తమ పనిని ఆస్వాదించడమే కాదు ఫైనాన్షియల్ ప్లానింగ్, ఆన్‌లైన్ టూల్స్ ఉపయోగం, ఎలా ఉపయోగించాలి, స్మార్ట్‌ఫోన్ ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించుకోవాలో తెలుసుకున్నారు.

'అన్ని కమ్యూనిటీలు భాగం కావడమే కార్య విజయానికి కారణం. 'కార్య'కర్తలలో మహిళలే ఎక్కువ. ఈ పని వల్ల నాకు ఎంత డబ్బు వస్తుంది అనేదాని కంటే ఈ పని చేయడం వల్ల నాకు, నా కుటుంబానికి చెడ్డ పేరు రాదు కదా! అనేది ఎక్కువ మంది మహిళల నుంచి వచ్చే ప్రశ్న' అంటుంది మైక్రోసాఫ్ట్ రిసెర్చర్ కాళిక బాలి.

పైలట్ ప్రాజెక్ట్‌లో భాగమైన కొద్దిమంది మహిళలకు మొదట్లో స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించాలి అనేది బొత్తిగా తెలియదు. అలాంటి వారు కుటుంబ సభ్యులు, బంధువులు ఆశ్చర్యపడేలా స్మార్ట్‌ఫోన్‌ను అద్భుతంగా ఉపయోగిస్తున్నారు. స్థూలంగా చెప్పాలంటే వారి ప్రగతి ప్రయాణంలో ఇది తొలి అడుగు మాత్రమే.

జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలకు రండి

గవర్నర్‌ను ఆహ్వానించిన దేవస్థానం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 14న జరగనున్న జోగుళాంబ దేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని జోగుళాంబ దేవస్థానం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆహ్వానించింది. ఈ మేరకు శుక్రవారం రాజ్‌భవన్‌లో ఆలయ ఈవో పురంధర్ కుమార్, ప్రధానార్చకుడు ఆనంద్ శర్మ, చైర్మన్ చిన్న కృష్ణయ్య, జోగుళాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గవర్నర్‌ను కలిశారు. ఆమెకు అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా ఒకసారి మాత్రమే జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఆ రోజు అమ్మవారిని దర్శించుకోవడం మహాభాగ్యమని తెలిపారు.


మహా పూజలు అందుకున్న నాగోబా

- ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో గిరిజన జాతర మొదలు

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఏడు పడగల శేషనాగుడు 'నాగోబా'మహా పూజలు అందుకున్నాడు. మెస్రం వంశీయులు తమ ఆరాధ్య దైవాన్ని నిండు మనసుతో కొలిచారు. తొలుత గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో ఆలయాన్ని, నాగోబాను శుద్ధిచేశారు. పుష్యమి అమావాస్య అయిన శుక్రవారం రాత్రి 10గంటల తర్వాత తాము తరతరాలుగా పాటిస్తున్న ప్రత్యేక పద్ధతుల్లో పూజలు చేశారు. కేస్లాపూర్‌లో నాగోబా జాతర సందడి మొదలైంది.

సంప్రదాయ పద్ధతుల్లో పూజలు..

తెల్లని దుస్తులు ధరించిన మెస్రం వంశీయులు శుక్రవారం ఉదయం నుంచే సంప్రదాయ వాయిద్యాల మధ్య నాగోబా ఆలయం వద్దకు చేరుకున్నారు. తర్వాత 22 కితలకు చెందిన మెస్రం వంశీయుల మహిళలు, ఆడ పడుచులు పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. పెద్దలు వారికి కొత్త కుండలను అందజేయగా.. వారు కోనేరు వద్దకు వెళ్లి ఆ కుండల్లో పవిత్ర జలాన్ని తీసుకుని వచ్చారు. వంశంలోని అల్లుళ్లు పాత పుట్టలను తొలగించగా.. మహిళలు, ఆడపడుచులు కొత్త పుట్టలను తయారు చేశారు. తర్వాత పూజలను ప్రారంభించారు. రాత్రి మహా పూజలు ముగిశాక.. మెస్రం వంశ కొత్త కోడళ్ల పరిచయం (భేటింగ్) నిర్వహించారు. అనంతరం కొత్త కోడళ్లు నాగోబాను దర్శించుకున్నారు. ఇక్కడి ఆచారం ప్రకారం.. పెళ్లయి ఎన్నేళ్లయినా సరే, భేటింగ్‌లో పాల్గొన్నాకే కొత్త కోడళ్లకు నాగోబాను దర్శించుకునే అవకాశం ఉంటుంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్ రాజ్ నాగోబాను సందర్శించుకున్నారు.



కేస్లాపూర్ నాగోబా ఆలయంలో హారతి ఇస్తున్న మెస్రం వంశీయులు

త్వరలో పూర్తిస్థాయి టీజీవో అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: గత తెలంగాణ గెజిటెట్ అసోసియేషన్ కాల పరిమితి ముగిసినందున ఆ కమిటీ రద్దయిందని, త్వరలో పూర్తి స్థాయి అసోసియేషన్‌ను ప్రకటించుకుంటామని టీజీవో కేంద్ర సంఘం నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, బి.శ్యామ్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. దీనిపై తదుపరి పూర్తి స్థాయి జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేస్తామని, 33 జిల్లాల్లో బ్రాంచ్‌లు, రెండు స్పెషల్ బ్రాంచ్‌లు (హైదరాబాద్, సచివాలయం), 57 డిపార్ట్‌మెంట్ ఫోరమ్స్, కేంద్ర కమిటీని కూడా సభ్యత్వాల సంఖ్యకు అనుగుణంగా ఆఫీస్ బేరర్స్‌ను పెంచుకుంటామని తెలిపారు. గతంలో చేసిన సభ్యత్వ నమోదు కాలపరిమితి ముగిసినందున దాన్ని పరిగణలోకి తీసుకోబోమని, కొత్త సభ్యత్వం ద్వారా నూతన సభ్యత్వ నమోదు కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ పరిపాలనా విభాగం నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించనున్నారని, మరో రెండ్రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు చెప్పారు.

రాజకీయ పార్టీతో వణుకు పుట్టిస్తాం

- బీసీలకు మద్దతు ఇవ్వకపోతే రాళ్లతో కొడతాం
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికోసం చేస్తున్న ఉద్యమానికి రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వకపోతే రాళ్లతో కొట్టేందుకు కూడా వెనకడుగు వేయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఇకపై తాము శాంతియుతమైన ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేయమన్నారు. తమకు రాయితీలు వద్దని, రాయితీల కోసం బీసీలు రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. త్వరలో బీసీలంతా కలసి ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి ప్రస్తుత రాజకీయ పార్టీలకు వెన్నులో వణుకు పుట్టిస్తామని హెచ్చరించారు. బీసీల డిమాండ్లపై శుక్రవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియాలో 'జాతీయ ఓబీసీ సదస్సు'ను నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. బీసీలను కేవలం ఓట్ల కోసం, జిందాబాద్‌ల కోసం వాడుకుంటూ రిజర్వేషన్లలో కరివేపాకులా తీసేస్తున్నారని మండిపడ్డారు. 'రెండు రోజుల క్రితం దేశంలో పశువుల గణన చేసేందుకు కేంద్రం సిద్ధంపడింది.. అంటే, పశువుల కంటే బీసీలం అంత హీనులగా కనిపిస్తున్నామా'అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఉన్న 27 రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీల బస్ యాత్రను నిర్వహిస్తామన్నారు. కాగా, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయపరమైన డిమాండ్ అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. బీసీలు తలుచుకుంటే ఏదైనా చేయగలరనే సంకేతాన్ని ప్రస్తుత రాజకీయ పార్టీలకు పంపాలని ఎంపీ కేశవరావు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జాజుల, చిత్రంలో కేశవరావు

రియల్టీ వార్తలు

నిర్మాణంలో నాణ్యత గడువులోగా అప్పగింత!

- శ్రీకల్ప బిల్డర్స్ లక్ష్యమిదే
- ప్రగతినగర్‌లో లగ్జరీ ప్రీమియం ప్రాజెక్ట్
- 14 అంతస్తులలో 296 ఫ్లాట్ల నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఓరుగంటి వెంకటేశ్వర్లు రెడ్డికి 35కు పైగా రాష్ట్ర ప్రభుత్వ సివిల్ ప్రాజెక్ట్‌లలో పనిచేసిన అనుభవం ఉంది. రాజమండ్రి వద్ద గోదావరి నదిపై డీ-బ్రిడ్జ్ నిర్మాణంలో ఈయన పాత్ర కీలకం. ఇదే ఒరవడిని గృహ నిర్మాణ ప్రాజెక్ట్‌లను నిర్మించాలనేది ఆయన లక్ష్యించారు. ఈయన విజన్‌కు తగ్గట్టుగా విదేశాలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లయిన ఓబుల్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, దామోదరం మాధవనేనిలు జతయ్యారు. పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు తిరిగొచ్చి నిర్మాణ రంగంలో సాంకేతికతను జోడించారు. దీంతో శ్రీకల్ప బిల్డర్స్ అంటే నిర్మాణంలో నాణ్యత, గడువులోగా అప్పగింత అనే బ్రాండ్‌గా ఎదిగిపోయింది.

- బాచుపల్లిలో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ప్రిస్టిన్ పేరుతో 216 ఫ్లాట్లను నిర్మించి కొనుగోలుదారులకు అప్పగించాం. ప్రస్తుతం ప్రగతినగర్‌లో లక్సర్ ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీని నిర్మిస్తున్నాం. 2.05 ఎకరాలలో 14 అంతస్తులలో ఉంటుంది. మొత్తం 296 యూనిట్లుంటాయి. 1204 చ.అ. నుంచి 1898 చ.అ. మధ్య 2 బీహెచ్‌కే, 3 బీహెచ్‌కే ఫ్లాట్లుంటాయి. ధర చ.అ.కు రూ.5,699.
- 13 వేల చ.అ.లలో క్లబ్ హౌస్ ఉంటుంది. బాంక్వెట్ హాల్, జిమ్, స్పా, లైబ్రరీ, యోగా రూమ్, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ యాంపి థియేటర్, జాగింగ్, వాకింగ్ ట్రాక్ వంటి అన్ని రకాల వసతులుంటాయి. వృద్ధుల కోసం బుద్ధుడి విగ్రహంతో ప్రత్యేకంగా పార్క్ స్థలం కేటాయించాం. ప్రస్తుతం 8వ అంతస్తు శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుంది. మల్లంపేట ఓఆర్ఆర్ సమీపంలో 2 ఎకరాలలో విల్లా ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నాం. 6-8 నెలలో ప్రాజెక్ట్ ప్రారంభవుతుంది.

విశాలమైన ఇళ్లు

- హైదరాబాద్‌లోనే ఇళ్ల విస్తీర్ణాలు ఎక్కువ
- ఇక్కడ సగటు అపార్ట్‌మెంట్లు 2,300 చ.అ.
- గతేడాది దేశంలో ఫ్లాట్ల సైజు 11% వృద్ధి

సాక్షి, హైదరాబాద్: జనజీవనం సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ, నివాస గృహాల ధరలు పెరుగుతున్నప్పటికీ విస్తీర్ణమైన ఇళ్లకు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది కొత్తగా ప్రారంభమైన లక్ష గృహాలలో 23 శాతం లగ్జరీ కేటగిరీ విభాగానికి చెందినవేనని, పెద్ద ఇళ్లకు డిమాండ్ కొనసాగుతుందనడానికి ఇదే నిదర్శనమని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.

- గతేడాది దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో సగటున ఫ్లాట్ సైజ్‌లు 11 శాతం మేర పెరిగాయి. 2022లో 1,175 చ.అ.గా ఉన్న అపార్ట్‌మెంట్ల విస్తీర్ణాలు 2023 నాటికి 1,300 చ.అ.లకు పెరిగాయి. ఐదేళ్ల కాలంతో చూస్తే 2019లో 1,050 చ.అ.లుగా ఉన్న ఫ్లాట్ల సైజులు 2023 నాటికి 24 శాతం మేర పెరిగి, 1,300 చ.అ.లకు చేరాయి. అత్యధికంగా ఎన్‌సీఆర్‌లో అపార్ట్‌మెంట్ సైజులు పెరిగాయి. ఇక్కడ 2022లో 1,375 చ.అ.లుగా ఉన్న ఫ్లాట్ల విస్తీర్ణం... 2023 నాటికి 37 శాతం మేర పెరిగి 1,890 చ.అ.కు చేరాయి. ఇతర దక్షిణాది నగరాలైన బెంగళూరులో ఫ్లాట్ల విస్తీర్ణాలు 1,484 చ.అ.లు, చెన్నైలో 1,260 చ.అ.లుగా ఉన్నాయి. పుణేలో అపార్ట్‌మెంట్ పరిమాణం 1,086 చ.అ.

హైదరాబాద్‌లోనే పెద్ద ఇళ్లు..

దేశంలోని ఏడు ప్రధాన నగరాలతో పోలిస్తే ఫ్లాట్ల విస్తీర్ణాలు అత్యధికంగా ఉన్న నగరం హైదరాబాదే. ఇక్కడ అపార్ట్‌మెంట్ల సైజు సగటున 2,300 చ.అ.లుగా ఉంది. అంతకుక్రితం ఏడాదితో పోలిస్తే 2023లో నగరంలో ఫ్లాట్ పరిమాణం 30 శాతం మేర పెరిగింది. 2022లో భాగ్యనగరంలో 1,775 చ.అ.లుగా ఉన్న సగటు యూనిట్ సైజ్‌లు 2023 నాటికి 2,300లకు చేరాయి.



ముంబై, కోల్‌కతాలో క్షీణత..


ముంబై, కోల్‌కతా నగరాలలో మాత్రమే ఫ్లాట్ల విస్తీర్ణాలు తగ్గుతూ వస్తున్నాయి. 2022లో ముంబైలో 840 చ.అ.లుగా ఉన్న అపార్ట్‌మెంట్ సైజు.. 2023 నాటికి 5 శాతం తగ్గి, 794 చ.అ.లకు చేరింది. అయితే ఐదేళ్ల కాలంతో పోలిస్తే మాత్రం ఇక్కడ సగటు ఫ్లాట్ విస్తీర్ణాలు సమానంగా ఉన్నాయి. కోల్‌కతాలో 1,150 చ.అ.ల నుంచి 2 శాతం తగ్గి 1,124 చ.అ.లకు క్షీణించాయి. కానీ, ఐదేళ్ల కాలంతో చూస్తే మాత్రం అపార్ట్‌మెంట్ సైజులు 12 %పెరిగాయి. 2019లో కోల్‌కతాలో ఫ్లాట్ల పరిమాణం 1,000 చ.అ.

అనరాక్‌కు రూ.200 కోట్ల ఫండింగ్

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అనరాక్ గ్రూప్ రూ.200 కోట్ల నిధులను సమీకరించింది. 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఈ పెట్టుబడులను పెట్టినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిధులను సాంకేతిక మౌలిక వసతుల కల్పన, వ్యాపారాభివృద్ధి కోసం వెచ్చిస్తామని కంపెనీ చైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దేశీయ రియల్ ఎస్టేట్ వాటా 7 శాతంగా ఉందని, 2025 నాటికి 10-13 శాతానికి పెరుగుతుందని ఆయన అంచనా వేశారు.

బాచుపల్లి జంక్షన్‌లో షాపింగ్ మాల్ అండ్ మల్టీప్లెక్స్

సాక్షి, హైదరాబాద్: బాచుపల్లి అభివృద్ధి అవకాశాలను ముందుగా గుర్తించింది ప్రణీత్ గ్రూప్ అనే చెప్పాలి. దాదాపు రెండు దశాబ్దాల క్రితమే ఈ ప్రాంతంలో తొలి ప్రాజెక్ట్‌ను నిర్మించిన ఈ సంస్థ రికార్డ్ సమయంలో విక్రయించి, కొనుగోలుదారులకు అప్పగించింది. ఇప్పటివరకు ప్రణీత్ గ్రూప్ బాచుపల్లి, దుండిగల్ ప్రాంతాలలో 10 విల్లాలు, అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసింది. సుమారు 3 వేల గృహాలను కొనుగోలుదారులకు అప్పగించింది. ఈ ఏడాది మరో 2 వేల అపార్ట్‌మెంట్లు, 1,500 విల్లాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు సంస్థ ఎండీ నరేంద్రకుమార్ కామరాజు తెలిపారు. తొలిసారిగా ప్రణీత్ గ్రూప్ మాల్ అండ్ మల్టీప్లెక్స్ విభాగంలోకి అడుగుపెట్టనుంది. బాచుపల్లి జంక్షన్‌లో 5 ఎకరాలలో అతిపెద్ద షాపింగ్ మాల్ అండ్ మల్టీప్లెక్స్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తుంది. బౌరంపేటలో 150 ఎకరాలలో అతి పెద్ద టౌన్‌షిప్‌ను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో నివాస, వాణిజ్య సముదాయాలతో పాటు స్కూల్, హాస్పిటల్, కన్వెన్షన్ సెంటర్ వంటివన్నీ ఉంటాయి.



రైతాంగ సంక్షేమ చర్యలకు ఆద్యుడు

ఎన్నెన్నో రైతు అనుకూల చట్టాలు తీసుకొచ్చిన చరణ్ సింగ్ రైతు బాంధవుడిగా గుర్తింపు పొందారు. కన్సాలిడేషన్ ఆఫ్ హెల్డింగ్స్ యాక్ట్ ఆఫ్ 1953, ఉత్తరప్రదేశ్ జమీందారీ, భూసంస్కరణ చట్టం-1952ని తీసుకొచ్చారు. దీని వల్ల ఉత్తరప్రదేశ్‌లో జమీందారీ వ్యవస్థ రద్దయ్యింది. చరణ్ సింగ్ ప్రతిపాదించిన అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ బిల్లు 1964లో ఆమోదం పొందింది. దీంతో రైతులకు మార్కెట్ లింకేజీ మెరుగైంది. ఆయన చేపట్టిన భూసంస్కరణలో చిన్న రైతులు ఎంతగానో లబ్ధి పొందారు. భూమి లేనివారికి భూములపై హక్కులు లభించాయి. రైతులకు సామాజిక, ఆర్థిక ప్రగతికి ఈ సంస్కరణలు దోహదపడ్డాయి. 1966, 1967లో ఉత్తరప్రదేశ్‌లో కరువు తాండవించింది. దాంతో రైతుల నుంచి అధిక ధరలకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి, లబ్ధి చేకూర్చారు. చరణ్ సింగ్ ప్రారంభించిన చర్యల వల్లనే పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) విధానం ప్రారంభమైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రైతు బాంధవుడు

అన్నదాతల హక్కుల కోసం చరణ్ సింగ్ పోరాటం

- వారి సంక్షేమం, సాధికారతే ధ్యేయంగా చట్టాలకు రూపకల్పన
- ఉత్తరాదిన తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా రికార్డు
- 23 రోజులపాటు దేశ ప్రధానమంత్రిగా సేవలు
- ప్రతిఏటా 'కిసాన్ దివస్'గా చరణ్ సింగ్ జయంతి

చౌదరీ చరణ్‌సింగ్. రైతన్నల హక్కుల కోసం పోరాడి వారి ఆత్మబంధువుగా పేరు పొందిన దివంగత ప్రధానమంత్రి. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అవలంబించిన సోషలిస్టు ఆర్థిక విధానాలను ఆయన వ్యతిరేకించారు. అయితే తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలుత కాంగ్రెస్‌లోనే పనిచేశారు. 1960వ దశకంలో ఆ పార్టీ నుంచి బయటికొచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికై ఉత్తర భారతదేశంలో తొలి కాంగ్రెసేతర సీఎంగా రికార్డుకెక్కారు. రెండుసార్లు యూపీ సీఎంగా, ఒకసారి ప్రధానిగా సేవలందించారు. కేంద్రంలో మొరార్జీ దేశాయ్ తర్వాత ప్రధాని పదవి చేపట్టిన రెండో కాంగ్రెసేతర నాయకుడు చరణ్‌సింగ్ కావడం విశేషం.

- చరణ్‌సింగ్ 1902 డిసెంబర్ 23న ఉత్తరప్రదేశ్‌లో మీరట్ జిల్లా నూర్పూర్ గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు నేత్రా కౌర్, చౌదరీ మీర్‌సింగ్.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య అభ్యసించారు. తర్వాత మీరట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు.
- 1923లో ఆగ్రా కాలేజీలో సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చదివారు. ఆగ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ(హిస్టరీ) పూర్తిచేశారు. 1927లో ఎల్ఎల్‌బీ పట్టా సాధించారు. ఘజియాబాద్‌లో అడ్వొకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు.
- ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి బోధనలతో చరణ్‌సింగ్ ప్రభావితులయ్యారు. మహాత్మా గాంధీ, వల్లభ్‌బాయ్ పటేల్ వంటి నాయకుల నుంచి స్ఫూర్తిని పొందారు. భారత స్వాతంత్య్ర పోరాటంలో అడుగుపెట్టారు. పలుమార్లు అరెస్టై జీవితం అనుభవించారు. ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆర్నెల్లు జైల్లో ఉన్నారు. 1940లో మరో కేసులో ఏడాది జైలుశిక్ష పడింది. 1942లో మళ్లీ అరెస్టయ్యారు.
- స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొంటూనే మరో వైపు ఉత్తరాదిన యునైటెడ్ ప్రావిన్సెస్ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.
- 1937లో తొలిసారిగా యునైటెడ్ ప్రావిన్సెస్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మీరట్ జిల్లాలోని చాప్రౌలీ నుంచి గెలిచారు. 1946, 1952, 1962, 1967లోనూ విజయం సాధించారు.
- 1946లో యునైటెడ్ ప్రావిన్సెస్ ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ ప్రభుత్వంలో పార్లమెంటరీ కార్యదర్శిగా చరణ్ సింగ్ పని చేశారు.
- 1951లో మొదటిసారి కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయ శాఖ, సమాచార శాఖ, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలందించారు.
- 1967 ఏప్రిల్ 1న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. రెండు రోజుల తర్వాత సంయుక్త విధాయక్ దళ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 1970 ఫిబ్రవరిలో రెండోసారి యూపీ సీఎంగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం అక్టోబర్ 2న యూపీలో రాష్ట్రపతి పాలన విధించడంలో చరణ్ సింగ్ రాజీనామా చేశారు.
- ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలోనూ చరణ్‌సింగ్ పాల్గొన్నారు. 1975 జూన్ 26న అరెస్టయ్యారు.
- తన సొంత పార్టీ భారతీయ లోక్‌దళ్‌ను జనతా పార్టీలో విలీనం చేశారు. జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన చరణ్ సింగ్ 1977లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- జనతా ప్రభుత్వంలో కేంద్ర హోం మంత్రిగా చేశారు. 1979 జనవరిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అయ్యారు. తర్వాత ఉప ప్రధానిగా పదోన్నతి పొందారు.
- జనతా పార్టీ చీలిక చరణ్ సింగ్‌కు కలిసివచ్చింది. కాంగ్రెస్ మద్దతుతో 1979 జూలై 28న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆగస్టు 20 దాకా కేవలం 23 రోజులే పదవిలో కొనసాగారు. ఆగస్టు 21 నుంచి 1980 జనవరి 14 దాకా ఆపద్ధర్మ ప్రధానిగా వ్యవహరించారు.
- గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చరణ్‌సింగ్ ఎంతగానో చొరవ చూపారు. 'నాబార్డ్'వంటి సంస్థల ఏర్పాటులో ఆయనదే కీలక పాత్ర.
- భారత ఆర్థిక శాస్త్రం, దేశ వ్యవసాయ రంగం, భూసంస్కరణలు, పేదరిక నిర్మూలనపై పలు పుస్తకాలు రాశారు.
- 1987 మే 29న 84 ఏళ్ల వయసులో చరణ్‌సింగ్ తుదిశ్వాస విడిచారు. ఆయన జయంతి డిసెంబర్ 23ను ఏటా 'కిసాన్ దివస్'గా పాటిస్తున్నారు.


హరిత విప్లవ సారథి



దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఎంఎస్ స్వామినాథన్

- ప్రజలందరికీ పౌష్టికాహారం, ఆహార భద్రతే ధ్యేయంగా పరిశోధనలు
- సాగులో నూతన వంగడాలు, ఆధునిక విధానాలకు శ్రీకారం
- కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు

మాన్‌కొంబు సదాశివన్ స్వామినాథన్.. సరిపడా పంటల ఉత్పత్తి లేక ఆకలితో అలమటిస్తున్న మన దేశానికి అన్నం పెట్టిన అరుదైన శాస్త్రవేత్త. హరిత విప్లవ పితామహుడికి కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారం ప్రకటించింది. దేశం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకొనే స్థాయి నుంచి పంటల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించి, ఇప్పుడు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందంటే అదంతా ఎంఎస్ స్వామినాథన్ చలవే అని చెప్పడం అతిశయోక్తి కాదు. హరిత విప్లవం, నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ విధానాలతో దేశాన్ని అన్నపూర్ణగా మార్చారు. తన జీవితాన్ని హరిత విప్లవానికే అంకితం చేశారు. ప్రజలందరికీ పౌష్టికాహారం అందించాలని, ఆహార భద్రత కల్పించాలని అహర్నిశలూ తపించారు. ప్రపంచ ఆహార వ్యవస్థల స్థిరీకరణకు తన వంతు తోడ్పాటునందించారు. తన పరిశోధనల ద్వారా కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు.




ల్యాబ్‌లో స్వామినాథన్ (ఫైల్)

- ఎంఎస్ స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పార్వతీ థంగమ్మై, డాక్టర్ ఎం.కె.సాంబశివన్.
- 15 ఏళ్ల నిండకుండానే తండ్రి మరణించడంతో తమ కుటుంబం ఆధ్వర్యంలోని ఆసుపత్రిని నిర్వహించడానికి వైద్య విద్య అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. మెడిసిన్‌లో చేరారు.
- విద్యార్థిగా ఉన్నప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కరువు పరిస్థితులను చూసి చలించిపోయారు. ఆకలితో ఎవరూ చనిపోయే పరిస్థితి రాకూడదని భావించారు.
- వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి కోయంబత్తూరులోని వ్యవసాయ కళాశాలలో చేరారు.
- పీజీ పూర్తయ్యాక సివిల్ సర్వీసు పరీక్ష రాశారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ, అటువైపు మొగ్గు చూపకుండా హాలెండ్‌లో వ్యవసాయ శాస్త్రంలో ఉన్నత విద్య అభ్యసించారు. బంగాళదుంప జన్యు పరిణామంపై పరిశోధనలు సాగించారు. తర్వాత కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ చేశారు.
- 1954లో ఒడిశాలోని కేంద్ర వరి పరిశోధన సంస్థలో చేరారు. అనంతరం భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలో అడుగుపెట్టారు.
- ప్రపంచస్థాయి వ్యవసాయ సంస్థల్లో రెండు దశాబ్దాలపాటు పనిచేశారు. పరిశోధనతోపాటు పరిపాలనాపరమైన విధులు నిర్వర్తించారు.
- దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఆహార కొరత తీవ్రంగా ఉండేది. విదేశాల నుంచి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకుంటే తప్ప ఆకలి తీరని పరిస్థితి. అప్పట్లో పంటల దిగుబడి చాలా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితిని మార్చేయాలని స్వామినాథన్ నిర్ణయించుకున్నారు. హరిత విప్లవానికి శ్రీకారం చుట్టారు.
- అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశపెట్టారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు పరిచయం చేశారు. ప్రభుత్వ సహకారంతో సాగునీటి సౌకర్యం పెంచారు. ఎరువులు, పురుగు మందుల వాడకం పెంచారు. సాగు విస్తీర్ణం భారీగా పెంచేందుకు కృషి చేశారు. ఇవన్నీ సత్ఫలితాలు ఇచ్చాయి.
- ప్రధానంగా వరి, గోధుమ వంగడాల అభివృద్ధికి స్వామినాథన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. హరిత విప్లవంతో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.
- హరిత విప్లవం కారణంగా ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగి భూసారం క్షీణిస్తోందని విమర్శలు వచ్చాయి. వీటితో స్వామినాథన్ ఏకీభవించారు. స్థానికంగా ఉండే వంగడాలను కాపాడుకోవాలని, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని, భూసారం కోల్పోయేలా రసాయనాలు వాడొద్దని సూచించారు.
- వ్యవసాయ రంగంలో పలు ప్రతిష్టాత్మక సంస్థలకు డైరెక్టర్‌గా, డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు.
- స్వామినాథన్‌ను ఎన్నో పురస్కారాలు వరించాయి. 1971లో రామన్ మెగసెసే, 1986లో వరల్డ్ సైన్స్, 1991లో ఎన్విరాన్‌మెంటల్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- 1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ పురస్కారాలు స్వీకరించారు.
- 20వ శతాబ్దంలో అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ఒకరిగా స్వామినాథన్‌ను ప్రఖ్యాత టైమ్ మేగజైన్ గుర్తించింది.
- 1988లో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ సంస్థ 1987లో తొలి ప్రపంచ ఆహార పురస్కారం అందుకుంది.
- 2007 నుంచి 2013 దాకా రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు.
- ప్రపంచవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల 84 గౌరవ డాక్టరేట్లను ఆయన ప్రదానం చేశాయి.
- 2023 సెప్టెంబర్ 28న 98 ఏళ్ల వయసులో చెన్నైలోని స్వగృహంలో స్వామినాథన్ కన్నుమూశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సినిమా

ఆస్కార్‌లో కొత్త అవార్డు



ఆస్కార్ అవార్డుల్లో ఓ కొత్త కేటగిరీ చేరనుంది. ప్రస్తుతం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. కొత్తగా క్యాస్టింగ్ డైరెక్టర్స్‌కు ఓ కేటగిరీని చేర్చినట్లు అకాడమీ వెల్లడించింది. దీంతో ఆస్కార్ అవార్డుల విభాగాల సంఖ్య 24కు చేరనుంది. కానీ ఈ ఏడాది మార్చి 10న జరగనున్న 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో కానీ, 2025లో జరిగే 97వ ఆస్కార్ అవార్డ్స్‌లో కానీ 'క్యాస్టింగ్ డైరెక్టర్స్' విభాగంలో అవార్డును ప్రదానం చేయరు. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఈ విభాగంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. అంటే.. 2025లో రిలీజయ్యే సినిమాలకు క్యాస్టింగ్ డైరెక్టర్స్ 98వ ఆస్కార్ అవార్డ్స్ కోసం నామినేట్ అవుతారు. ''ఫిల్మ్ మేకింగ్ విభాగంలో, ఆస్కార్ ప్రదానోత్సవంలో క్యాస్టింగ్ డైరెక్టర్స్ ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఇప్పుడు వారిని ఈ ప్రదానోత్సవంలో భాగం చేయడం గర్వంగా ఉంది'' అన్నారు ఆస్కార్ అకాడమీ అధ్యక్షుడు జానెట్ యంగ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ బిల్ క్రామెర్. ''క్యాస్టింగ్ డైరెక్టర్స్ ఆస్కార్ అవార్డు' అనేది మా కృషికి గుర్తింపుగా భావిస్తున్నాం. ఆస్కార్ అకాడమీకి థ్యాంక్స్'' అని క్యాస్టింగ్ డైరెక్టర్ బ్రాంచ్ గవర్నర్‌లు రిచర్డ్ హిక్స్, కిమ్ టేలర్-కోల్‌మన్, డెబ్రా జేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉంటే దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆస్కార్ అవార్డ్స్‌కు సంబంధించి ఓ కేటగిరీని చేర్చారని, చివరిసారిగా 2001లో బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్‌ను చేర్చారని హాలీవుడ్‌లో కథనాలు వస్తున్నాయి.

వ్యూహం ఫిక్స్



• అజ్మల్

'వ్యూహం' సినిమా విడుదలకు రూట్ క్లియర్ అయింది. ఈ నెల 23న ఈ సినిమా విడుదల కానుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం గత ఏడాది నవంబరు 10న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా ఈ సినిమాను విడుదల చేసుకోవచ్చని సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇవ్వడంతో ఈ నెల 23న రిలీజ్ చేస్తున్నట్లు రామ్‌గోపాల్ వర్మ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత రాజకీయ పార్టీలు ఎలాంటి వ్యూహాలు పన్నాయి? ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? వంటి కథాంశంతో 'వ్యూహం' రూపొందింది. ఈ చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో అజ్మల్ నటించారు.

యాత్ర 2 చాలామందికి నచ్చింది

- మహి వి. రాఘవ్



''యాత్ర 2' సినిమా కొందరికి నచ్చింది.. కొందరికి నచ్చలేదు. ఇది పొలిటికల్ మూవీ. రాజకీయ నాయకుడిపై తీశాం కాబట్టి భిన్నాభిప్రాయాలు రావడం సహజం. కానీ ఓ స్టోరీ టెల్లర్‌గా నేను అనుకున్న కథను తీశాను. చాలామందికి నా సినిమా నచ్చింది'' అని దర్శకుడు మహి వి. రాఘవ్ అన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన 'యాత్ర' (2019) కి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా, వైఎస్ భారతీ రెడ్డి పాత్రలో కేతకీ నారాయణ్ నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం సక్సెస్ మీట్‌లో మహి వి. రాఘవ్ మాట్లాడుతూ– ''యాత్ర 2 తీయాలని 2019లోనే నిర్ణయించుకున్నాను. తండ్రీ కొడుకుల (వైఎస్ఆర్, వైఎస్ జగన్) కథ చెప్పాలనుకున్నాను.. ఆ కథకు తగ్గట్టుగానే పాత్రలను పెట్టాను. 'యాత్ర 2'పై కొందరు పాజిటివ్, మరికొందరు నెగెటివ్ రివ్యూలు ఇచ్చారు. ఫిల్మ్ మేకర్లుగా సినిమా తీయడం మా బాధ్యత. విమర్శలను పట్టించుకోను. నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల సన్నివేశం తీశాను.. కానీ ఎడిటింగ్‌లో తీసేశాను. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు 'యాత్ర 2' చూడలేదు.. త్వరలో చూస్తారు. త్వరలో నా నుంచి 'సేవ్ ది టైగర్స్ 2' వెబ్ సిరీస్ రాబోతోంది'' అన్నారు.

ప్రతీ ఏడాదీ తెలుగు తెరపై కొత్త తారలు మెరుస్తుంటారు. ఈ ఏడాది కూడా కొందరు సొగసరులు టాలీవుడ్‌కి పరిచయమవుతున్నారు. కొందరు ఇప్పటికే వేరే భాషల్లో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లి, తెలుగు తెరకు కొత్త తారగా పరిచయం అవుతున్నారు. ఇంకొందరు వేరే భాషల్లో ఇప్పుడిప్పుడే పైకొస్తూ తెలుగుకి వస్తున్నారు. 'సొగసరీ... స్వాగతం' అంటూ వీరి రాక కోసం తెలుగు తెర వేచి చూస్తోంది.



• దీపికా పదుకోన్ • జాన్వీ కపూర్ • మాళవికా మోహనన్ • మానుషీ చిల్లర్ • శ్రీనిధీ శెట్టి

సొగసరీ... స్వాగతం

మోస్ట్ వాంటెడ్

హిందీలో పదిహేనేళ్లకు పైగా ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో భాగమయ్యారు దీపికా పదుకోన్. కానీ తెలుగులో స్ట్రయిట్ మూవీ చేయలేదు. 'కల్కి 2898 ఏడీ' చిత్రం దీపికాను తెలుగుకు ఆహ్వానించింది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్ హీరోయిన్. ఇక 'హెలెన్', 'కప్పేలా' వంటి మలయాళ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న అన్నా బెన్ కూడా 'కల్కి 28 98ఏడీ'తోనే తెలుగుకు ఎంట్రీ ఇస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది.

స్వాగతం బంగారం

దివంగత ప్రముఖ తార శ్రీదేవికి ఇటు దక్షిణాదిన అటు ఉత్తరాదిన బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె వారసురాలిగా ముందు ఆమె పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ ఎంట్రీని తెలుగు ఫ్యాన్స్ ఎప్పట్నుంచో ఆశిస్తున్నారు. 'దేవర' సినిమాతో అది నెరవేరుతోంది. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర'లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో జాన్వీ పాత్ర పేరు తంగమ్ (బంగారం). కొరటాల శివ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలోనూ జాన్వీ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారని సమాచారం.

ఈసారి నో డౌట్

హీరోయిన్ మాళవిక ఎంట్రీ టాలీవుడ్‌లో ఎప్పుడో జరగాల్సింది. విజయ్ దేవరకొండ, మాళవికా మోహనన్ జంటగా ఓ సినిమా ప్రారంభమై, అది క్యాన్సిల్ అయ్యింది. ఈ బ్యూటీ ఇప్పుడు 'రాజా సాబ్' సినిమాతో హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది.

బచ్చన్‌కు జోడీగా..

హిందీ చిత్రం 'యారియా 2'లో ఓ చిన్న పాత్ర చేసి పెద్ద పేరు తెచ్చుకున్నారు భాగ్య శ్రీ భోర్సె. ఈ పుణే మోడల్ 'మిస్టర్ బచ్చన్'తో తెలుగుకు పరిచయం కానున్నారు. హీరో రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకుడు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు భాగ్య శ్రీ భోర్సె. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లుగా తెలిసింది.

ప్రపంచ సుందరి కూడా...

2017లో మిస్ వరల్డ్‌గా నిలిచిన బాలీవుడ్ బ్యూటీ మానుషీ చిల్లర్ కూడా తెలుగు తెరపై కనిపించనున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన 'ఆపరేషన్ వాలెంటైన్' మానుషీకి తెలుగులో తొలి చిత్రం. వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఈ సినిమాకు శక్తి ప్రతాప్ సింగ్ దర్శకుడు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ కానుంది. ఇది వరుణ్ తేజ్‌కు హిందీలో తొలి చిత్రం కావడం విశేషం. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ పతాకాలపై సందీప్ ముద్దా ఈ సినిమాను నిర్మించారు.

నాట్యం టు నటన

నాట్య కళాకారిణి ప్రీతీ ముకుందన్ 'కన్నప్ప' సినిమాతో తెలుగు తెరపై నటిగా కనిపించనున్నారు. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'కన్నప్ప'. శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ముఖేష్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ప్రీతీ ముకుందన్‌ను తీసుకున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్‌లపై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది రిలీజ్ కానుంది.

బుజ్జి కన్నా.. వస్తున్నా...

తెలుగు ప్రేక్షకులకు 'బుట్ట బొమ్మ' అంటే పూజా హెగ్డే, 'బేబమ్మ' అంటే కృతీశెట్టి గుర్తొస్తారు. అలాగే 'బుజ్జి కన్నా' అంటే మలయాళ బ్యూటీ ఇవానా గుర్తొస్తారు. తమిళ హిట్ 'లవ్ టుడే'లో హీరోయిన్ ఇవానా 'బుజ్జి కన్నా..' అంటూ ప్రేమికుడిపై కురిపించిన ప్రేమ అందర్నీ ఆకట్టుకుంది. 'లవ్ టుడే' చిత్రం తెలుగులో అనువాదమై బంపర్ హిట్‌గా నిలిచింది. దీంతో తెలుగులో ఇవానాకు చాన్స్‌లు దక్కాయి. అలా స్ట్రెయిట్ ఫిల్మ్ 'సెల్ఫిష్'తో 'బుజ్జికన్నా.. వస్తున్నా!' అంటూ తెలుగు కుర్రాళ్ల మనసులను మరో మారు గెలిచేందుకు వస్తున్నారు ఇవానా. ఇందులో ఆశిష్ హీరోగా నటిస్తున్నారు. విశాల్ కాశీ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి 'దిల్' రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

తెలుసు కదా...

యశ్ 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో కన్నడలో, విక్రమ్ 'కోబ్రా'తో తమిళంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు మంగళూరు బ్యూటీ శ్రీనిధీ శెట్టి. ఈ యంగ్ బ్యూటీ 'తెలుసు కదా' అంటూ తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేస్తున్నారు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

డాటర్ ఆఫ్ జానీ లీవర్

బాలీవుడ్ ప్రముఖ హాస్య నటుడు జానీ లీవర్ కుమార్తె జెమీ లీవర్ హీరోయిన్‌గా తెలుగు పరిశ్రమకు వస్తున్నారు. 'హౌస్‌ఫుల్ 4', 'భూత్ పోలీస్' వంటి హిందీ సినిమాల్లో మెరిసిన జెమీ లీవర్ 'ఆ ఒక్కటీ అడక్కు' అనే తెలుగు సినిమా చేస్తున్నారు. రామ్ అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ''నా మాతృభాష తెలుగులో సినిమా చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఓ విధంగా మా గ్రాండ్ మదర్‌కు నేను ఇస్తున్న ఓ నివాళిగా ఈ సినిమాను భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు జెమీ. ఇక బాలీవుడ్ సినిమాల్లో పాపులర్ అయిన జానీ లీవర్ స్వస్థలం కనిగిరి అనే విషయం తెలిసిందే.

ఈ ఏడాది ఇంకెంత మంది కొత్త సొగసరులకు తెలుగు పరిశ్రమ స్వాగతం పలుకుతుందో చూడాలి.



• భాగ్యశ్రీ భోర్సె • ప్రీతీ ముకుందన్ • ఇవానా • జెమీ లీవర్

సాక్షి బిజినెస్

శనివారం
10-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	167	71,595
నిఫ్టీ ▲	65	21,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,937	▲ 142
డోజోన్స్	38,606	▽ 121
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,573	▽ 23
డాక్స్	16,927	▽ 37
షాంఘై	2,866	▲ 36
నికాయ్	36,879	▲ 34

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,624	▲ 12
బంగారం (99.5 స్వచ్ఛత)	62,373	▲ 12
వెండి (కిలో)	70,638	▲ 688

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.57	83.59
£	బ్రిటన్ పౌండ్		103.55	106.09
€	యూరో		88.33	90.67
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.00	54.94
¥	జపాన్ ఎన్ (100)		43.00	68.00
S$	సింగపూర్ డాలర్		59.36	64.06
SAR	సౌదీ రియాల్		21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్		21.71	23.50
¥	చైనా యువాన్		10.42	12.50

మహీంద్రాతో ఎంబ్రేయర్ భాగస్వామ్యం



ముంబై: భారత వైమానిక దళం కోసం సీ–390 మిలీనియం మల్టీ మిషన్ రవాణా విమానాల కొనుగోళ్లకు సంబంధించిన మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) ప్రాజెక్ట్ కోసం ఎంబ్రేయర్ డిఫెన్స్, సెక్యూరిటీ తాజాగా మహీంద్రా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలోని బ్రెజిల్ దౌత్య కార్యాలయంలో ఈ మేరకు ఒప్పందంపై ఇరు సంస్థలు శుక్రవారం సంతకాలు చేశాయి. ఎంటీఏ ప్రాజెక్టులో భాగంగా తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దేశీయంగా ఉన్న ఏరోస్పేస్ పరిశ్రమతో ఎంబ్రేయర్, మహీంద్రా సంప్రదింపులు జరుపనుంది. సీ–390 విమానాల విషయంలో భవిష్యత్తు కేంద్రంగా భారత్‌ను మార్చగల సామర్థ్యాన్ని ఇరు సంస్థలు అన్వేషిస్తాయి. 'సీ–390 మిలీనియం మార్కెట్లో అత్యంత అధునాతన మిలిటరీ ఎయిర్‌లిఫ్టర్. ఈ భాగస్వామ్యం ఐఏఎఫ్ కార్యాచరణ నైపుణ్యాన్ని పెంపొందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలతో సజావుగా సరిపోయే సమర్థవంత పారిశ్రామికీకరణ పరిష్కారాన్ని కూడా అందిస్తుందని నమ్ముతున్నాము' అని మహీంద్రా ఏరోస్పేస్, డిఫెన్స్ బిజినెస్ ప్రెసిడెంట్ వినోద్ సహాయ్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా, మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) కొనుగోలు ప్రాజెక్టులో భాగంగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) 40 నుంచి 80 విమానాలను కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకోసం భారత్‌కు సాంకేతిక బదిలీతోపాటు తయారీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. 18 నుంచి 30 టన్నుల వరకు బరువు మోయగల విమానాలను ఐఏఎఫ్ సేకరించనుంది.

పేటీఎం ఈ-కామర్స్ ఇక పాయ్ ప్లాట్‌ఫామ్స్



న్యూఢిల్లీ: పేటీఎం ఈ–కామర్స్ పేరు పాయ్ ప్లాట్‌ఫామ్స్‌గా మారింది. పేరు మార్పు కోసం మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా ఫిబ్రవరి 8న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి ఆమోదం లభించిందని సంస్థ శుక్రవారం తెలిపింది. పేటీఎం ఈ–కామర్స్‌లో ఎలివేషన్ క్యాపిటల్‌కు మెజారిటీ వాటా ఉంది. పేటీఎం ఫౌండర్, సీఈవో విజయ్ శేఖర్ శర్మతోపాటు సాఫ్ట్ బ్యాంక్, ఈబే సైతం ఈ కంపెనీలో పెట్టుబడి చేశాయి. అలాగే ఓఎన్‌డీసీ వేదికగా విక్రయాలు సాగిస్తున్న ఇన్నోబిట్స్ సొల్యూషన్స్ (బిట్సిలా) అనే కంపెనీని పేటీఎం ఈ–కామర్స్ కొనుగోలు చేసినట్టు సమాచారం. 2020లో బిట్సిలా కార్యకలాపాలు ప్రారంభించింది. ఓఎన్‌డీసీలో టాప్–3 సెల్లర్ ప్లాట్‌ఫామ్స్‌లో ఒకటిగా నిలిచింది.

నిబంధనలు పాటించడంపై కమిటీ: పేటీఎం అసోసియేట్ పేమెంట్సు బ్యాంకుపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో నిబంధనల పాటింపు, నియంత్రణపరమైన వ్యవహారాలపై తగు సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేక అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేటీఎం బ్రాండు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. దీనికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మాజీ చైర్మన్ ఎం దామోదరన్ నేతృత్వం వహిస్తారని వివరించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మాజీ ప్రెసిడెంట్ ఎంఎం చితాలే, ఆంధ్రా బ్యాంక్ మాజీ సీఎండీ ఆర్ రామచంద్రన్ ఇందులో సభ్యులుగా ఉంటారని పేర్కొంది.

జనరిక్స్‌పై మెడ్‌ప్లస్...
మరింత ఫోకస్

- సొంత బ్రాండ్ ఔషధాలపై 80 శాతం వరకు డిస్కౌంట్
- 6 నెలల్లో లక్షలాది కస్టమర్లకు దాదాపు రూ. 140 కోట్ల ఆదా
- సంస్థ ఎండీ గంగాడి మధుకర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల రిటైల్ దిగ్గజం మెడ్‌ప్లస్ 'స్టోర్ జనరిక్' కాన్సెప్టుపై మరింతగా దృష్టి పెడుతోంది. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఈ కాన్సెప్టును దేశీయంగా తాము తొలిసారి ప్రవేశపెట్టినట్లు మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండీ, సీఈవో గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. దీని కింద తమ స్టోర్స్‌లో నాణ్యమైన సొంత బ్రాండ్ ఔషధాలపై ఉత్పత్తిని బట్టి 50–80 శాతం మేర, సగటున 60 శాతం మేర డిస్కౌంటుకే విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇతర బ్రాండ్స్‌తో పోలిస్తే మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ చానల్‌పరమైన వ్యయాల భారం తమకు ఉండని కారణంగా ఇది సాధ్యపడుతోందని మధుకర్ చెప్పారు. తొలుత హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించిన ఈ మోడల్‌ను క్రమంగా దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. దీనితో ఏడు రాష్ట్రాల్లో 26.2 లక్షల మంది పైచిలుకు కస్టమర్లకు గడిచిన ఆరు నెలల్లో రూ. 139.7 కోట్ల మేర ఆదా అయిందని ఆయన వివరించారు. దేశీయంగా దాదాపు 800 పైగా ఔషధాలు ఉండగా .. 600 పైగా జనరిక్స్‌ను తాము అందిస్తున్నట్లు మధుకర్ చెప్పారు.

దిగ్గజ సంస్థలతో జట్టు ..

''సాధారణంగా జనరిక్స్ అంటే అంత నాణ్యమైనవి కాకపోవచ్చనే అపోహ ఉంటోంది. అయితే, బ్రాండెడ్, అన్‌బ్రాండెడ్ అనే తేడా లేకుండా పేటెంటు ముగిసిపోయిన ఔషధాన్ని ఎవరు తయారు చేసినా అది జనరిక్ ఔషధమే. కాకపోతే ఎంత నాణ్యతతో తయారు చేస్తున్నారనేది ముఖ్యం. మా వరకు మేము నాణ్యతకు పెద్దపీట వేస్తూ అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మా, విండ్‌లాస్ బయోటెక్ వంటి దేశీయంగా అగ్రగామి ఔషధ తయారీ సంస్థ (సీడీఎంవో)ల దగ్గర జనరిక్స్‌ను తయారు చేయిస్తున్నాం. అధునాతన టెక్నాలజీలతో వాటి నాణ్యతను మేము కూడా స్వయంగా పరీక్షిస్తాం. పలు దిగ్గజ ఫార్మా సంస్థలకు కూడా ఈ సంస్థలు జనరిక్స్ అందిస్తున్నాయి. తమ ఫ్యాక్టరీల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ యూనియన్ నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తున్నాయి. కాబట్టి నాణ్యత విషయంలో రాజీ ఉండదు. అదే సమయంలో వేల సంఖ్యలో ఉన్న మా స్టోర్స్ ద్వారా విక్రయించడంతో మాకు మార్కెటింగ్‌పరమైన వ్యయాలు ఉండవు కాబట్టి ఆ మేరకు ప్రయోజనాలను కస్టమర్లకు నేరుగా బదలాయించగలుగుతున్నాం'' అని మధుకర్ వివరించారు. దేశీ ఫార్మా విభాగంలో ఇదొక విప్లవాత్మక మార్పు కాగలదని ఆయన తెలిపారు. మరోవైపు, వైద్య పరీక్షల సేవలనూ గణనీయంగా విస్తరిస్తున్నామన్నారు. మెడ్‌ప్లస్‌కి ప్రస్తుతం పది రాష్ట్రాల్లో 4,200 పైచిలుకు స్టోర్స్‌లో సంఘటిత రిటైల్ ఫార్మసీ పరిశ్రమలో 30 శాతం మార్కెట్ వాటా ఉంది.

హీరో మోటో
డివిడెండ్ రూ. 100
క్యూ3 లాభం రూ. 1,093 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 1,093 కోట్లను తాకింది. వివిధ ప్రాంతాలలో అమ్మకాలు పుంజుకోవడం లాభాలకు దోహదపడింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 726 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం



ఆదాయం సైతం రూ. 8,300 కోట్ల నుంచి రూ. 10,031 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 18 శాతం అధికంగా 14.6 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కంపెనీ చైర్మన్ ఎమెరిటస్ బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ శత జయంతి సందర్భంగా రూ. 25 ప్రత్యేక డివిడెండుతో కలిపి వాటాదారులకు కంపెనీ బోర్డు మొత్తం షేరుకి రూ. 100 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. రూ. 600 కోట్లు వెచ్చించడం ద్వారా విడిభాగాలు, యాక్సెసరీస్, మెర్కండైజ్ బిజినెస్‌ను విస్తరించే ప్రణాళికల్లో ఉన్నట్లు హీరో మోటోకార్ప్ తాజాగా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేరు 2 శాతం లాభంతో రూ. 4,909 వద్ద ముగిసింది.

మార్కెట్‌కు బ్యాంకింగ్ షేర్ల దన్ను


సెన్సెక్స్ 167 పాయింట్లు, నిఫ్టీ 65 పాయింట్లు అప్

ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ షేర్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితర స్టాక్స్‌లో కొనుగోళ్ల ఊతంతో శుక్రవారం దేశీ సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 167 పాయింట్లు (0.23 శాతం) లాభపడి 71,595 వద్ద, నిఫ్టీ సుమారు 65 పాయింట్లు లాభంతో (0.30 శాతం) 21,782.50 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 71,676–71,200 శ్రేణిలో తిరుగాడింది.

ఆద్యంతం హెచ్చుతగ్గులకు లోనైన మార్కెట్.. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లతో స్వల్పంగా లాభపడిందని విశ్లేషకులు తెలిపారు. మరోవైపు, మెటల్, టెలికం, విద్యుత్ రంగ సంస్థల షేర్లలో అమ్మకాలు జరిగాయి. వేల్యుయేషన్లు భారీగా పెరిగిపోవడంతో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అత్యధికంగా ఒత్తిడికి గురైనట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

52 వారాల గరిష్టానికి జొమాటో.. పేటీఎం మరింత డౌన్..

క్యూ3లో లాభాలు ప్రకటించిన ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో షేర్లు దాదాపు 4 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో ఒక దశలో 5 శాతం ఎగసి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 151ని తాకాయి. చివరికి సుమారు 4 శాతం లాభంతో రూ. 149.45 వద్ద క్లోజయ్యాయి. మరోవైపు, పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్ల పతనం కొనసాగుతోంది. కంపెనీ షేరు బీఎస్‌ఈలో మరో 6 శాతం క్షీణించి రూ. 419.85 వద్ద క్లోజయ్యింది. రెండు రోజుల్లో షేరు 15 శాతం మేర పతనమైంది. రూ. 4,871 కోట్ల మార్కెట్ వేల్యుయేషన్ కరిగిపోయింది. నిబంధనల ఉల్లంఘన కారణంగా.. ఫిబ్రవరి 29 నుంచి దాదాపుగా అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలంటూ వన్97కి అసోసియేట్ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ బ్యాంకును ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే.



మరిన్ని విశేషాలు..

- బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.36 శాతం, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.82 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 1.97 శాతం, మెటల్ 1.62 శాతం, టెలికమ్యూనికేషన్ 1.45 శాతం, విద్యుత్ 1.10 శాతం మేర తగ్గాయి. బ్యాంకెక్స్, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు లాభపడ్డాయి.
- విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐ) నికరంగా రూ. 142 కోట్లు కొనుగోళ్లు చేయగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 422 కోట్ల మేర విక్రయాలు జరిపారు.
- వారంవారీగా చూస్తే సెన్సెక్స్ 490 పాయింట్లు (0.67 శాతం), నిఫ్టీ 71 పాయింట్లు (0.32 శాతం) మేర తగ్గాయి.
- ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై లాభాల్లోనూ, హాంకాంగ్ నష్టాల్లోనూ ముగిశాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

విశాఖలో వోల్టాస్ 3వ స్టోర్



హైదరాబాద్: టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ ఏసీ కంపెనీ, వోల్టాస్ విస్తరణ ప్రణాళికలో భాగంగా విశాఖపట్నంలో మూడవ స్టోర్‌ను ప్రారంభించింది. దీనితో రాష్ట్రంలో సంస్థ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్ సంఖ్య 11కు చేరింది. విశాఖ స్టోర్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ప్రదీప్ బక్షి ప్రారంభించారు. వినియోగదారులకు వినూత్న ఉత్పత్తి శ్రేణిని అందించాలన్నది తమ లక్ష్యమని ఈ సందర్భంగా బక్షి పేర్కొన్నారు. కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధునాతన ఫీచర్లతో కూడిన ఉత్పత్తులను సంస్థ అందిస్తోందని తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



మెరిసిన వార్నర్... ఆసీస్‌దే తొలి టి20

వెస్టిండీస్ జట్టుతో శుక్రవారం హోబర్ట్‌లో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 11 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెరీర్‌లో 100వ అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన ఆసీస్ డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ (36 బంతుల్లో 70: 12 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. అనంతరం విండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 202 పరుగులు సాధించింది. బ్రాండన్ కింగ్ (37 బంతుల్లో 53: 7 ఫోర్లు, 1 సిక్స్), చార్లెస్ (42: 6 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (34 నాటౌట్: 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్‌తో వార్నర్ మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కనీసం 100 మ్యాచ్‌ల చొప్పున ఆడిన మూడో క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో కోహ్లి (భారత్), రాస్ టేలర్ (న్యూజిలాండ్) ఉన్నారు.

నిసాంక 210 నాటౌట్

వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన శ్రీలంక ఓపెనర్

139 బంతుల్లో 8 సిక్స్‌లు, 20 బౌండరీలతో ద్విశతకం

ఈ ఘనత సాధించిన పదో క్రికెటర్‌గా గుర్తింపు

తొలి వన్డేలో అఫ్గానిస్తాన్‌పై లంక గెలుపు



నిసాంక

పల్లెకెలె: ఓపెనర్ పతున్ నిసాంక (139 బంతుల్లో 210 నాటౌట్; 20 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ఫలితంగా అఫ్గానిస్తాన్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 42 పరుగుల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ముందుగా లంక నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. నిసాంక ప్రత్యర్థి బౌలింగ్‌పై కడదాకా విధ్వంసం కొనసాగించాడు. 88 బంతుల్లో సెంచరీ సాధించిన ఈ ఓపెనర్ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో తర్వాతి 100 పరుగుల్ని కేవలం 48 బంతుల్లోనే సాధించడంతో 136 బంతుల్లో అతని డబుల్ సెంచరీ పూర్తయ్యింది. ఇప్పటివరకు వన్డేల్లో లంక టాప్ స్కోరర్‌గా నిలిచిన మాజీ ఓపెనర్ సనత్ జయసూర్య (189) ప్రేక్షకుడిగా హాజరైన ఈ మ్యాచ్‌లోనే నిసాంక అతని రికార్డును అతని కళ్లముందే బద్దలు కొట్టడం విశేషం. అవిష్క ఫెర్నాండో (88 బంతుల్లో 88; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో తొలి వికెట్‌కు 182 పరుగులు జోడించిన నిసాంక... సమరవిక్రమ (45; 4 ఫోర్లు, 1 సిక్స్)తో మూడో వికెట్‌కు 120 పరుగులు జత చేశాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 339 పరుగులు చేసి పోరాడి ఓడింది. 27/4 స్కోరు వద్ద కష్టాల్లో పడిన జట్టును అజ్మతుల్లా ఒమర్జాయ్ (115 బంతుల్లో 149 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు), మొహమ్మద్ నబీ (130 బంతుల్లో 136; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకాలతో నడిపించారు. ఇద్దరు ఆరో వికెట్‌కు 242 పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో మదుషాన్ 75 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. రేపు ఇదే వేదికపై రెండో వన్డే జరుగుతుంది.

12 ఓవరాల్‌గా అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో నమోదైన డబుల్ సెంచరీల సంఖ్య. ఇందులో సగానికి (7)పైగా బాదింది భారత బ్యాటర్లే! ఒక్క రోహిత్ శర్మే మూడు ద్విశతకాలను సాధించాడు. భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్ ఈ జాబితాలో ఉన్నారు. మార్టిన్ గప్టిల్ (న్యూజిలాండ్), క్రిస్ గేల్ (వెస్టిండీస్), ఫఖర్ జమాన్ (పాకిస్తాన్), మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా) కూడా వన్డేల్లో డబుల్ సెంచరీలు చేశారు.

3 నిసాంకది వన్డేల్లో మూడో వేగవంతమైన డబుల్ సెంచరీ (138 బంతుల్లో). ఈ జాబితాలో మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో), ఇషాన్ కిషన్ (131 బంతుల్లో) ముందు వరుసలో ఉన్నారు.

అయ్యర్ అనుమానమే!

గాయాలతో సతమతమవుతున్న బ్యాటర్



న్యూఢిల్లీ: రెండో టెస్టులో గెలిచి సిరీస్ సమం చేసిన ఆనందంలో ఉన్న భారత్‌కు ఎదురుదెబ్బ! మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయంతో మిగతా మూడు టెస్టులకూ దూరం కావడం ఖాయమైంది. అతను వెన్నెముక, గజ్జల్లో గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. జట్టు ఫిజియో అతని ఫిట్‌నెస్‌పై సందేహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ 'అయ్యర్ తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. సిరీస్‌లో మిగతా మూడు టెస్టుల్లో అతను ఆడే అవకాశాలు లేవు' అని పేర్కొన్నాడు. బోర్డు మెడికల్ టీమ్ 29 ఏళ్ల అయ్యర్ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిసింది. గతేడాది అతని వెన్నెముకకు శస్త్రచికిత్స చేశారు. అయితే మళ్లీ గాయం తిరగబడటంతో బోర్డు ప్రత్యేక దృష్టి సారించనుంది. ఆడిన తొలి రెండు టెస్టుల్లోనూ అయ్యర్ చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబరచలేకపోయాడు. నాలుగు ఇన్నింగ్స్‌లు ఆడే అవకాశం వచ్చినా... ఒక్క ఫిఫ్టీ కూడా సాధించలేకపోయాడు. వరుసగా 35, 13, 27, 29 స్కోర్లే చేశాడు. ఇప్పటికే అనుభవజ్ఞుడైన కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ముందుగా తొలి రెండు టెస్టుల వరకే అనుకున్నప్పటికీ మొత్తం సిరీస్‌కే దూరం కానున్నట్లు తెలిసింది. తొలి టెస్టు సందర్భంగా సీనియర్లు కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా గాయపడటంతో రెండో టెస్టు నుంచే వాళ్లిద్దరు అందుబాటులో లేకుండాపోయారు. రాజ్‌కోట్‌లో ఈనెల 15న మొదలయ్యే మూడో టెస్టుకు సమయం ఉండటంతో జట్టు ఎంపిక ఆలస్యం అవుతోంది. నేడో, రేపో మిగతా మూడు టెస్టులకు టీమిండియాను ప్రకటించే అవకాశముంది. అనంతరం ఎంపికైన జట్టు 11న రాజ్‌కోట్‌కు చేరుకుంటుంది. స్వల్ప విరామం తీసుకొని అబుదాబిలో సేదతీరుతున్న ఇంగ్లండ్ జట్టు కాస్త ఆలస్యంగా వేదికకు చేరుకుంటుంది.

తన్మయ్, తిలక్ వర్మ సెంచరీలు





హైదరాబాద్ 383/5

సాక్షి, హైదరాబాద్: నాగాలాండ్ జట్టుతో మొదలైన రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ సెమీఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 383 పరుగులు సాధించింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (192 బంతుల్లో 164; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ తిలక్ వర్మ (135 బంతుల్లో 101; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. రోహిత్ రాయుడు (59; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. తన్మయ్, రోహిత్ రాయుడు రెండో వికెట్‌కు 143 పరుగులు... తన్మయ్, తిలక్ మూడో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. రాహుల్ సింగ్ (5), రవితేజ (15) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ప్రస్తుతం నితేశ్ రెడ్డి (21 బ్యాటింగ్), ప్రజ్ఞయ్ రెడ్డి (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే హైదరాబాద్ జట్టు మళ్లీ ఎలైట్ డివిజన్‌కు అర్హత సాధిస్తుంది. మరోవైపు మేఘాలయాతో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో మిజోరం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకు ఆలౌటైంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మేఘాలయా 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది.

టైటిల్ పోరుకు సాకేత్-రామ్ జోడీ



చెన్నై: కెరీర్‌లో 16వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించడానికి భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని విజయం దూరంలో నిలిచాడు. చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో సాకేత్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ పురుషుల డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–నిక్కీ పునాచా (భారత్) జంటతో నేడు జరిగే ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం తలపడుతుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో సాకేత్–రామ్‌కుమార్ 6–3, 6–2తో రెండో సీడ్ తొషిహిడె మత్సుయ్–కైటో యుసుగి (జపాన్)లపై నెగ్గగా... రిత్విక్–నిక్కీ పునాచా 6–3, 4–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో జేకబ్ ష్నైటర్–మార్క్ వాల్నర్ (జర్మనీ)లను ఓడించారు. 58 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సాకేత్–రామ్ జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

భారత్‌కు తొలి విజయం



భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టింది. సొంతగడ్డపై ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన భారత మహిళల జట్టు నాలుగో మ్యాచ్‌లో విజయం రుచి చూసింది. అమెరికా జట్టుతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సవితా పూనియా బృందం 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున వందన కటారియా (9వ ని.లో), దీపిక (26వ ని.లో), సలీమా టెటె (56వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. అమెరికా జట్టుకు సేన్ కార్ల్స్ (42వ ని.లో) ఏకైక గోల్ అందించింది. భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు, అమెరికా జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అయితే రెండు జట్లు ఈ పెనాల్టీ కార్నర్‌లను వృథా చేశాయి. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో భారత్ మూడు పాయింట్లతో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉంది. సోమవారం జరిగే ఐదో మ్యాచ్‌లో చైనాతో భారత్ ఆడుతుంది.

ప్లే ఆఫ్స్‌కు చేరువగా గుజరాత్ జెయింట్స్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టు 11వ విజయాన్ని నమోదు చేసింది. తద్వారా ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించేందుకు మరింత చేరువైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 41–32తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. గుజరాత్ తరఫున ప్రతీక్ దహియా 13 పాయింట్లు, రాకేశ్ 11 పాయింట్లు స్కోరు చేశారు. ప్రస్తుతం గుజరాత్ 60 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 50–34తో యూపీ యోధాస్‌ను ఓడించింది. హరియాణా విజయంతో 69 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న దబంగ్ ఢిల్లీకి కూడా ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారైంది.

రాణించిన శశికాంత్, రికీ భుయ్: ఆంధ్ర 236/4



సాక్షి, విజయనగరం: ఉత్తరప్రదేశ్ జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు నిలకడగా ఆడుతోంది. డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 232 పరుగులు సాధించింది. ఆల్‌రౌండర్ కేవీ శశికాంత్ (83 బంతుల్లో 72; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (90 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. శశికాంత్ అవుటయ్యాక రికీ భుయ్‌తో కలిసి కరణ్ షిండే (45 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) జట్టును ఆదుకున్నాడు. ఐదో వికెట్‌కు రికీ భుయ్, కరణ్ అభేద్యంగా 116 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో యశ్ దయాళ్, అంకిత్ రాజ్‌పుత్, ఆకీబ్ ఖాన్, సౌరభ్ కుమార్ ఒక్కో వికెట్ తీశారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.